TEXT FLY WITHIN THE
BOOK ONLY

UNIVERSAL LIBRARY
OU_204540
UNIVERSAL LIBRARY

# జాతక కథా గుచ్ఛము

ప్రతులు ౫౦౦

సర్వస్వామ్యసంకలితము

First Edition—1939.

Printed at Andhra Grandhalaya Press,
BEZWADA

# ఉపోద్ఘాతము

జాతకకథలనఁగా నేఁటికి రమారమి రెండువేల నన్నూఱేండ్లకు ముందు మన హిందూదేశమున జనియించిన మత ప్రవక్తలలోఁ బ్రథమాచార్యుఁడగు గౌతమ బుద్ధుని పూర్వావతారకథలు. శూన్యవాదము, నిరాత్మవాదము మొదలగు బౌద్ధ సిద్ధాంతములను ఖండించిన శ్రీ శంకరాచార్యులవంటివారు సైతము "భగవాన్ శౌద్ధోదనిః" యని బుద్ధుని గౌరవించుట, యా సిద్ధాంతమునే జగన్మిథ్యాత్వరూపమునఁ బ్రతిపాదించుటఁజేసి కాఁబోలు బ్రచ్ఛన్నబౌద్ధుఁడని శంకరాచార్యుఁడు పరమతస్థులచే దూషింపఁబడుటయుఁజూడ నాకాలమందలి జను లాతనిని భగవంతునికన్న మిన్నగా సంభావించి యుందు రన్న నతిశయోక్తికాదు. దుష్టశిక్షణ శిష్టరక్షణార్థము శ్రీమన్నారాయణుఁడు దశావతారములు ధరించెనని విశ్వసించు హిందూ ధర్మావలంబకులవలెనే తన్మతావలంబకు లగు తద్భక్తు లా మహాత్ముఁడును శాంతి, దాంతి భూత దయా, దాన, వైరాగ్యాద్యులగు ధర్మములను బోధించి యైహిక సుఖపరతంత్రమగు మూఢ హృదయములను నిర్వాణపరతంత్రములనుగాఁ జేసి లోకము నుద్ధరింపఁదలఁచి యైదున్నూట నలువదేడవతారము లెత్తెనని విశ్వసించుచున్నారు. ప్రత్యవతారమునందును శ్రీమన్నారాయణునివలెనే లోకోపకారార్థము మహాత్యాగముఁగావించెననియు నమ్ముచున్నారు. హిందూమతస్థులు బుద్ధుఁడు నారాయణావతార మని విశ్వసించినను బౌద్ధులట్లు విశ్వసింపరు.

యథార్థము విచారింప హిందూబౌద్ధమతసిద్ధాంతములకు వైజాత్యముకన్న సాజాత్య మధికము. ఈ విషయమును నిట గ్రంథవిస్తరభీతిచే సంగ్రహింతును. బుద్ధుఁడు చార్వాకునివలె నాస్తికుఁడుగాఁడు. హిందూగృహస్థులకువలె 'వేదోక్తములగు గార్హస్థ్య ధర్మములలో హింసాత్మకములగు శ్రౌతయజ్ఞ యాగములును చాతుర్వర్ణ్య భేదమును బుద్ధునకు సమ్మతములుగావు. "మరియు నచింత్యమైన యాత్మానాత్మవిచార మను శుష్కవాదములోఁ బడక వైరాగ్యముచే మనస్సును నిష్కామముగాఁజేసికొమ్ము; ఆత్మ యున్నను లేకున్నను మనోనిగ్రహము ప్రథమకార్యము." అనియే బుద్ధుని సిద్ధాంతము. శంకరులవారు నుడివిన బ్రహ్మముగానీ ఆత్మగానీ బొత్తుగా లేనేలేదని యాతని యుద్దేశముగాదు. ఏలనఁ గొన్ని సుత్తలందు బుద్ధుఁడే బ్రహ్మసహవ్యతాయు స్థితి నుదాహరించెను. మరియు "నేను బ్రహ్మభూతుఁడనైయున్నాను" అని పెక్కుచోట్ల ముక్తకంఠముతోఁ బలికెను. ఆత్మనుగూర్చి చేయు పాతాళప్రశ్నలు మాని "అహింస, సత్యము, అస్తేయము, శౌచము, మనఃపూతత, సత్పాత్రదానము, ఆత్మోపమ్యదృష్టి" మొదలగు నిర్వాణప్రాప్తిసాధనముల నవలంబింపుఁడని బోధించెను. రోగమును గుదుర్చుటకుముందు దాని మూలకారణమును గుర్తించి వైద్యుఁడు దానినిఁ

దొలఁగించునట్లు సాంసారికదుఃఖరూపమగు రోగము నుపశమింపఁజేయుటకుఁ దత్కారణ మారసి నిర్మూలింపవలయును. సంసారదుఃఖమునకుఁ గారణము తృష్ణ లేక వాసన. ఒక నామరూపాత్మకమగు దేహము నశించినపిమ్మట మిగిలియున్న యీ వాసనాత్మక బీజమునుండి మఱొక నామరూపాత్మకమైన దేహము వెలువడును. దానినుండి వేరొకటి యుదయించును. కావున నీ పునర్జన్మరూపమగు సంసారదుఃఖమునుండి విముక్తుఁడగుటకు మానవుఁడు యత్నింపవలెను. దానికి సాధనములు వైరాగ్యము, ఇంద్రియనిగ్రహము, అహింస, భూతదయ మొదలగునవి. వీనిమూలమునఁ దృష్ణ లేక వాసన నున్మూలింపవలయును. ఈ క్రమమునే బౌద్ధులు దుఃఖము, సముదయము, నిరోధము, మార్గము అని పేర్కొని వీనికి నార్యసత్యములని పేరిడిరి. ఇందలి నాల్గవ సత్యమైన మార్గము, అనఁగా వాసనాక్షయము లేక తృష్ణాక్షయము లేక నిర్వాణము (దీప మాఱిపోయినవిధమున వాసనలాఱుట) ను బొందుటకు మనుష్యుఁడు మనస్సును నిర్విషయముగాఁ జేసికొనుట. ఉపనిషత్కారులు చెప్పిన ఆత్మనిష్ఠ, బ్రహ్మసంస్థ, బ్రహ్మభూతత, బ్రహ్మనిర్వాణము, అను నవస్థయు పైని బుద్ధుని నాల్గవసత్యమగు మార్గమును భిన్నములుగావనియే దోఁచును. రెండు ధర్మములయందును మనస్సుయొక్క నిర్విషయస్థితియే సాధ్యము.

బుద్ధుఁడాత్మాస్తిత్వము నిరాకరింపకున్నను చిత్తమును ప్రశాంతము విరక్తము నిష్కామమును జేయుటకు సోపానములగు వైరాగ్యాదులే నిర్వాణప్రాప్తిసాధనములని చెప్పుటవలన నుపనిషత్కారుల మోక్షసాధనములే పేర్కొనఁబడినవగుచున్నవి. కావున బౌద్ధులయొక్కయు హిందువులయొక్కయు వర్ణన లీషద్భేదముతో సరిపోవుచున్నవి. మఱియుఁ బునర్జన్మ సిద్ధాంతములు, పాపపుణ్య ఫలకల్పనములు, కర్మవిపాకము మొదలగునవన్నియు నీరెండు మతములందును తుల్యములే. కావున గృహస్థాచరణీయ యజ్ఞయాగాది కర్మలయందును, చాతుర్వర్ణ్య వ్యవస్థాదికములగు కొన్ని యల్ప విషయములందును దక్క నవశిష్టములగు మతధర్మములందు హిందూబౌద్ధులకు భేదము లేదనవచ్చును. తెన్నుగా విచారింప బౌద్ధధర్మ మను పుత్రుఁడు వైదికధర్మమను తండ్రికడఁ బంచుకొని వేఱుపడ్డవాఁడే కాని భిన్నుఁడుగాఁడు. అనఁగా సనాతన హిందూధర్మములనుండి గ్రహింపఁబడినదే కాని క్రొత్తదికాదు. ఆకాలమున వైదికమత మడుగంటి బౌద్ధమతమే విశేషముచే భరతఖండమాత్రమే కాక టిబేటు, చైనా, జావా, సుమిత్రా, సింహళము మొదలగు దేశములకుఁగూడఁ బ్రాఁకిపోయెనన్న గృహస్థులకు యజ్ఞ యాగాది కర్మకాండపీడయుఁ జాతుర్వర్ణ్య భేదపిశాచమును వదలిపోవుటచేతనే యయి యుండునని నాయూహ.

వైదిక ధర్మములను పురాణములువోలె బౌద్ధధర్మములను జాతకకథలు వివరించుచున్నవి. జనసామాన్యము కథలమూలమున విజ్ఞానమును సాధించునట్లు శుష్క-

# ఉపోద్ఘాతము

వేదాంత గ్రంథములవలన సాధింపదనుట నిర్వివాదాంశము. కావ్యము కాంతాసమ్మిత మనుటలోఁగల రహస్యమిదియే. అట్లగుటఁ బ్రపంచములోని యెల్లభాషలందును గావ్య వాఙ్మయమునకుఁగల ప్రతిష్ఠ విశిష్టము.


ఈ జాతకకథలు మొట్టమొదటఁ బాళీభాషలో వ్రాయఁబడియున్నవి. వీనిలోని ముప్పదిరెండుకథలను ఆర్యశూరుఁడను కవి సంస్కృతీకరించి 'జాతకమాల' యని పేరిడెను. దానినుండి యయిదు కథలనుమాత్రము గొని రసానుకూలములని నాకుఁ దోఁచిన యలఁతిమార్పులను గావించుకొని యీ చిన్నిపొత్తమును విరచించితిని. గుణగ్రహణపారీణులగు కోవిదులు నా యీ సాహసమును మన్నింతురుగాక.

గోకులము, సికింద్రాబాద్.
22—5—1939.

గ్రంథకర్త.

# విషయసూచి.


| | | పుట |
|---|---|---|
| క్షాంతివాది జాతకము. | ... | ౧ |
| వ్యాఘ్రి జాతకము. | ... | ౩౭ |
| శిబి జాతకము | ... | ౫౧ |
| విశ్వాంతర జాతకము | ... | ౬౫ |
| శుద్ధబోధి జాతకము | ... | ౯౨ |



# జాతక కథా గుచ్ఛము

## క్షాంతివాది జాతకము

క. ఒకతూరి బోధిసత్త్వుం
డకలంకప్రకృతి బ్రాహ్మణాన్వయమందున్
సకలగుణార్ణవుఁ డగు పు
త్త్రకుఁడై శుభలగ్నమందుఁ బ్రభవం బయ్యెన్. ౧

ఉ. పున్నమచందమామ నగు ముద్దుమొగంబును, దమ్మిరేకులన్
బన్నపడంగఁజేయు నయనమ్ములుఁ, జక్కనియెత్తు నెన్నొసల్
పెన్నురమున్, దృఢాంగమును, బెంపగు మూఁపులు, దీర్ఘబాహువుల్
సొన్నపు మేనిచాయఁ దగి శోభిలు నాతఁడు చక్కనయ్య నాన్. ౨

ఆ. వె. వానికన్నముందో ? వానితోడనో పుట్టె
భూతదయ ప్రభూతముగ నెడంద
క్షాంతి దాంతి తొట్టి సద్గుణసముదాయ
ముగ్గుపాల తోడ నుప్పతిల్లె. 3

క. కఱవకయ సకలవిద్యలుఁ
గరామలక మయ్యె; నందుఁ గల ధర్మంబుల్
చరియించుచుండుఁ దూ చాఁ
బరిత్యజింపక యతండు బాల్యమునుండిన్. ౪

సీ. కుంటిగ్రుడ్డులఁ జేరి కూడు గుడ్డ లొసంగి
వలసిన యుపచారముల నొనర్చు
నాకలిగొన్న నాగాంతకునకునైనఁ
గ్రొంచక మెయికండ గోసియిచ్చుఁ

జాతకకథాగుచ్ఛము

ప్రాణంబులప్పహరించు పాఁపపుర్వులనేనిఁ
గన్నబిడ్డలరీతిఁ గాచి వదలు
నఱకంగఁబడుచున్న తరుగుల్మములనేనిఁ
గని కంటఁ దడిపెట్టుకొనుచు నుండు

ఆ. వె. ఎత్తువడ్డ పసుల నెత్తి మూఁపున మోయుఁ
బులుఁగుకాలు విఱుగఁ బూయు మందు
నతఁడు ముల్లువిఱుగఁ బ్రాణిమాత్రమునకు
బిట్టుఁ బొగులుఁ దేలు కుట్టినట్లు. ౫

క. చదువును జక్కందనమును
గుదురును దనమనసుఁ జూఱగొనవచ్చె యశ
స్సుదతీరత్నము తెలియని
మదనావేశమున నా కుమారుని కడకున్. ౬

ఆ. వె. బలిసె రెట్ట; కండపట్టె శరీరంబు
గట్టిపాటె; మీసకట్టువచ్చె;
జవ్వనంపుమిసిమి సర్వాంగములనిండఁ
గన్నులను విరక్తిచిన్నెలొదవె. ౭

ఉ. చక్కని చుక్కలై, చదువుసంపదలన్ శుభలక్షణంబులన్
మిక్కిలివారలై, రమణినిం దలపించెడు చొక్కుమందులై
చక్కెరవిల్తు కోలలయి చక్కెరబొమ్మలు నైనవారలన్
బెక్కురు విప్రులాతనికి బిడ్డల నీయఁగ వచ్చి రత్తఱిన్. ౮

క. తనయొత్తు ధనమువోయుదు
మని తమబిడ్డలను బెండ్లియాడు మటంచున్
వినిపింప వార లాతఁడు
వనిత యనినఁ గంపమొందుచు వలె నెంచె మదిన్. ౯

ఉ. ఎందఱో సుందరుల్ పలవరింత్రు జపించుచు వానినామమున్
ఎందఱో వానిపొం దభిలషించుచు వేల్పుల మ్రొక్కుకొందు; రిం
కెందఱో మందుమాంత్రికులు వహింతురు వాని వశంబు సేకొనన్,
అందని మ్రానిపండుకయి యఱ్ఱులు సాఁచుటగా నెఱుంగమిన్. ౧౦

క. వంచిన తల యెత్తఁడు నో
ప్పించఁడు పల్లెత్తుమాటఁ బెరవారల వీ
క్షించఁడు వెలిచూపునను బ్ర
పంచములో చూపు వదలి వర్తిలఁడెపుడున్. ౧౧

గీ. పరిణత ప్రాయమునఁగాని పడయరాని
దృఢవిరాగంబును, గురూపదేశమునను
గాని కొనరాని తత్త్వవిజ్ఞాన మతని
వలచి వచ్చెనో? నిండుజవ్వనముఁ జూచి. ౧౨

సీ. నఱకంగఁ బడుచున్న తరుగుల్మ వల్లీ క
దంబంబు క్షాంతి పాఠంబు నేర్పఁ
గంటకక్షతులచేఁ గదలంగఁబాఱని
పాషాణములు దృఢవ్రతతఁ గఱప
క్షణభంగురములైన జలబుద్బుదంబులు
దేహాస్థిరత్వంబుఁ దెలుపుచుండఁ
బొడుపుఁగ్రుంకులు దినంబును బొందు వేవెల్గు
జన్మపారంపరిం జదువఁజేయ

గీ. వెలుఁగుఁ జీఁకట్లు సుఖదుఃఖముల యశాశ్వ
తత్వమెఱిఁగింప నాత్మనిత్యతను బాడ
శైలసంతతి యాచార్యుఁ డేలవలయు ?
క్షితినిఁ దత్త్వోపదేశంబు సేయుపొంటె. ౧౩

గీ. అపరశుకమహర్షి యంచుఁ గొందఱువల్కఁ
జెప్పఁ బెక్కుమంది సిద్ధుఁ డనుచు
యౌవనమున దుర్జయంబైన యింద్రియ
గ్రామ మడఁచి లెస్సగ్రాలె నతఁడు. ౧౪

క. మనమున జనియించెను బ్రా
క్తన సంస్కారమున మోక్షకాంక్ష యతనికిఁ
గనువేఁదుఱు గల యౌ జ
వ్వనంబున నలౌకిక స్వభావుం డగుటన్. ౧౫

క. నరులకుఁ గలిగెడు నానా
జరామరణ దుఃఖవితతి సహ్యముగామిన్
బొరలఁగఁ గన్నీ రతఁ డొం
టరిగాఁ గూర్చుండి యిట్లెడందఁ దలంచెన్. ౧౬

గీ. పాపభూయిష్ఠ మగు నీ ప్రపంచకమునఁ
బుట్టుఁ జచ్చును గ్రమ్మఱఁ బుట్టుఁజచ్చుఁ
బుట్టుచావులు రెండియుం బొందుకొనుచుఁ
జక్రనేమిక్రమంబున జనుఁడు తిరుగు. ౧౭

సీ. పలువిధక్రిమికీటములకుఁ దావలమయి
పాడ్వడ్డ చీఁకటిబావి యంచు
నలువలంకులఁ దీరములులేని యుల్లోల
కల్లోల మగు లోఁతుకడలి యంచు
బొబ్బరిల్లుచు సింగములు పులుల్ పొదరిండ్లఁ
గడుకొన్న దట్టంపు టడవియంచుఁ
గ్రొళ్లి పుర్వులుపడి రోఁత సేయుచు గొలె
గొలిపెడు పెనుటొచ్చుగుంటయంచు

గీ. రోసి సంసారముం బాసి కోసివేసి
దారపుత్త్ర ధనాది బంధముల నెల్ల
నారలు ధరించి పడసి మనః ప్రశాంతి
నడవిఁ బట్టిరి మన తొంటి యార్యజనులు. ౧౮

ఆ. వె. పూఁతపసిఁడివోలెఁ; బొదిగి చక్కెరతోడ
మాటినట్టి విసపుమాత్త్రపగిది
నైహికంపు సౌఖ్య మాపాతహృద్యంబు
తుదికిఁ దద్రిహాస్య మెదకుఁ దెలియు. ౧౯

క. గిరిఁ ద్రవ్వి యెలుకఁ బట్టిన
కరణి వ్యయపఱచి యమూల్యకాలం బెల్లన్
నరుఁ డణుతర సుఖమునకై
పరిశ్రమించుచు వహించు బహుదుఃఖములన్. ౨౦

ఆ. వె. కుడితిఁబడ్డ యెలుక వడువునఁ, బెనురొంపిఁ
గూలఁబడ్డ యెన్ను గున్న భాతి,
ముండ్లకొమ్మఁబడ్డ పుట్టంబునై జనుం
డైహికములఁ జిక్కి యలఁతఁ గాంచు. ౨౧

మ. మలభాండంబగు నీ శరీరమును సమ్మానించి కై సేసి భూ
షలఁ జీనాంబరరాశి రేబవ లిదే స్వర్గం బిదే మోక్షమం
చలరుంబోఁడులఁగూడి మానవుఁడు నాట్యంబాడుచుం బాడుచుం
గులుకుం బంగరు తూఁగుటుయ్యెలలఁ దూఁగుం దత్త్వసమ్మూఢుఁడై.

క. తన దార పుత్త్రధనములు
తను వెనుకొని వచ్చుననియొ ? తా నీ లోకం
బున నట్టిగట్టి యూగుడు
ననియో ! యనుకొనుచు మర్త్యుఁ డరయఁడు పరమున్. ౨౩

శా. మేడల్ మిద్దెలు దొడ్డ తోఁటలును నిర్మింపన్ వలెన్, గ్రొత్తపెం
డ్లాడంగావలె యౌవతంబును, నమూల్యంబైన భూషాదులన్
వాడంగాఁ గొనఁగావలె న్ననుచుఁ జింతల్ సేయుఁగానీ నరుం
డేఁడున్ వార్ధకమందు నేని విడఁ డిస్సీ! తృష్ణ యావంతయున్. ౨౪

క. తన జీవితలక్ష్యంబే?
మని 'దానిని డాయుమార్గ మది యే' మనియున్
అనుకొనఁ డే కోశమునను
మనుజుం డొకపరియు మోహమగ్నత్వమునన్. ౨౫

ఆ. వె. ఆత్మలక్ష్యరోధు లగుచున్న యాంతర
శత్రువుల జయింపఁజాల కిస్సి!
బాహ్యశత్రుగణము పయి కేల దండెత్త?
నింటగెలిచి రచ్చ కెక్కఁ జెల్లు. ౨౬

క. మొలకెత్తి యెడదమూలను
మెలమెలఁగా సాగి, యాక్రమించి కెలంకుల్
బలముగ నల్లు విషయశా
ఖల నాశాలతిక త్రెంపఁగాదు నరునకున్. ౨౭

క. ఒకవిషయము సిద్ధింప మ
ఱొక విషయముపైకిఁ బాఁకు; నొదవిన నది వే
ఱొకవిషయమునకు సాగును
సకలం బీ వరుసఁ దృష్ణ జగ మల్లుకొనున్. ౨౮

ఆ. వె. ఆశవలనఁ గ్రోధ మద్దానఁ బాపంబు
దాన నరక మీ విధముగ సతము
ఆశ వేరు దన్ని యజ్ఞానముం బెంచి
భవపరంపరలకుఁ బనుచు జనుని. ౨౯

క. సరిరాదం డింద్రియసుఖముం
బరలోకసుఖంబుఁ గోటిపాలున కేనిం
బురుషుని మనసున కాశను
బరిమార్చుటవలనఁ గలుగు పరసుఖమునకున్. ౩౦

గీ. అంటుకొన్నఁ దగిలి తంటసం బనలాగు
విషయసంగమంబు వీడిపోక
అడుసుఁద్రొక్కనేల ? యడుగేల కడుగంగ ?
సన్న్యసించి తపము సలుపుకొందు. ౩౧

ఆ. వె. అనుచు దార సంగ్రహమురోసి తృణముగా
నెంచి బంధనములఁ ద్రెంచి యెల్ల
నొక్కనాఁటిరేయి యొంటిమై నతఁడేగి
యాశ్రయించె నొక్క యాశ్రమంబు. ౩౨

క. కాంతాకనకంబుల క
శ్రాంతము దాస్యంబుసేయు సంసారుల కొ
క్కింతయును బోధిసత్త్వుని
శాంతియు దాంతియు రుచింపఁ జాలునె? యరయన్. ౩౩

సీ. చెక్కించి చక్కఁగా సిద్ధంబుగాఁ జేయఁ
గాఁ బడినట్లున్న కందరములు
ప్రతిదినంబును నీరుపట్టి లెస్సగఁ బెంపఁ
బడుచున్నగతిఁ బొల్చు పండ్లచెట్లు
ఇచ్చవచ్చినరీతి ఋషివరుల్ త్రిప్పి కొ
న్నట్లుగాఁ బ్రవహించునట్టి యేళ్లు
కల్పించి యొక్కనికై యేర్పఱచినట్లు
పొదలుచుండెడి పుష్పఫలభరితషండ్లు

గీ. తరతమత్వంబు వెలిఁగ బెద్దగను బేర్పఁ
గాఁ బడినరీతిఁ గొమరారు గండశిలలుఁ
గలిగి చిత్తరుబొమ్మనాఁ గానఁబడుచు
నాత్మ కానంద మొసఁగు నా యాశ్రమంబు. ౩౪

ఆ. వె. అచటి తపసు లతని కర్ఘ్యపాద్యము లిచ్చి
తలఁచుకొనుచుఁ దమ్ము ధన్యులుగను
దదుపదేశములకు నెద నిచ్చగించుచు
శిష్యులయిరి మెల్లఁ జెంతఁ జేరి. ౩౫

గీ. పెద్దకాలంబునుండి యా విపినవర్తి
వృక్షతతి నా వయోమాత్రవృద్ధు లయిన
తపసు లా జ్ఞానవృద్ధు ప్రాంతమున నిలువ
దివ్విటీ క్రింది దివ్వెల తెన్ను దోఁచె. ౩౬

ఆ. వె. వానిశాంతమూర్తి వానివైరాగ్యంబు
వాని వదన బ్రహ్మ వర్చసంబు
వాని సత్త్వవృత్తిఁ బరికించి భావించి
రా తపస్వి దేవదూత యనుచు. ౩౭

సీ. శ్రుతిపర్వముగఁ గలశ్రుతు లొనర్చెడు శకుం
తములు గూర్మిని స్వాగతములు సదివె
నెడనీటి కెనయైన కడుఁ దియ్యనీటితోఁ
బఱచు వాఁగులు నీరువట్టు మాన్పె
నారఁబండియు నేల కంటుకొమ్మలు గల్గు
వసుధారుహంబులు పండ్లొసంగె
నల్లిబిల్లిగఁ దీఁగలల్లి చల్లనినీడ
లిడుచున్న పొదరిండ్లు విడుదు లొసఁగె

గీ. కార్మికంబులు వచ్చి సఖ్యం బొనర్చెఁ
బాఁప మొత్తంబు పడగల వ్రాల్చి కొలిచె
రాలురప్పలు ముండ్లు మార్దవముఁబూని
యడుగు లొత్తుచు సేవించె నా మునీంద్రు. ౩౮

ఆ. వె. చిగురు దొడిగె మ్రోడుచెట్లు దట్టంబుగా
నంజమ్రాఁకు లెల్లఁ బండ్లుగాచె
క్షారజలము మధురజలమయ్యెఁ బేయమై
యా వనంబు నందు నతని రాక. ౩౯

క. నడివేసఁగి మిడియెండను
గడితంబుగఁ గుంభవృష్టి గల తొలకరిన్
వడకించెడు చలితటి నా
తఁడు బయలనె గోచిపెట్టి తప మొనరించున్. ౪౦

గీ. అహరహము సాయములయందు నాశ్రమంబు
నారుబయలునఁ గూర్చుండి యా మునీంద్రు
బాలికాళికి ధర్మముల్ వక్కణించు
నా యమీంద్రుఁడు మధురవాక్యామృతమున. ౪౧

గీ. దురవగాహంబులై చిక్కువడుచుచున్న
తత్త్వ శాస్త్రార్థముల నద్భుతముగఁ దెలుపు
నరఁటిపం డొల్చిపెట్టిన కరణి నతఁడు
దీర్ఘకాలానుభవము సాధించినట్లు. ౪౨

క. పలుశాస్త్రంబులు సదివినఁ
గలుగం బో దనుభవం బొకని; కొక్కనికిన్
గలుగును జదువక యున్నను
బలితంబగు పూర్వజన్మ వాసన కతనన్. ౪౩

గీ. తన్నుఁ బరులు కొట్టుచున్నఁ దిట్టుచు నున్నఁ
జంపుచున్న నరుఁడు క్షాంతివిడక
రాతిగుండెయైన ద్రవియించి యేఱులై
పఱచునట్లు సేయవలయుఁగాదె ! ౪౪

చ. ఒరపిడినైన క్షాంతిఁ గొనియుంటనె రత్నము ప్రోజ్జ్వలించుఁ; దన్
నఱకిన వానికిం దరువు నైకముగా ఫలపుష్ప శాఖలన్
గరుణవహించి యిచ్చుఁ గొని క్షాంతియె; కొంచక తన్నుఁ ద్రొక్కినన్
ధరణి వహించు జంతుతతిఁ దాల్చియె క్షాంతి నిరంతరంబుగన్. ౪౫

క. శాంతియు దాంతియు క్షాంతియుఁ
గొంతైనను దొణఁకనీయఁ గూడ దవియె య
శ్రాంతము విశ్రాంతిని మన
స్వాంతంబున కొసఁగి మోక్షసాధకము లగున్ ౪౬

ఆ. వె. అనుచు క్షాంతిఁబూని యదె ధర్మసారమం
చన్యులకును గఱపు నాచరించు
క్షాంతివాది యంచు సార్థకనామంబుఁ
దాల్చియుండె నతఁడు దానఁ జేసి. ౪౭

శా. ఆతం డచ్చటనున్న నాటఁగొలెఁ బుణ్యక్షేత్ర కల్పంబుగా
ఖ్యాతింగొన్న తదాశ్రమంబునకు నా యా యాత్రికుల్ పోవుచున్
ధాతం బోలిన యా మహామునిని సందర్శించి సద్భక్తిమై
పూతత్వంబు వహించు చుందు రనిశంబుం బ్రీతచిత్తంబునన్. ౪౮

చ. జరపుచునుండఁ గాలము ప్రశాంతముగా మునిచంద్రుఁ డీ గతిం
దరులకు వన్నెదిద్దుచు, లతాతతికిన్ రమణీయ నాట్యముల్
కఱపుచు శ్రోత్రపేయముగ గానము నేర్పుచుఁ గోకిలాళికిన్
సరస కళాపరిపూర్ణుఁడు వసంతుఁడు చక్కఁగ డిగ్గె భూమికిన్. ౪౯

క. తరువులు సృజింపఁ దొడఁగెను
స్మరునకుఁ గావలయు నిశితశరజాలం బ
త్తరి నా వసంతు నాజ్ఞను
మరంద దుర్విషమహా విష నిమగ్నంబులుగాన్. ౫౦

ఆ. వె. ముడిచి యొడలు చలికి మూఁడంకెగాఁ బండి
నిదురఁ గూరుచున్న మదనుఁ డపుడు
కనులు నలుముకొనుచుఁ గాళ్ళేతులను సాఁగఁ
దీసికొనుచుఁ బొన్ను దిగెను మెల్ల. ౫౧

క. తరుణీ తరుణుల మనములఁ
బెరపెర ప్రారంభమయ్యెఁ బెద్దగ నా క్రొ
వ్విరి విల్తుఁ డమ్ము దొడుగఁగఁ
జెఱకునఁ జుఱుకెక్కి మెల్ల సీతువు దొలఁగన్. ౫౨

మ. వలపుల్ చిమ్ముచుఁ బువ్వుగుత్తుల మనః పర్వంబు గావించు దీ
వలు పేటెత్తిన లజ్జఁ దూఁగుచుఁ దరువ్రాతంబు పై వ్రాలుఁ; గాఁ
గిలికిన్ లాగును లాఁతి తీవియలనున్ గ్రొక్కొట్టు, మోహంబునన్
గిలిగింతల్ పచరించు గండశిలలం గ్రేళ్ళుబ్బ నెయ్యంబునన్. ౫౩

ఆ. వె. తపనతాప మదన తాపంబు లొండొండు
తీసిపోక రెచ్చ దినదినంబు
యువతి యువకజనము లుత్సాహమొందిరి
గృహసరోవరములఁ గ్రీడలాడ. ౫౪

క. అత్తఱి నా దేశపు రా
జోత్తముఁడు వధూశతంబు నొగి జలకేళీ
చిత్తుం డయి కొని యా ముని
సత్తము వస మంటియున్న సరసున కరిగెన్. ౫౫

క. విడియించి యా మనోహర
తడాగతట మందుఁ గల లతాగృహముల న
య్యొడయఁడు తన శుద్ధాంతపుఁ
బడఁతుల క్రీడలకుఁ జిక్కి వర్తిలుచుండెన్. ౫౬

క. కుతిదీఱక యొకరూపున
శతావతారములు దాల్చి చరియించెడినో
రతి పువ్విల్తునిఁ గలియఁగ
క్షితి నన యువతీజనంబు గెరలుచు నుండెన్. ౫౭

మ. లలనల్ మన్మథపూజ సేయుచు సముల్లాసంబుగాఁ బాడుచున్
గలకంఠమ్ములఁ గమ్మఁదేనియలవాఁకల్ పాఱ, మంజీరమం
జుల నాదంబు లెసంగ లాస్యములు మెచ్చుల్పుట్టఁ గావించు చు
య్యేలలం దూఁగుచు సంచరించి రచటన్ హృద్యంబుగా జేనికిన్. ౫౮

క. పువ్వులబంతులఁ బ్రియుపై
ఱువ్వుచు నెల జవ్వనంపుఁ గ్రొవ్వునఁ దమపై
ఱువ్వించుకొనఁగఁ దరుణులు
నవ్వుచుఁ గవ్వించి రతని నానాగతులన్. ౫౯

క. కలకంఠుల గానముఁ గో
కిలనాదముఁ గలియఁబడఁగఁ గీరరుతంబుల్
పలుకులు సరిపడ నరపతి
తెలియక తబ్బిబ్బు గొనె మదిన్ నవ్వఁ జెలుల్. ౬౦

చ. తడఁబడుచున్న మాటలు, నితాంతము బిత్తరిచూపు, మెల్లనై
చిడిముడిగొన్న నెన్నడలు, చెల్వము దోఁచుట మోముదామరన్
బడఁతులకున్ స్వభావ మెలప్రాయమునం దిఁక మద్యపాన మి
బ్బడిగ నొనర్చె నత్తఱి నృపాలుని డెందము చిందులాడఁగన్. ౬౧

సీ. రమణీయ కేశపాశము విప్పి విరియించి
నెమిలిరూపమునఁ గాన్పించె నొకతె
పలువర్ణ భూషణాంబరములం గొని పంచ
వన్నె చిల్కగను గన్పట్టె నొకతె
తరళ దృక్కులు పర్వఁ బఱతెంచు చట్టిట్టు
బాలకురంగినాఁ గాంలె నొకతె
మిసమిసలాడు మైపస నింపు నింపుచుఁ
బూవు దీవియవోలెఁ బొలిచె నొకతె
గీ. అయ్యయి పదార్థముల కడ నయ్యయిగతిఁ
గానిపించుచు నెకిమీని మానసంబు
నలరుఁబోండ్లు హరింపఁగా నహమహమికఁ
బూని నడయాడఁ దొడఁగి రా పువ్వుఁదోఁట. ౬౨

క. పొలయులుకఁ దీర్చు చొక చెలి
కులికించుచుఁ జలిపి పనుల నొకయువతినిఁ గో
యిలఁ బోలె నొకతె నెగచుచుఁ
బలువిధముల రాజు రాణివాస మలర్చెన్. ౬౩

క. కరిణీ యూథము తోడం
గరీంద్రుఁడుం బలె వధూటికాతతి తోడన్
ధరణీపాలోత్తముఁడు వి
హరించుచు మునింగి తేలె నానందాబ్ధిన్. ౬౪

ఆ. వె. సలిపి సలిలకేళి స్మరకేళి సవరించి
యా నరేంద్రచంద్రుఁ డలఁతఁగాంచి
పొదరుటీరమందుఁ బూపాన్పుపైఁబండి
నిదురవోయె హాయి గదుర మదికి. ౬౫

క. అలసట నడంచు; దుఃఖం
బుల నిర్మూలించు నూచముట్టుగ సంప
న్నులను దరిద్రుల సరిగా
వలచిన చెలి నిద్ర దానివంటిది గలదే? ౬౬

క. వన రామణీయకమునకుఁ
దనియక పతి నిద్రగొంట దరిసించి విలా
సిను లెల్ల రా ప్రదేశముఁ
గనువేడుక వెల్లివిరియఁగా నరిగి రొగిన్ ౬౭

గీ. వయసురానట్టి పడుచుల వరుసఁ గొన్ని
వయసువచ్చిన యువతుల పగిదిఁ గొన్ని
వయసుదీరిన కాంతల పగిదిఁ గొన్ని
వృక్షములు తద్వనమునఁ గన్విందుసేయు. ౬౮

చ. మును గననట్టి వృక్షములఁ బువ్వులఁ గాయలఁ బండ్లఁ గాంచుచున్
మును విననట్టి శ్రావ్యమగు ఫుల్గుల కూఁతల నొగ్గుచుం జెవుల్,
మును విహరింపనట్టి పొదమొత్తముఁ దూఱుచు విశ్రమించుచున్
మునుగుచు హర్షవార్ధిఁ బువుబోండ్లు విహార మొనర్చి రవ్వనిన్. ౬౯

సీ. తన రమ్యకరపాద తలములం బగఁగొన్న
గతిఁబొల్చు చిగురాకు గములఁ జిదిమి
తనదు సుందర పయోధరముల కెనవచ్చు
తోరంపుఁ బువ్వుగుత్తులను గోసి
తనదు కోమల గాత్రమును ముట్టి యెదిరించు
మవ్వంపుఁ దీవెల మలయఁజేసి
తన మృదుకంఠ గీతంబు విడంబింప
నరుదెంచు కోయిల నదలఁజేసి

గీ. తనదు నెమ్మేని కమ్మవాసనల సురభి
కుసుమములఁజేసి నిర్గంధ కుసుమములను
వనరమకుఁ దద్దఁ దనచక్కఁదనపు ఠీవి
చూపుచుఁ జరించె నట నొక్క సొబగులాఁడి. ౭౦

చ. రమణులు మోముదమ్మిపయి వ్రాలెడు తేంట్లను ద్రోలు చోష్ఠ బిం
బము పయి మూఁగు చిల్కలను బాఱఁగఁజేయుచు, నాత్మశాఖలన్
దమకముగొన్న చందమునఁ దమ్ముఁ గనుంగొని కంటకావనీ
జములు చెఱంగు లాగఁ బెలుచన్ వదలించుచుఁ బోయి రయ్యెడన్.

క. తలవని తలఁపుగ వృక్షం
బులు పెక్కు వికాసమొందెఁ బూవుంబోఁడుల్
కలకల నవ్వఁగఁ దాఁకఁగఁ
బలుకఁగ నర్మోక్తు లాటపాట లొనర్పన్. ౭౧

ఉ. ఈ తలిరాకు లీ సుమము లీ ఫలముల్ సరిక్రొత్త లివ్వి భూ
నేత కుపాయనంబుగను నేన యొసంగుదు మెప్పుఁగొందుఁ ద
త్ప్రీతికిఁ బాత్రురాల నయి వెల్గుదు నంచుఁ దలంచి కోసి తన్
లాఁతులు చూడనట్లులు చలమ్మునఁ దాఁచె నొకొక్క చెల్వయున్.

మ. చిఱునవ్వుల్ విరిమొత్తమై తరులతాశ్రేణిన్ వెలింగింపఁగా,
సరసోక్తుల్ మధుధారలై వనమునం జాల్వారఁగా, వీక్షణో
త్కరముల్ తోరణగట్టఁ జక్కఁగ దిశాకాండంబునన్ మెట్టతా
మరలన్ సృష్టినొనర్పఁ బాదములు కొమ్మల్ పోయి రా తోటలోన్.

ఆ. వె. ముద్దుముచ్చటాడు పులుఁగుల జంటల
మరులు రేఁగి యాలుఁ దరియు తేటిఁ
జక్కఁగౌఁగిలించు జక్కవకవఁ గాంచి
నవ్వుకొనుచుఁ జనిరి పువ్వుఁబోండ్లు. ౭౨

గీ. మరులుఁ దీఁగెను ద్రాక్కిన మాద్రి వారు
మఱచి పతిమాట విడిదికి మరలుబాట
ముగ్ధలై యా వనంబు నపూర్వశోభ
గమ్య మెరుఁగక యేగిరి కడిఁదిదవ్వు. ౭౬

గీ. అరిగియరిగి వార లా మాని చంద్రుని
యాశ్రమంబు డాయ నాదరించి
స్వాగతంబొసంగె ఛాత్రబృందమువోలె
శుకపికాది సకల శకునికులము. ౭౭

ఉ. డాసిరి వారు మెల్లఁగ నెడందఁ గుతూహల మొప్ప బద్ధవీ
రాసనుఁడై ప్రశాంతవిషయస్పృహుఁడై వినిమీలితాక్షుఁడై
భాసుర బ్రహ్మతేజుఁడయి భస్మమయాంగకుఁడై మనోజ్ఞద
ర్భాసనవర్తియై పొలుచు నా యమిసత్తము బోధిసత్త్వునిన్. ౭౯

చ. చిలుకను ద్రోలి యా చెఱకు సింగిణి వ్రయ్యలు సేసి, త్రుంచి పూ
ములుకులు మూలమట్టు రతిమోహముఁగోసియు సన్న్యసించి నా
రలు ధరియించి, ద్వంద్వముల రాయిడి సైఁచి తపంబొనర్చు పు
వ్విలుతుఁడనంగ నొప్పు మునిముఖ్యుఁ డటన్ నవకోమలాంగతన్.

క. కని యతని శాంతరూపం
బును మంత్రము చేతఁ బోలెఁ బూవుంబోఁడుల్
తను విభ్రమములు తక్కఁగఁ
బ్రణత లయిరి శిరసు వ్రాల్చి పాదద్వయికిన్. ౮౦

గీ. భక్తిరస మొల్కుచున్న హృత్పంకజంబు
హస్తపాదాబ్జములును నేత్రాంబుజములు
గలిపి దండగ గ్రుచ్చి యా చెలులు సేసి
రా మునీంద్రుని దివ్య పాదార్చనంబు. ౮౧

క. చెలువున కొసంగ నెయ్యం
బొలుకంగాఁ దారు కోసియును దాఁచిన యా
ఫల పత్త్రి పుష్పతతి ని
ర్మల భక్తిని నాతనికి సమర్పించి రొగిఁ. ౧౨

క. పతగతతి మొదలు సేసిన
యతిథి స్వాగతసపర్య యా యతి మృదుభా
షితముల తోడన సంపూ
ర్ణతఁ బడయుట సతుల మనము ప్రమదం బొందెన్. ౧౩

ఉ. వారల యప్పనంబులఁ దపస్వివరుం డెద నాదరించి వి
స్ఫార విలోచనంబులఁ గృపారసపూరము జాలువాఱఁగా
వారల రత్నభూషలును వారి యమూల్య దుకూలవేషముల్
వారల తమ్మలంబు తెలుపంగఁ దదైహిక తత్పరత్వమున్. ౧౪

క. బలిత మగు సేవగొనియున్
గలఁగక దాంతాత్ముఁడగుటఁ గనికరమున వా
రల నుద్ధరింపఁగా నీ
పొలుపున ధర్మోపదేశముల నొనరించెన్. ౧౫

క. తఱచుగా జీవి జీవయాత్రా స్రవంతి
నింద్రియావర్త బృందంబునందుఁ జిక్కి
వాని త్రిప్పులఁ దిరుగుచు వశము దప్పి
మజ్జనోన్మజ్జనంబుల మ్రిందుచుండు. ౧౬

క. పురుగయి పులుఁగయి పశువై
పరస్సహస్రంబు లయిన బాములు గొని యి
ద్దరఁ దుదికి జీవి వడయును
నరయోనిం బుణ్యలవమునన్ జననంబున్. ౧౭

క. సుకృతోత్సేకము కతనన
సకలేంద్రియవత్త్వ గాత్ర చారుత్వ ధని
త్వ కులీనత్వ మహత్త్వా
దికసంపద మానవునకుఁ దేజిలుచుండున్. ౮౯

మ. నరజన్మంబు వహించినాఁడనని యానందంబునన్ వీఁగుచుం
బురుషుం డక్కట! ఉత్తరోత్తర శుభంబుల్ పొందు నాలోచనం
బు రహింజేయక లబ్ధమైన స్వధనంబున్ గ్రుడ్డివాటంపు దూ
బరఁ గావించి యధోగతుం డగు నవిద్వాంసుం డగుం బో! తుదిన్.

ఉ. ఉత్తరకాలమం దిటులె యుత్తమజన్మముఁ బొందఁ జేయ నే
సత్తప మెట్టి హీనమగు జన్మము కల్గునొ? యింక నాకు నం
చుత్తలపాటుతో హృదయ మూఱటఁ గాంచక మానవుండు వె
ఱ్ఱెత్తినరీతి నెప్పుఁ గడ కెక్కుడుగా ననుతాప మొందుచున్. ౯౦

గీ. తలఁచు నొక్కండు కడలి కేతాము నెత్త
నెంచు నింగికి నిచ్చెన నెత్త నొకఁడు
పృథివిఁ దలక్రిందు సేయ భావించు నొకఁడు
తనదు వాసన లార్పంగఁ దలఁపఁ డెవఁడు. ౯౧

క. ధన కనక వస్తు వాహన
తనయ కళత్రములు దుఃఖదంబులు తనతోఁ
జను దేరవు సద్ధర్మమె
మనుజుని వెనుకొనుచు సుఖనిమగ్ను నొనర్చున్. ౯౨

గీ. బుద్బుదప్రాయమగు ప్రాయమును దటిత్ప్ర
మాన మగు సంపదను నమ్మి మానవుండు
కట్ట! శ్వపుచ్ఛముం గొని గంగ నీఁదు
వానిగతిఁ జెందుఁ గోరి నిర్వాణపథము. ౯౩

ఆ. వె. విషయసుఖము చెఱకు వితమున మునుముందు
స్వాద్య మయ్యెఁ దుదికిఁ జప్పఁ బాఱు
విరస మయ్యు మందుకరణి వైరాగ్యంబు
మొదట హితమొనర్చుఁ దుదికిఁ దుదికి. ౯౪

చ. క్షితి జనియించినట్టి ప్రతిజీవియు శాంతిపథం బెఱింగి సం
చిత మగు పాపబృందము నశింపఁగ దుర్గతిఁ దూలపుచ్చి స
ద్గతిఁ బడయంగఁ దృష్ణను బెకల్చి సమూలముగా మదిన్ దృఢ
వ్రతత జితేంద్రియుండయి ప్రవర్తిలఁగావలె జీవితాంతమున్. ౯౫

క. అని యిట్లుపన్యసించుచు
మునీంద్రుఁ డుండంగ మెఱుఁగుఁబోం డ్లయ్యెడలన్
విను చతని యమృతవాక్కులఁ
దనియక కూర్చుండి రతిముదంబును గొనుచున్. ౯౬

గీ. రాజు చాలించి గాఢనిద్రాసమాధిఁ
గాలుసేతులు సాగించి కనులు నులిమి
యావులించుచుఁ జూచుచు నలసదృష్టి
నొడలు విఱుచుచు లేచి కూర్చుండె సెజ్జ. ౯౭

గీ. రమణుల మెఱుంగుఁ జెక్కుటద్దముల యందు
నిద్దురను మాయు నందంబు దిద్దుకొనుచు
వారల తనూవిలాస వ్యాపారమందు
నోలలాడెడు మున్ను భూపాలవరుఁడు. ౯౮

చ. కలకలలాడు చక్కనిమొగంబుల దర్శన మిచ్చి గండు గో
యిలల హసించు కంఠముల నింపగు మంగళగీతిఁ బాడి యం
దెలఁ బచరించి వాద్యముల నిద్దుర మేల్కొనుచున్న త న్నొగిన్
గొలుచు తటిల్లతాంగులఁ గనుంగొనఁ డొక్కతె నేని ఱేఁడటన్. ౯౯

శా. కేళాకూళుల నాడుచుండిరో జలక్రీడల్, తగం, దూఁగుటు
య్యాలం దూఁగుచునుండిరో? పొదల నాట్యం బాడుచున్నారలో ?
లీలాద్యూతము లాడుచుండిరో? సుమాళిం గోయుచున్నారలో?
కాలం బెంత గతించెనో? తెలియ కిక్కాంతామణుల్ తోఁటలోన్. ౧౦౦

క. సరసగల పొదరుటిండ్లను
దరుణులు నిదురించుచుండ్రు దప్పదటంచున్
బిరబిర చని పరికించుచు
నరపతి భగ్నాశ మగు మనంబున నులికెన్. ౧౦౧

సీ. ఏ యైంద్రజాలికుండేని నీ కొమ్మలఁ
జిగురుఁ గొమ్మలుగాఁగఁ జేసెనొక్కొ ?
ఏ మాంత్రికుం డేని నీ లతాతన్వుల
నలరుఁ దీవియలుగాఁ జలిపె నొక్కొ !
ఏ మునిశాపమే నీ కురంగాక్షుల
లేడి మందలుగఁ గల్పించె నొక్కొ ?
ఏ వనదేవతయేని నీ చిలుకల
కొలుకులఁ జిలుకలఁ జలిపె నొక్కొ ?
గీ. ప్రాఁతగిలు పూవుటమ్ములఁ బాఱవైచి
యా యనంగుండె తూణీరమందు నిడెనొ !
నాదు రతనంపు బొమ్మల నాదు మోహ
దేవతలఁ గేళికా కామధేనువులను. ౧౦౨

క. అని తర్కించుచు నవ్వని
మును గాంచిన యా ప్రదేశముల బల్మఱుఁ గాం
చును బతి తోఁపక కాల్గా
లిన పిల్లియనంగఁ గళవళించు నెడందన్. ౧౦౩

క. వనమునఁ గ్రిమ్మరుచుండఁగఁ
గని దొరకిన పగిది వారి కాల్మ్రది లోగిం
గనఁబడ నాతఁడు ముద్దిడు
కొను మ్రొక్కును గినుకఁ దీర్పఁ గోరిన కరణిన్. ౧౦౪

ఉ. దారినిఁ జూప జేనికిఁ బదంబుల ముద్రలు దూతికాళిమై
వారల వేనలిం దొరగిపడ్డ స్వయంగ్రథిత స్రజంబు ల
వ్వారల కమ్మఁ గప్పురపు వాసన లీనెడు తమ్మలంబు ల
వ్వారల కోసియున్న ఫలపత్త్రసుమంబుల తీరుఁ గాంచుచున్. ౧౦౫

గీ. మనసుతోఁ బందియంబు నొడ్డినవిధానఁ
గాళ్లు పరుగెత్తఁ దడఁబాటు గదిరి కడిఁది
పడుచు లేచుచుఁ గ్రమ్మఱఁ బడుచుఁ బెద్ద
విసువుకొనుచును నడచెఁ బృథ్వీవరుండు. ౧౦౬

క. వలకాఁక కెండబెట్టయు
శిలాహతులుఁ దోడుపడఁగ క్షితినాథుఁడు ని
ట్టలమగు కినుకను గనలుచుఁ
గలుకులకై వెదకికొనుచుఁ గడుదవ్వరిగెన్. ౧౦౭

క. డాలఁ గనంబడె నొక తరు
మూలంబునఁ దారకాసమూహము చంద్రుం
బోలె నొక చారుమూర్తిని
బాలాతతిఁ గొలుచుచుంట వసుధాపతికిన్. ౧౦౮

క. శరవేగంబున నతఁ డా
పరిసరమున వ్రాలి కాంచి పడతుల గమి గ్రు
డ్లుఱుముచు బొమముడి పఱచుచుఁ
జఱచుచుఱ నా యమినిఁ జూచుచును నిలుచుండెన్. ౧౦౯

క. కాంతున కన్యుసితోఁ దన
కాంతామణి యేకతమునఁ గానంబడినన్
స్వాంతము రగులదె? కన్నుల
సంతమసము గ్రమ్ముకొనదె? శాంతి తొలఁగదె? ౧౧౦

గీ. మాటగట్టి నిజేంద్రియంబులను భక్తి
నతని కప్పన సేయుట నతివ లటకు
వచ్చి నిలుచున్న తమ భర్తవంకఁ గనరు
వినరు నాతని దగు పదధ్వనిని నేని. ౧౧౧

క. తనయానతి లేకయ యి
చ్చను విహరింపంగ వెడలు చంద్రాస్యలపైఁ
గొనియున్న బిట్టుకినుకను
మునిపైఁ దీర్పంగఁ బోయె భూపతి మొఱకై. ౧౧౨

క. మొదలనె మోహగ్రస్తుఁడు
తదుపరి సుమహా ప్రభుత్వ దర్పోద్ధతుఁ డా
పిదప నవివేకి ప్రకృతిని
మది ధర్మాధర్మములను స్మరియించు నెటుల్. ౧౧౩

క. ఈ మిండ తపసి యెవ్వం ?
డీ మునిముచ్చెవ్వఁ డిట్టు లీ గతి నా కాం
తామణుల వశము సేకొని
కామోద్రేకమునఁ గన్నుఁగానక యుండెన్. ౧౧౪

మ. తరుణీబృందము విశ్వసింపఁగ బకధ్యానంబుఁ గావించుచున్
దరియన్ రాఁగను మంత్రతంత్రవిధులన్ వశ్యౌషధ ప్రక్రియన్
మఱవం జేయుచుఁ గ్రీతదాసులనుగా మారించి స్వేచ్ఛాగతిం
జరియిం తీదృశతాపసబ్రువులు నానా మన్మథ క్రీడలన్. ౧౧౫

గీ. గోముఖవ్యాఘ్రి మనఁగ బయోముఖంపు
విషఘటం బనఁ గృత్రిమవేషమూనె
నితఁడు; కాకున్న సన్న్యాస మేడ? యువతి
వర్గసాహాయ్యకంబు లేఁబ్రాయ మేడ ? ౧౧౬

క. భోగినుల యోగినులఁగా
భోగుల యోగులఁగఁ జేసి పోరిఁ బురుషులకుం
దీఁగంబోండ్లకు విరహో
ద్వేగముఁ గూర్తురు మునుల్ క్షితిం గొంద అహో. ౧౧౭

క. ఈ మాయల మారీచుని
సామీప్యమునందుఁ జేరి చనుదెంచిన నర్
మోమెత్తి యైనఁ గాంచరు
శ్యామామణు లెట్టి మందుఁ జల్లెనొ! మేనన్. ౧౧౮

క. కనుపాపఁ దీయఁగలిగిన
ఘను లీదృశు లీ ప్రపంచకము వంచింపన్
దన బానిసగ నొనర్పఁగ
మునివేష సమంబు గలదె ముల్లోకములన్. ౧౧౯

క. ఈ మేఁకవన్నె బెబ్బులి
యీ మధులిప్తాసిపత్రి యింకెందఱి క
న్బ్రమి హరించునో? సౌఖ్యము
లేమయి యాల్గింపకున్న నిత్తఱి ననుచున్. ౧౨౦

ఉ. జేగురుముద్దగా మొగము, చిందఁగఁ గన్నుల విస్ఫులింగముల్
తూఁగ సివంబుగొన్న గతిఁ దొట్రిలుచుం దన గాత్రయష్టి బి
ట్టూఁగఁగ వెన్కఁ గ్రొమ్ముడియు నూడి భయానక సర్పమట్టు లా
యోగినిఁ బిల్కుమార్పఁగ సముద్యతుఁడై యొడయండు పేర్చుచున్.

క. పరపరన పండ్లఁ గొఱుకుచు
నోరనుండియు సురియఁ బెఱికి యుఱుముచును గడున్
మెఱుఁగుం దాల్చిన మేఘము
తెఱఁగున వాచంయమేంద్రు దెసకుం బఱచెన్. ౧౨౨

శా. సింగంబో? పులియో? యెలుంగొ? పఱతెంచెన్ మీఁదికంచున్ మదిం
గంగారుంగొని పెల్లు చెల్లచెదరై నానాదిశల్ పర్వ సా
రంగుల్ వోలెఁ బడంతు లయ్యతిథిఁ గ్రూరస్వాంతు నా మౌని న
ర్చం గావింపఁగ నర్ఘ్యపాద్యముల సంరంభించె శాంతాకృతిన్. ౧౨౩

ఉ. స్వాగత మాదరింపక నృపాలుఁడు త్రోసి తదర్ఘ్య పాద్యముల్
నాగమువోలెఁ జుట్టి యమినాథు వధింపఁగఁ గత్తి నెత్తఁగా,
డాఁగి భయంబునం గుఱఁగటం గల రాణులు గాంచి కాంతునిన్
మ్రోఁగఁగఁ గంకణంబులును నూపురముల్ మణిమేఖలల్ వడిన్.

క. అరుదెంచి నిరపరాధినిఁ
బరతత్త్వజ్ఞుని మహాత్ము వ్యర్థముగఁ గటా!
పరిపూత గోవునుం బలెఁ
బరిమార్పఁ దలంచు నాత్మ పతి వారింపన్. ౧౨౫

క. వినతోత్తమాంగలయి యా
వనితారత్నములు డాసి పాణిద్వంద్వం
బును గీలించి శిరస్సుల
నని రమృతంబొలుక నిట్టు లతిభక్తి మెయిన్. ౧౨౬

క. అబ్రహ్మణ్యము నాథా!
ఈ బ్రహ్మిష్ఠావతంసు నేల వధింపన్!
గోబ్రాహ్మణ హితుఁడవు క
ట్టా! బ్రహ్మవధం భొనర్చు టర్హం భగునే? ౧౨౭

మ. అరిషడ్వర్గము గెల్చి తాల్చి మెయి లోకానుగ్రహార్థంబ యు
ర్వర కాచార్యక మూని సంసృతిం దృణప్రాయంబుగా నెంచుచుం
బరమజ్ఞాననిరస్తపాపుఁడయి నిర్వాణైకలక్ష్యాత్ముఁడై
ధరఁ గాలంబును బుచ్చు నీ యతిని బ్రమందం జేయఁ జన్నే! ప్రభూ!

క. మన సమృతము మా టమృతము
కనుచూ పమృతంబు తెలుపఁగా నేటికి? నీ
మునివరుఁ డమృతపు ముద్దయ
జననాథా! లే రమూదృశ మహాత్ము లిలన్. ౧౨౯

క. కోఱవిం దలఁ గోకుటయును
వెఱవక తన యింటఁ జిచ్చువెట్టుటయు నగున్
ధరణీపతి! యేతాదృశ
పరమ మునీంద్రులను దుంప భావించుటనన్. ౧౩౦

మ. అని మున్వర్థము కాళ్ల వ్రేళ్లఁ బడుచున్ యాచించు నా సుందరీ
జనతాలాపము లగ్నికిన్ ఘృతహవిష్య ప్రాయముల్ కాఁగ వా
రిని హుంకారకఠోర కంఠమున దూరీభూతలం జేసి యా
తనిపైఁ గ్రమ్మెఱఁ గత్తి నెత్తెఁ బతి మూర్తంబైన క్రోధం బనన్.౧౩౧

మ. జనకుం బుత్రుఁడు, పుత్రునిన్ జనకుఁ డొజ్జన్ శిష్యుఁ డా యొజ్జ శి
ష్యుని, భార్యం బతి, భర్త భార్యను, వధించుం గ్రోధసమ్మూర్ఛితన్
మునువెన్కల్ కననీక దట్టముగఁ గప్పుం గన్నులన్ జీఁకటిన్
అనుతాపంబును గూర్చుఁ గోపము మనుష్యశ్రేణి కంఠంబునన్.౧౩౨

గీ. అతిరుపాపిశాచగ్రస్తుఁ డైనయట్టి
పతిని మరలింపఁజేసిన ప్రార్థనంబు
బూడిదం బోయు పన్నీరుపోల్కిఁగాఁగఁ
దొలఁగి కాఁదల వాంచి తొయ్యలులు దవ్వు. ౧౩౩

సీ. సప్తజిహ్వాలు సాఁచి జగమేర్చు కార్చిచ్చు
కడనున్న పెనుమంచుగడ్డ యనఁగ
మిట్ట వేసఁగి నెండబెట్ట విశ్వము మాడ్చు
రవియొద్దనున్న చంద్రముఁ డనంగ
నల్లకల్లోలమై యాభీల మగు నబ్ధి
దరిఁగ్రాలెడు ప్రశాంత సరసనంగఁ
బడగల విసముఁ గ్రక్కెడు కాలసర్పంబు
కడనున్న పీయూషఘట మనంగ

గీ. ఆకృతిం గొన్న రౌద్రమై యడలు గొలుపు
జేనికడ నిల్చియుండె నిర్భీకుఁడగుచు
రూపముంగొన్న శాంతినాఁ దాపసుండు
కదలఁ బాఱని యంతరంగంబుతోడ. ౧౩౪

ఆ. వె. కాంచి యవ్విధంబు క్షాంతివాది మునీంద్రుఁ
డాత్మశాంతి వదల కాదరించి
భూపు నర్ఘ్య పాద్యములను గ్రమ్మఱఁ బూజ
సలుపనెత్తి యిట్లు వలికె మెల్ల. ౧౩౫

చ. క్షితి జనియించినట్టి ప్రతిజీవియుఁ బాయును నేఁడొ! రేపొ! జీ
వితముల, దీన్నికై పరితపింపసుమీ! లవలేశమేని నో
క్షితిప! మదాశ్రమంబు దయసేసిన నీ విట నా యొనర్చు స్వా
గతము గ్రహింపవైతి వని కాల్చు విచారపు టగ్గి నా మదిన్ ౧౩౬

ఉ. కంచెయె చేని మేసిన ప్రకారమునన్ భువి దుష్టకోటి శి
క్షించఁగ శిష్టకోటిఁ బరికింపఁగఁ బ్రాపయి యున్న త్వాదృశా
ధ్యంచిత పుణ్యమూర్తులె తపస్విజనంబు వధింపఁబూనఁ బ్రా
పంచిక ధర్మముల్ నిలుపు వా రెవరయ్య! తలంచి చూడుమా! ౧౩౭

క. చోరుఁడ వని తలచితివో?
జారుఁడ వని తలఁచినావొ? క్ష్మాపతి! పాపా
చారుండ వనియు ధర్మవి
దూరుఁడ వనియుం దలంచితో? మది నన్నున్. ౧౩౮

మ. దురహంకారు లనార్యు లుద్ధతులు గ్రుద్ధుల్ మూఢు లప్రాజ్ఞు లు
ర్వర వర్తిల్లు గతిన్ భవాదృశులు విద్వాంసుల్ వివేకోన్నతుల్
చరియింపంగను రాసభాశ్వములు తుల్యంబయ్యెఁ బో!యంచు న
వ్వరె? లోకుల్ సదసద్వివేకులు మహీపాలా! విచారింపవే! ౧౩౯

క. నీ యువతీ బృందం బిటు
నా యాశ్రమమునకు రాఁగ నాతిథ్యంబుం
జేయుట నా తప్పిదముగ
నీ యాత్మకుఁ దోఁచెనే మనీషిస్తుత్యా! ౧౪౦

ఉ. ఏల యకారణంబుగనె యివ్విధి బొమ్మముడిన్ బిగించి దం
తాలను గీటుచున్ రుధిరధారలు గ్రక్కుచు నోట ఖడ్గముం
దాలిచి కేల నా పయికి దర్పమహాంధత దూఁకుచుంటి శా
ర్దూలమువోలె డెందమునఁ దొందరపాటు వహింపఁబోకుమీ! ౧౪౧

క. అతిథ్యార్పణము మహా
పాతకముగ ధర్మబోధ పామరకృతిగా
బూతుగ 'నమూ్మ' యంటయు
భూతలపతి నీకుఁ దోఁచెఁబో! యే మందున్. ౧౪౨

క. పోనిమ్ము సమ్మతింతును
నేను మహాపాపి ననుచు నినుబోఁటి మహా
జ్ఞానులు క్రుద్ధు లొనర్తురె?
మానస శమవార్ధిఁ గ్రోధ మంథరగిరిచేన్ ౧౪౩

గీ. శత్రు నిగ్రహణ క్రియాశక్తి కన్న
క్షాంతి నిర్వహణ క్రియాశక్తి మేలు
దాన రాజర్షి పదము సార్థకము తేని
కన్యమున నాతని నృశంసుఁ డండ్రు ప్రజలు. ౧౪౪

మ. పలుశాస్త్రంబులు వేదముల్ సదివినన్ వాతాశనాధారుఁడై
తలక్రిందై తప మాచరించినఁ గడున్ ధర్మోత్తరుండైన భూ
తల మవ్వాని ననార్యుగాఁ దలఁచు "శాంతం భూషణ"మ్మన్న పె
ద్దల వాక్యంబు నెవండు శాసనముగా ధ్యానించి పాలింపఁడో? ౧౪౫

చ. అనెడి హితోక్తి కా నరవరాధముఁ డల్కను బేర్చి బిట్టు పా
లను విస మెక్కు పామువలె "లావువిరాగము నాటుకొన్న నీ
మనసున నేల నన్ను బతిమాలుదు వీ గతిఁ బ్రాణరక్షణం
బునకయి దీనదీనముగ మూఢునిరీతి నటించుచుం బల్కినన్.

మ. యతిచంద్రుండు వచించె నిప్పగిది నిన్ యాచింపఁగా లేద క్ష్మా
పతిచూడామణి! నశ్వరంబయిన నా ప్రాణంబుపైఁ దీపిచే
క్షితి నిర్దోషిని బీదసాధుని వధించెన్ భూవరుం డన్న శా
శ్వత దుష్కీర్తివహింతు వీ వనుచు నా స్వాంతంబు పొక్కుం గడున్.

క. నా యట్టి యభాగ్యుం డొకఁ
డీ యిలఁ జన్మించుకతన నీదృగ్గతి నీ
కీ యపకీర్తి ఘటిల్లును
గా! యని నా యెద సహస్రఖండంబు లగున్. ౧౪౬

క. కయిజాతినఁ గాల్జాతిన
పయినిం జేయంగఁ దగ్గ పని యున్నదె ? లె
స్సయుఁ దోల్త విచారింపని
క్రియ కుట్టుచునుండు మదిని వృశ్చిక మనఁగన్. ౧౪౭

క. ఎవఁ డుట్టి గట్టి యూఁగును
భువి నాచంద్రార్క తారముగఁ బోదురు వె
న్దవులుచు నొక్కొక్కరి దీ
న వృథా సంతాప మొందు నరుఁడు నరుండే? ౧౫౦

క. నీ వంశాటవిఁ గాల్చును
దావాగ్ని యనంగ రేఁగి త్వత్పాపం బో
భూవర! నీ యొక్కనితోఁ
బోవద యిందులకు నేను బొగులుచు నుంటిన్. ౧౫౧

క. అని ముని యుపన్యసించిన
వినఁ డాతం డూషరోప్త బీజము మొలకె
త్తునె? రుచి యగునే చక్కెర?
ఘన పిత్తా[illegible]శయుని నాలుకకు నెన్నండున్. ౧౫౨

ఆ. వె. అనపరాధులై మహాపవిత్రములైన
గోగణంబు మన్నిగొనుచు నున్న
క్రోలు పులికి భూమి పాలకుం డన్న యో!
తమ్ముఁడో! యటంచు నమ్మఁదగును. ౧౫౩

క. కరఁగింపవచ్చుఁ గొండలఁ
గరఁగింపగవచ్చు నీ యఖండావనియున్
గరఁగింపరాదు మూర్ఖుని
దురహంకార పరిపూర్ణ దుర్మానసమున్. ౧౫౪

గీ. అవనిధరముల వ్రచ్చు వజ్రాయుధంబు
నఖిల లోకంబు లార్చు బ్రహ్మాస్త్ర బలము
నప్రతిహతంబు హరి చక్రమైన వృథయ
పరమ మూర్ఖుని మూర్ఖత ప్రియ్యాలింప. ౧౫౫

క. ఓ కపటయోగి! చూడుము
నీ కథ సాంతంబొనర్తు నిమిషార్ధములో
నా కత్తి యాఁకలిని నీ
మైకండలఁ దీర్ప సంభ్రమంపడుచుండెన్. ౧౫౬

మ. ఇదె! నీ దంభము వెల్లడింతునని భూమీశాధముం డున్నత
ప్రదరాఘాతముచేత మానిజన రాడ్బాహాలతం దుంచె బె
ట్టిదపుర్ రక్తఝరుల్ సిరావితతి నుండిన్ మీఁదికిం జిందఁగా
హృదయంబుం బగిలించుఁ జూపఱకు నా దృశ్యంబు దుష్ప్రేక్ష్యమై.

మ. చలియింపండు మనంబునందు వదనచ్ఛాయంబుఁ గోల్పోఁడు; క
న్నుల రానీఁడు విషాద బాష్పలవముల్ దూషింపఁడా దుష్ప్రభున్;
దలఁపం డెట్టి ప్రతిక్రియం గడిఁది బాధం బొందుచున్; గాని యు
త్తలమొందుర్ మునిఁ జేని దుర్యశముకై తత్ప్రాంతరంగంబునన్. ౧౫౮

క. గఱుల న్నఱకఁగ రాఁగాఁ
బురందరుం డేఁడు సంద్రముల డాఁగిన య
గ్గిరులెల్ల నీ మునీంద్రుని
చరితకుఁ దల వాంచుకొనవె? సత్యముగ వినన్. ౧౫౯

క. మిను విఱిగిపడ్డఁ బిడుగులు
తనపైఁ బదివేలు పడ్డఁ దపియింపం డా
త్మను వీరుఁడు తనకొఱకయి
వనటం గొనుఁ గాంచి పరులపాటున కెడఁదన్. ౧౬౦

ఉ. కిమ్మనఁ డీతఁ డిప్పగిదిఁ గేల్దెగి రక్తము పాఱుచున్న నా
శమ్ముల; మాఱకుండె ముఖలక్షణ మల్పముఁ; గానరాదు కో
పమ్మును నా పయిన్ సవి నృపాలకుఁ డక్కజమొంది క్రూరకా
ర్య మ్మొనరించినాఁడనో? మహాత్ముఁడో! యీతఁడు? పాపినైతినో!.

క. పొరపడితినో! మునిమ్రుచ్చని
పరమేశ్వర సదృశుఁ డగు తపస్వినిఁ, దన కేల్
నఱకిన నా పయిఁ గరుణా
భరితాపాంగముల నెట్లు పరగించెడినో? ౧౬౨

క. త్రికరణ శుద్ధుఁడు దాంతుం
డకలంకుం డనుచు నకట! యరయక తద్దం
గికురించి చేయి మిగిలితి
నిఁకఁ బ్రాయశ్చిత్త మేమి యీ చేతి కిలన్. ౧౬౩

ఉ. ఎందుల కింత దౌష్ట్య ముదయించెను నాకు? మదీయ సుందరీ
బృందము తెల్పినం బెడచెవిం గొను నంతటి పారుష్య మేల నా
డెందము నిల్లుగట్టుకొనె? డెప్పర మయ్యెను నా చరిత్ర యే
మందులఁ బాపరోగ మది మానును నాకుఁ బ్రశాంతిగల్గెడిన్. ౧౬౪

క. ఘాతుకత వచ్చు నా కొగి
నాతిథ్యార్పణము సేయ నరుదెంచు గుణా
న్వితునిఁ గొదుకక కెడపిన
పాతక మడఁగునొకో? వేయిబాముల కైనన్. ౧౬౫

క. అనుచుం ద్వరపడి చేసిన
పనికై యనుతాపవహ్నిఁ బడి మ్రగ్గుచు న
మ్మున్ని పాదాబ్జముల క్షమా
ర్పణ మడుగఁగఁ ఖిన్నుఁ డగుచు వ్రాలెను భక్తిన్. ౧౬౬

క. జననాథు క్రోధయజ్ఞం
బునకుం బశువైన సాధుమునిచంద్రుం డా
తనిఁ దాను క్షమించిన దే
వుని బారింబడక తప్పిపోఁడని పొగులున్. ౧౬౭

ఉ. ఆ నరపాలు సంగముల నత్తఱి వృశ్చికకోటి కుట్టు చం
దానను, గాల్చి కఱ్ఱులను దద్దయు వాతలు పెట్టునట్లుగం
బూనిక గ్రుచ్చునట్లు కొఱవుల్ గొని రంధ్రములం దొలంచున
ట్లానఁగ రానిబాధ యొకఁ డుద్భవమయ్యె క్షణక్షణోగ్రమై. ౧౬౮

చ. నిలువఁగఁ జాల కాతఁ[illegible] వనింబడి పొర్లును, గాలుసేతులన్
విలవిలఁ దన్నుకొంచుఁ బలవించును; బారలు సాఁచి నాల్గు ది
క్కుల శరణార్థియై పఱచు; ఘోరప్రభూతముఁ గాంచుచున్న య
ట్టులు నెలుఁగెత్తి యేడ్చును గడుంగడుఁ బైత్యము నెత్తికెక్కఁగన్

మ. విసముం గ్రక్కుచుఁ బెద్దవిప్పి పడగల్ విచ్చేయుఁ బెన్నాగముల్
గ్రసియింపంగను నోరువిచ్చి పయికిన్ లంఘించు శార్దూలముల్
ముసలాద్యాయుధ పాణులై పొడువ నాలోకించు సైన్యంబు; న
ల్దెసలం బాపము చుట్టుకొన్నగతి ధాత్రీనాథునిం గన్పడెన్. ౧౭౦

క. బొమముడి బిగించి యుఱుముచు
ధుమధుమలాడుచును నెదుటఁ దోఁచి రనేకుల్
యమదూతలు; పిల్చిరి తమ
సమీపమున కరుగుదేర క్ష్మాపతిఁ బితరుల్. ౧౭౧

క. గిరిగిరఁ దిరుగుచుఁ బెను సుర
కరువలి వలె వశముదప్పి గాత్రంబు వడెన్
బఱియలు వాఱన భూగ
హ్వరమునఁ దలక్రిందుగా లతాంగుల యెదుటన్. ౧౭౨

క. తన కండకావరంబున
ధనాంధకారమున సద్ధితంబులు వెగటై
మునులకుఁ జెనంటిఁ గూర్చెడు
జనునకుఁ గా కిట్టి గతులు సద్గతు లున్నే! ౧౭౩

క. పతిదుర్మరణంబునకై
కుతకుత యుడుకంగ నెడఁదఁ గోమలులును నా
క్షితిగర్భంబున దూఁకిరి
సతులకు ననుమరణ మిలను సహజంబకదా! ౧౭౪

ఆ. వె. వలను సాహసంబు వలదన్న సంయమి
నోటిమాట యుండ నోటియందె
భర్తృమోహపాశబద్ధలు గావుట
వెడలి రెల్ల రతని వెంబడించి. ౧౭౫

క. ఎరగలి తన కారణ మగు
తరు వొక్కటె కాక ప్రాంతతరువులను బలెన్
దురితము కర్తనె కాకి
ద్ధర బుగ్గి నొనర్చుఁ బ్రాఁకి తద్వంశంబున్. ౧౭౬

ఉ. అంతకుమున్న మంత్రులు విహారముకై పువుఁబోండ్లఁగూడి భూ
కాంతుఁడు చన్నఁ బెద్ద క్షితికంపము పుట్టె తుపాను రేఁగి క
ల్పాంతమునందువోలె మనుజాగ్రణి సౌధచయంబుఁ బూడ్పఁగా
శాంతికపౌష్టికంబులను సల్పఁగఁజేయఁగ వచ్చి తేనికై ౧౭౭

మ. వనమధ్యంబున సంచరించుచును దత్ప్రాంతంబు విచ్చేసి య
మ్మునిగాత్రంబు వధించుటాదిగఁ జెలుల్ భూగర్భముం జొచ్చుదాఁ
కను గండ్లారఁగఁ జూచి దైవవిధికిం గైమోడ్చి యర్థావమా
ననకుం గల్గు ఫలంబుఁ గాంచి వెఱపొందన్ డెంద మత్యంతమున్.

ఉ. నెత్తుటఁ దోఁగుచున్న యమినిన్ మెలమెల్లఁగఁ దారసించి చే
యెత్తి నమస్కరించుచు మునీశ్వర! నీ కిటువంటి మేటి యా
పత్తును గూర్చి యున్న జనపాలుని మంత్రుల మేము మాకుఁ గిం
చిత్తు విపత్తురాని గతిఁ జేయుమ! యిమ్మభయప్రదానమున్. ౧౭౮

క. బ్రతికింపుము మా ప్రభువును
బ్రతికింపు కృపార్ద్రమతిని రాణుల మమ్మున్
బ్రతికింపు మరాజకమున
యతినాథ! క్షమించి తొంటి యపచారంబుల్. ౧౮౦

మ. అని ప్రార్థింపఁగ క్షాంతివాది యను నేలా మీరు భీతిల్ల? నె
వ్వని పాపం బతనిం దినున్; భయమెదన్ వర్జింపుఁడీ! దాఁటిపో
యిన వారెవ్వరు లేచివచ్చి రిపుడె ల్లెతెంతుర్ మీవారు? వ
చ్చిన మీకన్నను నేన హెచ్చుగను హర్షింతున్ మనస్ఫూర్తిగన్.

క. తరువుశాఖను బలెఁ గేలు దరుగుచున్న
వానిపయి లేని యలుక మీ పైని నేల?
మరచిపోతిని గోపమ న్మాట యెపుడో?
ఇత్తఱిం గ్రొత్తగ క్షమింప నేమిగలదు? ౧౮౨

చ. అవని యరాజకం బగు నటంచు భయంపడకుండు; మీదు భూ
ధవుని సమీపబంధు సముదాయమునన్ శుభలక్షణాఢ్యుఁడై
ప్రవిమల వృత్తుఁడై పరగు బాలకు నొఁదలఁ గట్టి పట్టమున్
భువి కభిషిక్తుఁజేసి కొలువుం డతనిం దలవాంచి భక్తిమై. ౧౮౩

క. ఈ చోటియందుఁ గల ధ
ర్మాచరణ పరాయణాత్ముఁ డయి చతురుండై
వాచంయమేంద్రుఁడు గురుం
డై చదువఁగఁ జేయు నతని నామ్నాయంబుల్. ౧౮౪

క. వరవడి దిద్దింపుం డా
చిరుతుకచే క్షాంతి ముఖ విశిష్టగుణంబుల్
స్థిరముగ నదుకుఁ "డహింసా
పరమోధర్మ" యను సూక్తి వాని యెడందన్. ౧౮౫

క. అని యాదేశసమానము
ముని యుపదేశం బొనర్చి మూసెను గన్నుల్
కననియు విననియు తేజము
జను లబ్బురపడఁగ వెడలె శమిగాత్రంబున్. ౧౮౬

క. కన్నుల వ్రేఁగయ్యెఁ దుదిం
గన్నులకుం బండు వగుచుఁ గానంబడె న
భ్యున్నత మగు మునిదృశ్యము
మన్నింపఁగఁ బదియు నాల్గు మండలము లోగిన్. ౧౮౭

ఉ. ఆ మహనీయు నాశ్రమమునందు వసించు పిపీలికాది నా
నామృగపక్షిబృందము ఘనంబగు భక్తినిఁ జేరవచ్చి యా
శ్రీమృతకాయముం గని భజించిరి తద్దయు జాలువాఱగా
మోములబాష్పపూరము 'నమోనమ'యంచునువ్రాల్చియాఁదలల్.

ఉ. ఆ నృపమంత్రు లాత్మహృదయంబులు గండిపడంగ నశ్రు సం
తానము కాల్వగట్టుచు వనస్థల మంతయుఁ జెమ్మగిల్లఁగా
మౌనిని జందనాగరు సముంచితకాష్ఠచితి న్నమర్చి యొం
తేనియు నూర్పులన్ విసరు చెట్లో?దహింపఁగఁజేసి రయ్యెడన్.౧౮౯

క. ప్రోవిడి యస్థిచయం బా
తావునఁ గల్పించి శిల్పితండంబులచేఁ
గోవెలఁ జెక్కించిరి ముని
దేవుని యీ కథను దేటతెల్లముగాఁగన్. ౧౯౦

ఉ. ఆతని కూరుచున్న తరు, వాతని నిత్యము స్నానమాడు రే,
వాతని పూలుగోయు లత, లాతని పండెడు రాతి సెజ్జయున్
క్ష్మాతటిఁ బుణ్యతీర్థములుగా గణియించుచుఁ బోవు యాత్రిక
వ్రాతము నిచ్చ లుత్సవపరంపర లచ్చట నొప్పు నేఁటికిన్. ౧౯౧

చ. పరమపవిత్రమైన మునివర్యు చితాభసితంబు నొక్కఁగో
క్కఁరె గ్రహియించి దోసిటను గండ్లకు నద్దుచుఁ బోదు రిండ్లకున్
జ్వరితులకుం బిశాచగణ బాధితకోటికి నౌషధంబుగా
ధరణిని వాడుకొంద్రు సతతం బటకుం జనుచున్న యాత్రికుల్. ౮౯



# వ్యా ఘ్ర జా త క ము

చ. ఒకపరి బోధిసత్త్వుఁడు మహోన్నత ధర్మపథావలంబియై
అకలుషితస్వభావుఁ డయి యార్యచరిత్రుఁడై బుధావతం
సక మయి వంశరత్న మయి సర్వజనస్పృహణీయభాగ్యుఁడై
ప్రకటతఁ గొన్న భూమిసురవర్యునకుం బ్రభవించెఁ బుత్త్రుఁడై. ౧

ఆ. వె. కామధేనువునకుఁ గలిగెను నందిని
వ్యాసమునికి శుకుఁడు ప్రభవ మొందె;
నరణి యందు నగ్ని యావిర్భవించెఁబో!
యనుచు నెల్ల రసిరి యతనిఁగాంచి. ౨

క. పువు పుట్టంగనె పుట్టును
భువిఁ బరిమళ మన్న చందమున సద్విద్యా
నివహంబు వానితోను
ద్భవమై తద్రసన యందుఁ దాండవ మాడెన్. ౩

ఆ. వె. సర్వవేదములను సర్వశాస్త్రంబులఁ
బెక్కుకళల నతఁడు పుక్కిలించె
నబ్ధిసప్తకంబు నాపోశనముఁ బట్టు
నా యగస్త్యమౌని యవ్విధమున. ౪

క. అనుకంప కిచ్చె హృదయముఁ,
దను వొసఁగె సురూపమునకు దానంబునకుం
దన చేయిడె నీతఁడు లే
దన కడుగుడె తడవుగా సమస్తం బొసఁగెన్. ౫

క. ధర నతఁడు మించ ధర్మా
చరణంబున శమదమాదిసంపదఁ దన తం
డ్రిరి నటఁ "బుత్త్రా దిచ్ఛే
త్పరాజయ"మ్మనెడు సూక్తి తథ్యంబయ్యెన్. ౬

ఉ. అంపముఁ బూని దుంగలను వ్రక్కలు సేయుచునున్నఁ గొమ్మలం
ద్రెంపుచు నున్న వృక్షవితతిం, గడుఁ జీల్చుచు నుగ్గునూచగా
దంపుచు నున్న రాల్గమి నతండు స్వచిత్తము నట్లచేసిన
ట్లింపఱఁ గుందుచుండు నిఁక నెట్లు తపించునొ భూతబాధకై. ౭

సీ. పండ్లతోఁటల వ్రాలు పక్షిబృందంబుపై
నొడిసెల గుఱిసేయ నోర్వఁ డతఁడు
పంటచేలకుఁ బాఱు పసులమొత్తము నాఁచు
పలుముండ్ల కంచె నోపం డతండు
తన పళ్లెరంబునఁ దిన్న బిడాలంబును
దొలచె నెను నెట్టఁజాలఁ డతడు
తన్ను భక్షింపంగఁ దఱియు బెబ్బులి నైనఁ
గత్తిక నెరసేయఁ గడఁగఁ డతడు.

గీ. 'ఆత్మవత్సర్వభూతాని'యన్న శ్రుతికి
'ఆత్మవన్మన్యతే జగ'త్తనెడి నుడికిఁ
దన చరిత్రము వ్యాఖ్యానమునుగఁ జేసి
మూర్త మగు భూతదయ నాఁగఁ బొలుచు నతఁడు. ౮

సీ. పట్టి పుర్వులపిండు భక్షించు తొండలన్
బల్లులం గని మోము పుల్లసిల్లు
విషము గ్రక్కెడు పాముఁ గసిమసంగుచు నున్న
ముంగిసం గనుఁగొన్న మూతిఁ ద్రిప్పుఁ

బడి కాలిక్రిందట మడిసెడు క్రిమికీట
సంతతిఁ గాంచి బాష్పములు రాల్చు
మృగయామిషంబున మృగబృందము వధించు
బోయలం గని కన్ను పొడుచుకొనును

గీ. తనదు ప్రాణంబు లైనను వినిమయించి
ప్రాణముం బోసి బ్రదికింప వాని నెల్లఁ
బాటు పడుచుండుఁ బాప మా బాలయోగి
తన యశక్తతఁ గని డెందమునఁ గలంగు. ౯

క. బాలుఁ డగు నతని సద్గుణ
జాలము మేల్బంతి గాఁగ శ్రద్ధాళుత వృ
ద్ధాళులు వరవడి వ్రాసినఁ
జాలరు పడయంగ వాని సాదృశ్యంబుల్. ౧౦

గీ. వయసు మీఱిన పాండితీవైభవమున
విషయవైస్పృహ్యమున సద్వివేకమునను
ధర్మకార్యైకదీక్ష నాతండు బొలిచెఁ
జిన్న యయ్యును బెద్దయై పెద్దలందు. ౧౧

సీ. చికిలిసేసిన కాము చిగురుఁగోలలఁబోని
చెలువల ముండ్లకొమ్మలుగ రోయు
వెలగట్టఁగా రాని పెనురత్నరాసులఁ
గొఱగాని గాజుపెంకులుగఁ ద్రోయు
జిలుగు బంగారు దువ్వలువమొత్తంబు దు
ర్లలితకంటకపత్త్రములుగఁ దెగడు
పసిఁడియందలములుఁ బఱుపుపాన్పులపిండు
బలితంపు టంపశయ్యలుగ నెట్టు

గీ. కావిపుట్టంబుఁ దాల్పంగఁ గానలందుఁ
గోనలందును వసియింపఁ బూన జడలు
తత్త్వము గ్రహింపఁ బ్రజకు బోధం బొనర్ప
యౌవనారంభమున నతం[illegible]లషించె. ౧౨

ఉ. ఆతని వంకఁ గాంచు జలజాక్షి కటాక్షము మొక్కవోవుఁ బెన్
రాతినిఁ దాఁకు నారస మనంగఁ దదీయతనూవిలాసముల్
బ్రాఁతిగ నొడ్డుఁదాఁకియు నివర్తిలు చున్న నదీతరంగ సం
ఘాతము తోడఁబుట్టువులుగాఁ దలఁపించును జూచువారికిన్. ౧౩

గీ. వాయువుం బోలె జలమును బలెను దుర్వ
శేంద్రియంబుల బంధించి తృష్ణ గెలిచి
శాంతిసాగరమున మానసంబు నెప్పుడు
నోలలాడించు చుండు నయ్యోగివరుఁడు. ౧౪

క. కని కొందఱు విని కొందఱు
ఘనభక్తిశ్రద్ధ లుఱలఁగాఁ జనుదురు త
న్ముని దర్శింప నిసుక రా
లని విధమున నేల యీను లాగున సతమున్. ౧౫

క. తన కడకు నేఁగుదెంచెడి
జనసంచయమున కహర్నిశముఁ గావించున్
ఘనతర ధర్మప్రవచన
మును బీయూషరసవర్షమును బోలె నిటుల్. ౧౬

గీ. ఆవగింజంతయైన సౌఖ్యంబు కొఱకుఁ
బర్వతం బంత దుఃఖంబు వడుచు నుంద్రు
రాలు మోయుదు రొక కొన్ని పాలకొఱకు
సార మెఱుఁగక జనులు సంసారమందు. ౧౭

ఉ. కాంచినదెల్లఁ గావలయుఁ గావలె నంచు నిరంతరంబు వే
ధించుచునుండఁ జిత్తము పదింబదిగా నరుఁ డెల్లవాని సా
ధించఁగ రేబవల్ తినఁగ దీఱక కంటికిఁ గూర్కురాక దుః
ఖించుచు నుండ నాతని సుఖిత్వ మదెంద సుఖిత్వ మిస్సిరో. ౧౮

చ. పెను గుదిబండ కుత్తికకుఁ బెండ్లము బిడ్డలు కాలిబందముల్
ధనతతి కేలిసంకెలలు తన్నివి యెల్లయు ముంచుచుండ జీ
వననదిఁ బోవుచుండఁగను బ్రాణము లుక్కిరిబిక్కిరాచు నే
జనుఁడు ప్రశాంత చిత్తుఁడయి సత్య సుఖంబు వహించుఁ జెప్పఁడీ.

క. తన దొడ్డి వేల్పుగిడ్డియు
తన ముంగిట వేల్పుఁజెట్లుఁ దనగృహమునఁ గాం
చనశైలముఁ జింతామణి
యును వెలిసిన నరుని కామ ముడుగదు లవమున్. ౨౦

క. కామోపభోగతతిచేఁ
గామము శాంతిల్ల దండ్రు నిజమైన హవి
స్తోమమున నగ్నియుం బలె
నేమమునఁ ద్యజింప నదియు నిక్కం బడఁగున్. ౨౧

శా. ఈ సంసారము పెద్ద కారడవియం చీదేహ మిల్లంచుఁ బెన్
బ్రాసంబుం గొని కాలచోరుఁ డట దూఱం జూచు నం చంత నా
శ్వాసాంతం బగు నంచు ఘోషిలును శాస్త్రవ్రాతముల్ కాన ద
త్త్వాసిం బూని శమాది సైనికుల సాహాయ్యంబుతో నుండుఁడీ. ౨౨

ఉ. ఊహలు సాగరోర్మ్ములన నెత్తటి లేవ సమూల మెట్టు లీ
యైహిక దుఃఖ నాశ మగు నైంద్రియవృత్తుల నిగ్రహించి స్త్రీ
మోహము దాఁటి శాంతమతిఁ బూని విరాగము వాసనాక్షితిన్
దేహవిముక్తిఁ బొందుటకు దేహి ప్రయత్న మొనర్పఁగా వలెన్.

క. అని యిహదుఃఖముఁ దత్కా-
రణముఁ దదుత్పాటనాచరణమార్గంబుల్
ఘనుఁ డతఁ డుపన్యసించును
వినువారికి వింతమార్పు వెలయఁగ నెదలన్. ౨౪

సీ. నిండుజవ్వనము జన్నియవట్టి తపియించు
చున్న లేజవ్వని నుజ్జగించి
కను వేఁదుఱునఁ దన్నుఁ గౌఁగిలింపఁగఁ బాఱు
తెంచు రాలచ్చి విదిల్చి కొట్టి
తన్ను భవాంభోధి దాటించు తెప్పగా
భావించు నధికార పదవిఁ బాసి
స్మరకామధేనువై సరవిఁ గోర్కులఁ బిండు
భోగినీ మణి పేర బొమ్మఁగట్టి
గీ. మంత్రితంత్రంబులకుఁ బోలె మదులు దిరుగ
నతని ధర్మోపదేశ వాక్యముల కలరి
కాంక్ష సేయుచు శిష్యజీకంబు మెల్ల
యువకు లొక్కొక్కరుగ వచ్చుచుండ్రు గొలువ. ౨౫

గీ. ఉదుకుఁ గావుల నొక్కరుం డూడ్చి కసవుఁ
జల్లుఁ గలయంపి నొక్కఁ డాశ్రమము ముందు
కంద మూలఫలాదు లొక్కండు తెచ్చు
మెత్త పఱచును వానికి బత్తినొకఁడు. ౨౬

ఉ. తల్లిని మూఁగు పిల్లల విధంబునఁ గూరిమి మక్కి కావళుల్
బెల్లము నొద్ద వ్రాలు సరవిన్, విరిదమ్మినిఁ జుట్టు తేంట్లునా
నుల్లము లుల్లసిల్లఁగ సమూహములై జను లేగుదెంచి యా
బల్లిదు తత్త్వవాక్సుధ లవారిగఁ గ్రోలుచు నుండ్రు భక్తిమై. ౨౭

క. తనదేహ మాదిఁ బెను బం
ధన మనుచుం దృణీకరింపఁ దలఁచెడి శమికిన్
దను దర్శింపఁగ వచ్చిన
మనుజావళి యొసఁగు పసిఁడి మాడ లవేలా? ౨౮

క. ఆతని ద్వేషించెడి వాఁ
డాతని పై మరులుగొన్న యతివయు శిష్యా
వ్రాతమునఁ గలిసి పోవుదు
రాతని కనుచూడ్కి పడిన యా నిముసమునన్. ౨౯

సీ. అలరువిల్తుని మోహనాస్త్ర సందోహంబు
తళతళల్ క్రోల్పోయి చిలుమువట్టె
తరుణదంపతుల నర్తనశాలలై వెల్గు
శృంగార వనులు నిద్రించు చుండె
పాన గోష్ఠీ ప్రసంగానుకూలములైన
వెన్నెల రాతిరుల్ చిన్నవోయె
మృదువైన తాఁకుల మెయి హాయిఁ గదిరించు
జిలుఁగు దువ్వల్వలఁ జెదలు మేసె
గీ. ప్రమద మిడు కేళకూళులు వట్టిపోయెఁ
జెలువు వెలియమ్మె నిసుకతిన్నెల బయళ్ల
బోధిసత్త్వుని ధార్మిక బోధఁ బ్రజలు
జ్ఞాన వైరాగ్య సంపన్ను లైన కతన. ౩౦

క. అహరహము జ్ఞాన బోధల
బహుకాలము గడపి యదియు బంధముకాఁగా
గృహముం ద్యజించి శిష్యులు
సహాయులై రాఁగ నతఁడు చనె వనమునకున్. ౩౧

మ. తరుషండంబు వసంతు నాగమము చేతం బోలె నా మానిశే
ఖరు రాకం జిగురించి పల్లవతతిం గన్పిందుఁ గల్పించె ని
ర్ఝర పూరంబు లగస్త్రిరాకను బలెన్ స్వచ్ఛంబులై పాఱె నే
డ్తెఱఁ గ్రపంబునఁ బోలె సౌరభము నిండెం దత్ప్రదేశంబునన్.

గీ. కడచుచుండంగఁ గాల మాతఁడు తలంచె
"జనుఁడు వేయేండ్లు బ్రదికినం జావకున్నె?
చావు దప్పనిచో నేల జడియు నతఁడు
విశ్లథ శరీరబంధుఁడై పేరు విన్న. 33

క. మంచపుఁ దోడుగఱయై జీ
వించుచు మలమూత్రరాశి వెతగొను కన్నన్
బ్రాంచితము గాదె? యొడ ల
ర్పించి పరార్థంబు జనుఁడు మృతిఁబొందు టిలన్. 3౪

సీ. అనలాహుతి నొనర్చె నాత్మదేహము దీర్ప
బోయ యాఁకటిని గపోత మొకఁడు
తన మెనికండలు తఱిగి త్రాసునఁ బెట్టె
శ్యేనంబుఁ దూఁచె రాజేంద్రుఁ డొకడు
శకుంద్రుడు గోర నిశ్శంకంబుగా నిచ్చెఁ
దనదు వెన్నెముకను ముని యొకండు
తన రక్తమాంసముల్ తనివి దీఱ నొసంగె
వైనతేయున కొక్క పావనుండు

గీ. అన్యదీయంబు న్యాస మీ యంగకంబు
కాద యాత్మీయ మెవరి కే క్షణము నందు
వలయువారికి నర్పింప వలయుఁ గాని
దాఁపరము సేఁత దూష్యంబు తథ్యముగను. 3౫

క. తన చర్మ మొలిచి యిచ్చును
వెనుకాడక తరువు; వ్రీలి బీజ మొసంగున్
ఘన ఫలవృక్షంబు నచే
తనములును బరార్థ మాత్మతనువుఁ ద్యజించున్. ౩౬

గీ. ప్రాణి జీవంబుఁ గాన నా ప్రాణ మొసఁగు
భాగ్య మున్నదే? యెంతటి వారి కద్ది?
నాకు రాఁబోవు నెల్ల జన్మముల యందు
నట్టి పుణ్యంబు పుట్టంగ నభిలషింతు." ౩౭

మ. అని కాంక్షించుచు నా మునీశ్వరుఁడు యోగాభ్యాస యోగ్యస్థలం
బును శోధింప సశిష్యుఁడై గిరి దరుల్ పూవుంబొదల్ లోయలున్
వనముల్ వాఁగులు వంకలుం గనుచుఁ బోవం బోవ సద్యఃప్రసూ
త నిజాపత్యము మ్రింగు నాఁడుపులి ప్రాంతం బందుఁ గానంబడెన్.

మ. కని యా దృశ్యము కాలుసాఁగక పయిన్ ఖండింపఁగాఁ బడ్డ రీ
తిని నిర్ఘాతము వచ్చి పైఁబడిన భాతిన్ నిశ్చె నిశ్చేష్టుఁడై
కనులన్ నిండఁగ బాష్పముల్ మది కలంగన్ వెన్నయుం బోలె నో
ట నోకండై నను మాట రాక ముని దట్టంబైన దుఃఖంబునన్. ౩౯

ఆ. వె. ముడుచుకొనును మోము మూయును గనుదోయి
యేవగించు మఱియు నెడఁదఁబొక్కఁ
జూడలేక త్రిప్పుఁ జూడ్కులం బ్రక్కకు
మునియుఁ జీత్కరించుకొనుఁ గడింది. ౪౦

క. ఇంచుక డెందము సంబా
ళించుక తన శిష్యమండలిం గనుఁగొని వీ
క్షించితిరే? యీ దృశ్యము
చించెదు హింసాపర్ష మనఁగఁ జిత్రాంబుజముల్. ౪౧

ఉ. క్రిమ్మఁగ లెస్స చీఁకటులు కన్గవ గాన్పునఁ జేసి మండఁ దీ
క్ష్ణమ్ముగ జాఠరాగ్ని చనఁజాలక బెబ్బులి మేఁత కన్య దే
శమ్మునకున్ స్వసంతతిని సైఁపక మ్రింగఁ దొడంగెఁ గన్న మో
హ మ్మయినం దలంపకయు స్వార్థపరత్వ మనంగ నెట్టిదో. ౪౨

క. తమ బిడ్డల బ్రిదికింపఁగఁ
దమ ప్రాణము ధారవోయఁ దలఁతురు తల్లుల్
తమ బ్రిదుకు కొఱకు బిడ్డల
నమాంతముగ మెసఁగు టిది మహాశ్చర్య మగున్. ౪౩

ఆ. వె. విప్పుకొనని కంటి రెప్పలతోఁ గుంయి
కుంయి మనుచు, నెక్కి కొనుచు మీఁదఁ
ద్రొక్కుకొనుచు నెల్ల ప్రక్కలం బ్రాఁకుచు
నున్న సిసులఁ దినుచు నుండె లాఁగి. ౪౪

మ. మలభాండం బగు నీ శరీరమును బెంపన్ నంజుడుల్ మేఁపి ప
క్షుల నానామృగసంతతిం జిదుముచున్ గ్రూరాత్ములై యుండ మ
ర్త్యులు విజ్ఞానులు మూఢజంతువుల రీతుల్ తెల్పఁగా నేల? చిం
తిల దోసాలకుఁ బెద్ద బుంగ యగుఁబో దేహాభిమానం బిలన్. ౪౫

క. తన కలిమినిఁ దెలవాఱును
దన లేమిని ముచ్చముడుఁగు ధారుణి తమ మం
దని తలఁచు జనుఁడు తన కో
డినిఁ గూఱిచి యవ్వ యుగ్గడించిన కరణిన్. ౪౬

క. విష సంవృద్ధికి యాశీ
విషమునకుం బాలువోయు విధమున భువి మా
నుషు లాడలు మేఁపుదురు కి
ల్బిష వర్ధనమునకై జంతు లిశితంబులచేన్. ౪౭

క. మూలము సంసారం బు
త్తాలపు దేహాభిమాన తరువున కది ని
ర్మూలింపవలయుఁ జూడి త
త్త్వాలంబనమున జితేంద్రియత్వము చేతన్. ౪౮

గీ. అదను గా దిది తడయంగ మొదల మీరు
వేఁగి కాహారమును వేగ వెదకి తెండు
మృత మృగంబులు లభియించు నిందు ననుడు
నలువురును గాన నలువలంకులకుఁ జనిరి. ౪౯

ఉ. వా రటువో నొకొక్కటిగ వ్యాఘ్రశిశుల్ కడ తేఱుచుండ నా
హారము కోసమై యరిగినట్టి స్వశిష్యులు రామిఁ బిల్చుఁ బ
ల్మారులు సంకటంపడుఁ గలంగును బేరెమువాఱు నల్దెసల్
తేఱక చేతులం బిసుకు దెల్ల మొగంబును వేయు జూచుచున్. ౫౦

చ. అతఁ డిటు కొంత సే పెడఁద నాదర బాదరఁ బొంది యెద్దియో
మతిని స్ఫురింపఁగా వదనమండల మందుఁ బ్రమోద రేఖ యం
చితముగఁ బిల్ల లిక్కరణిఁ జెల్లుడు శిష్యులు వచ్చినన్ వృథా
గతజలసేతుబంధనము గాదె యగున్ సవి కాంచి స్వాంగమున్. ౫౧

క. పరమేశ్వరుఁ డిచ్చిన యీ
శరీరమునఁ బులిని మేఁపి సంరక్షింపన్
వర మీ నెత్తురుగందులఁ
బరోపకారమున కన్న భాగ్యం బున్నే! ౫౨

ఆ. వె. ఎండి పుల్లవిఱిగి యెన్నఁడో పడి కూలు
తరువు కరణి నున్న తనువు నందు
వెసఁ బరోపకారపీయూషమును జల్లి
యమరముగ నొనర్చు టర్హమగును. ౫౩

క. మలినంబై నిర్గుణమై
పలు రోగంబులకు నాటపట్టగు నొడలిన్
బలియిచ్చి పరప్రాణం
బులఁ గాపాడుట యఖండ పుణ్యము గాదే? ౫౪

ఉ. చాలియు నన్యజంతువుల సంకటముల్ తొలఁగింప కున్నచోఁ
జాలియు బీదసాదులను సాఁకక యుండినఁ గూడు గుడ్డలన్
జాలియుఁ గావఁగా విడిచినన్ శరణార్థిని వాని జీవితం
బేల? ధనంబులేల? చదువేల? మహాఘము వానిఁజుట్టదే? ౫౫

గీ. ఆత్మసుఖముల కంతరాయం బటంచుఁ
బరుల దుఃఖంబుఁ దీర్పని వారి కెట్లు
పట్టునో? నిద్ర యన్న మెప్పగిదిఁ బోవు?
బెట్టిదంబుగ హృదయంబు కుట్ట దేమొ? ౫౬

మ. చిరకాలంబున నుండి చిత్తమునఁ గాంక్షింతున్ మదీయాంగమొ
త్తతియం దేనిఁ బరోపకారమునకై త్యాగంబు గావింతునా?
ధర నా కంతటి భాగ్య మున్నె? యనుచున్ దైవానుకూల్యంబు చే
కుఱుటన్ నేఁటికి లభ్యమయ్యె నది నాకున్ నేఁడు పర్వం బగున్. ౫౭

క. శతజన్మంబులకును నీ
గతి నా దేహము పరోపకారార్థం బ
ర్పితముగఁ జేసెడి పుణ్యో
న్నతి చేకూరంగ మనసునన్ వాంఛింతున్. ౫౮

మ. అనుచుం గూనల కోసమై తడవు నవ్యాఘ్రాంగనోత్సంగ మం
దున నిశ్శంకగఁ గూరుచుండ మునిశార్దూలంబు దైవంబు నా
కనుకంపామతి నీ పదార్థమును బథ్యార్థంబుగాఁ బంపె మే
లనుచున్ వాని యొడల్ తినందొడఁగె నాప్యాయంబుగా నత్తఱిన్.

గీ. వాఁడికోఱలఁ జీల్చుచుఁ బదును గోళ్ల
జించుచు సిరాముఖంబులఁ జిందుచున్న
నెత్త్రుఁ బీల్చుచుఁ గండలన్ మెసవు నతని
బడుగు దేహంబు పులకింప వ్యాఘ్రమాత. ౬౦

క. తనివొంది నా కృశాంగం
బున నాఁకలిఁ దేఱి శాబములఁ బులి తిన మా
నునో? లేదో యని పొగులును
ముని తన బాధకు లవంబుఁ బొగులఁ డెడందన్. ౬౧

క. తన యొక్కొక్కవయవమును
దినఁ బులి కందించుచుండెఁ దిని యదియును ద్రే
న్చెను లెస్సగ నది విని యమి
యును గన్నులుమూసె బెద్ద యూర్చుచు నెలమిన్. ౬౨

చ. పులి కెరఁ దేర దవ్వులకుఁ బోయిన శిష్యులు కాన నాల్గుమూ
లలఁ బరికించి యామిషము లబ్ధము గామి లవంబు నొక్కెడన్
గలఁగుచు రిక్తహస్తములఁ గమ్మఱి వచ్చిరి నెమ్మొగంబులన్
వెలవెల పాటు తోఁప నల వేఁగి కుఱంగటకున్ గురున్ గనన్. ౬౩

క. అరుదెంచి గురునిఁ గానక
పరిసరమునఁ బడిన కావివలువను గిండిన్
గుఱుతించి మృగము చెంగటఁ
బరికించియు నెంపప్రోవు వ్యథ గడలుకొనన్. ౬౪

గీ. రాహుముఖగహ్వరంబున రాజు వోలె
బోధిసత్త్వుండు శార్దూల ముఖముఁ జొచ్చె
రాజు క్రుమ్మఱు మా గురురాజు రాఁడు
పూర్వ దేహంబుతోడ నీ పుడమి పైకి. ౬౫

క. మా దేవుఁడు మా మిత్రుఁడు
మా దేశికసత్తముండు మా బంధువు మా
సోదర్యుఁడు మాతండ్రియు
మేదిని రవి సరవి నస్తమించెం గట్టా! ౬౬

ఆ. వె. లోకదీప మారె లోకేశ్వరుఁ డడంగెఁ
గల్పవృక్షకంబు కాలిపోయెఁ
బాలకడలి యెండె భాండారము హరించె
వ్యర్థమైన బ్రదుకు బ్రదుక వలసె. ౬౭

మ. అని దుఃఖించుచు వాని కావికుబుసం బా గిండి నా శల్యపుం
దునుకల్ కన్నుల కద్దుకొంచు శిరమందుం దాల్చుచున్ భక్తిమై
చని స్వీయాశ్రమ మధ్యభాగమున సంస్థాపించి యవ్వాని మీఁ
దను నిర్మించిరి దేవళం బొకఁడు భక్తశ్రేణి పూజింపఁగన్. ౬౮

క. నలువురు శిష్యులు నలుసెఱఁ
గుల భువిఁ గ్రుమ్మఱుచు దేశికుని తత్త్వసుధల్
చిలుకుచు లోకులపై న
గ్గల మగు గురుఋణము దీర్పఁగా గడఁగి రొగిన్. ౬౯



# శిబిజాతకము

క. తొలి బోధిసత్త్వుఁ డొకమా
రల శిబిదేశాధినాథు నాత్మజుఁ డై క
ల్యాలవిందై కడు పున్నెం
బుల పంటై ప్రజకు జన్మమును వహియించెన్. ౧

ఆ. వె. కురిసెఁ బూలవాన సురరాజు మనరాజు
పసిఁడివాన గురిసెఁ బ్రజలపైని
నర్థికోటి కెల్ల నాఱె నాఁకలిదప్పు
లతని జన్మ వార్త నాలకింప. ౨

క. కుసుమాస్త్రుని చుట్టంబన
వసంతుని సగోత్రుఁ డనఁగ బరికింప జయం
తు సజాతీయుం డన నా
రసాతలాధీశు తనయరత్నం బొప్పెన్. ౩

సీ. బాలరంభాస్తంభజాల సౌభాగ్యంపు
మొత్తంబు గరఁగించి పోసినట్లు
కమనీయమల్లికాసుమపరీమళరేఖ
బిట్టు పేర్కొని గడ్డ కట్టినట్లు
మానితహైయంగవీనమార్దవభూతి
చెన్నాఱఁగా బ్రోగు గొన్నయట్లు
సలలితమాకందఫలరససంపత్తి
మధురరూపంబుగా మాఱినట్లు

గీ. కరుడుగట్టిన మీఁగడతరఁగ యనఁగ
నమృతరసపక్వ మైన భక్ష్యం బనంగ
సుందరం బయి హృద్యమై శోభనమయి
చేసె నేత్రోత్సవంబు నా శిశువు ప్రజకు. ౪

గీ. వదలి సురలోకమును వేల్పు మొదవు వచ్చె
వెడలి నందన మరుదెంచెఁ బుడుఁకుమ్రాఁకు
తలఁపుమానిక మతని సౌధంబు సొచ్చె
గోశమును వీడి యా బాలు కొలు వొనర్ప. ౫

సీ. పులకండములకుఁ దోఁబుట్టువు లనఁ జెల్లు
జిలిబిలిపలుకులఁ బలుకుచుండు
జలదంబు మఱువడ్డ శశి తమ్ముఁ డనఁగ న
వ్వుచు మోము మూసి దోబూచులాడు
నమృతవారాన్నిధి యలల పై దోండ్లన
లలితంపుఁ జిలిపిచేఁతల నొనర్చు
వెలిదమ్మిలను నల్లకలువలన్ విరసిమ్మ
గితిఁ జూపు మొత్తంబుఁ గడలవిసరు
గీ. ముంగురుల తేంట్ల మొత్తంబు మూఁగుచుండ
మోముదామర నత్యంత మోహనముగఁ
బండువులపైనిఁ బండువుల్ వలెను వాని
శైశవక్రీడ లలరించె జనుల నెల్ల. ౬

క. అవయవములతో సద్గుణ
నివహంబుఁ దదీయసుగుణ నివహము తోడం
దవు విద్యావైభవమును
బ్రివర్ధిలెఁ గ్రమక్రమముగఁ బైఁబడ నేఁడుల్. ౭

క. నెలకయి వెన్నెలపులుగుల
వలెఁ బూర్ణప్రియుఁడైన వానికొఱకు న
ర్థులు గడుఁ దపింప నాతం
డెలజవ్వన మొందె బాల్య మెడలి ఫలముగన్. ౮

క. కొలువరులను వికలాంగుల
బలితపుఁ బేదఱిమి నార్తిఁ బడు సాధువులన్
అలరించును స్వీయాంగం
బుల వలె నతఁ డన్నవస్త్రముల నిడి సతమున్. ౯

సీ. పచ్చగడ్డియును మొల్వని చౌటిపట్టులు
ముక్కారుఁ బండు భూములుగ మాఱె
వట్టిపోయిన యట్టి వారిదశ్రేణులు
కుంభవర్షంబులు గురియుచుండె
నెండిపోయిన యాలపిండు పొదుంగులు
బానల నిండుగాఁ బాలొసంగె
మహిఁ బుల్లవిఱిగిన మ్రాఁకుల మొత్తంబు
బండ్లకొలందిగాఁ బండ్లుగాచె
ఆ. వె. పరిమళింపఁ దొడఁగె స్వర్ణంబు కమ్మఁగాఁ
బ్రథితలవణవార్ధి స్వాద్య మయ్యెఁ
బండుచుండె నేల బంగారపుం బంట
యౌవరాజ్య మంది యాతఁ డేల. ౧౦

క. పురవీథుల నొకపరి సం
చరించుచు నిగూఢవృత్తి క్ష్మాపతిపుత్రుం
డరసెను దరిద్రజనముల
పరిస్థితు లెడందఁ గందివడ దుఃఖమునన్. ౧౧

సీ. తల దాఁచుకొనఁగ నియ్యలఁ బూరిగుడిసెయుఁ
గనక కొందఱు కడగండ్లు గుడువఁ
గడుపుఁజిచ్చార్ప గ్రుక్కెడు గంజినీళ్లును
దొరకక పెక్కండ్రు దురపిలంగఁ
గట్టుపాఁతకు మాఱు చుట్టి మేనికిఁ జాఁప
మానరక్షణముఁ బెన్మందిసేయ
బలపాలు గట్టఁ గాళులు డాసి యిల్లిల్లు
పలువురు బికిరంబు వడయ కేడ్వఁ
గీ. బసిఁడిమిద్దెలు గట్టుచుఁ బంచపక్వ
ముల భుజించుచుఁ హొంబట్టుపుట్టములను
దాల్చుచు వ్యయించుచును వినోదముల కొఱకు
బ్రిదుకువా రెంతటి పరార్థపరులు దలఁప? ౧౨

క. తన విషయభోగములకుం
దనదు దురభ్యాసములకుఁ దన వేషార్థం
బును గడియించును మనుజుఁడు
ధనంబు మఱిగాదు దానధర్మంబులకున్. ౧౩

క. తిందురొ? పస్తు పరుందురొ?
ఎందఱు భూమండలమున నిట్టి దరిద్రుల్
వందురు చుందురొ? యెఱుఁగరు
కొందఱు మానవులు తెలిసికొనఁ బూనరునున్. ౧౪

క. కలవాఁడు లేనివాఁడును
గలవానికి యిత్తురు కట్నకానుకలు విందుల్
దులపం బోవరు వారెం
గిలి చేయుచు శోచ్యులగు నకించనతతికిన్. ౧౫

క. జనులకు లభింపఁ బుణ్యా
ర్జనావకాశంబు పద్మజాతుఁడు లోకం
బున దుర్గతులను సృజియిం
చెనో? యది కాకున్న సరిగ సృష్టింపండే? ౧౬

మ. అని చింతించుచు మంత్రిలం బిలిచి నాఁ డాజ్ఞప్తిఁ గావించె భో
జనసత్రంబులు వస్త్రశాలలు నివాసస్థానముల్ నాదు ప
త్తన మం దేర్పఱుపుం డొసంగుఁడు దరిద్రశ్రేణి వాంఛించు వ
స్తునికాయం బదియెల్ల లేదనక సంతోషింపఁగా రేబవల్. ౧౭

క. అని పలికి మూఁడుప్రొద్దులు
సని తన్నిర్మితము ధర్మసత్రములకు వ
చ్చిన యర్థు లడుగు దానికి
నినుమడి ముమ్మడిగ నిచ్చు నెద లుప్పొంగఁగ. ౧౮

సీ. తనదు గంపెఁడు పిల్లలును వెంటఁబడి యేడ్వ
క్షుద్బాధపడుచు నొక్కర్త వచ్చుఁ
గనులు బొత్తలుపడి కనరామిఁ జేకోలఁ
దడవుకొంచును దారిఁ దరియు నొకఁడు
చలికిఁ దాళక కప్పు సాలక యొడలెల్ల
ముడిచి మూటగ నొక్క బుడుత డాయు
నడువఁజాలక నేలఁ బడి దేఁకియుం బ్రాఁకి
వచ్చుఁ గుందుచు నొక్క పిచ్చుగుంటు
గీ. తన మనోవ్యథ నెఱిఁగింపఁ దరముగాక
మూకుఁ డొకఁ డేగు మోఁదుచు మొగముఁ గడుపుఁ
దమదు చిన్నమ్మ పుత్రిని ధర్మశాల
కిట్లు పెద్దమ్మపుత్రికు లేగుచుండ్రి. ౧౯

చ. తలఁచు మహోపకారముగ దానపరిగ్రహణంబు; యాచకా
వళి యిలువేల్పు లంచు నెద భావనసేయుఁ, గృతార్థమయ్యె నా
కలిమియు నాదుజన్మ మని క్ష్మాపతిసూనుఁడు పొందుచుండెఁ జే
రెలమిని నేలయీను గతి నెత్తఱి నర్థుల రాకఁగోరుచున్. ౨౦

గీ. పంచభక్ష్యాన్నములను భుజించుచున్నఁ
గడుపునిండక యుండెను బుడమితేని
కర్థిముఖదైన్య మెడలి దీవ్యద్వికాస
మొందుటను గాంచకున్న దైనందినంబు. ౨౧

క. దాత యగు నతని కర్థి
వ్రాతంబునకుం దగం గరంబులు రెండే
ధాత యొసంగి కటకటా !
తాతకుఁ గల మందబుద్ధితం బ్రకటించెన్. ౨౨

క. తన ధర్మశాల కాతఁడు
చనఁగా నొకనాఁడు తొంటి చందమున నటన్
గనఁబడకుండెను యాచక
జనుఁ డొక్కఁడైనఁ బెద్దశాపమునఁ బలెన్. ౨౩

ఉ. ఎంత యదృష్టహీనుఁడనో ? యే; నిది యెంతటి దుర్దినంబో ? నే
నెంతటిపాపినో ? యకట ! యేలొకో యాచకుఁ డొక్కరుండు నా
చెంతకు నొట్టుపెట్టి ప్రతిషేధ మొనర్చిన రీతి రాఁడు, మ
త్స్వాంతము తప్పొనర్చిన విధంబున సిగ్గిలుచుండె నంచొగిన్. ౨౪

క. కుడువఁడుఁ దొడుగఁడుఁ బూయఁడుఁ
బడుకొనఁడు, స్వరాజ్యకార్యపరతంత్రుఁడు గాఁ
డొడయఁడు పొగులుచు నివ్విధిఁ
బడి దానవ్యసనమందు భావము గ్రుంగన్. ౨౫

క. మఱునాఁడు మంత్రిపరిజన
పరివృతుండై ప్రభుండు ప్రాతఃకాలా
చరణీయదానములకై
యరుదెంచెను శాల కల జయధ్వను లొలయన్. ౨౬

సీ. కుప్పనఁగూరలై కోటానకోటులై
పడియుండె నొక్కట వలువపిండు
నిలువెత్తురాసులై వెలుఁగొందె నొకవంక
నానావిధములైన నాణకములు
లక్షోపలక్షలై లలినొప్పె నొకక్రేవ
స్వర్ణరాజతతామ్రపాత్రగణము
గుట్టలుగుట్టలై కొమరారె నొకమూల
ధాన్యాది సకలపదార్థచయము
గీ. "ప్రభువు విచ్చేసియున్నాఁడు వచ్చి మీరు
వాంఛితంబులు వడయుండు నరుస" నరుచుఁ
బరిజనులు చాటుచుండిరి ద్వారముకడఁ
గాని యొక్కండు నందునకైన రాఁడు. ౨౭

గీ. నిన్నఁటిదినంబు చందాన నేఁడుగూడ
దుర్దినం బొక్కొ? యొకరుండుఁ దోఁపఁడేల?
యాచకుం డని యొకిమీఁడు వ్యాకులింపఁ
జీఁకుమానిసి యొకఁడు విచ్చేసె నటకు. ౨౮

ఉ. కన్నులు గానరావు; సరిగా విసిపింపవు వీనులేనియుం
దిన్నఁగ నేల నూఁదుకొని నిల్వఁగఁజాలవు కాళ్లు; బిట్టువం
గెన్నదు; మెల్గ రాల్పడె నొగిన్; దడఁబాటుగ మాటలాడు నా
పన్నుఁ డతండు; లేరు భగవంతుఁడు దక్కఁ బరాయిచుట్టముల్.

ఆ. వె. చివికి చివికి చినిఁగి చెడుగ్రాలు గొట్టెడి
గుడ్డపాఁత యొక్క కుండబొచ్చె
పుచ్చియున్న వెదురుబొంగు చేఁబట్టియు
నతని యొద్ద నున్న యావదాస్తి. 30

ఉ. కాళులు తొట్రుపాటు వడఁగాఁ దల యూఁగ, నొడల్ వడంకఁగాఁ
దూలుచు సోలుచుం బుడమి ధూళిని బ్రుంగుచుఁ దట్టుకొంచుఁ జే
కోలను నేల నా కొలువుకూటము వాకిటి కేఁగుదెంచి పెన్
జాలినిఁ గొల్పుచుం గరమునం గొని మూఁకుటిచిప్ప నిట్లనున్. 31

క. జయ! జయ! యేలినవాఁడా!
జయ! జయ! మానోముపంట! జయ! జయ! సామీ!
జయ! జయ! పేదలపెన్నిధి!
జయ! జయ! మారాజుబిడ్డ! చల్లఁగ మనుమీ! 32

గీ. అనుచు దీవింప రాజభటాళి వచ్చి
"యయ్యా! ధనధాన్యకనకవస్త్రాదివస్తు
గణము తండోపతండంబు గలదు కాన
వలయునది యెల్లఁ గొంచక వచ్చి కొనుము." 33

క. అనఁగా విని యావృద్ధుం
డనఘా! యివియేల? వలవ దడిగిన దెల్లన్
వెనుకాడక యొసఁగెద వని
విని వచ్చితి గంపెఁడాస పెట్టుక యిటకున్. 34

మ. అని చేయెత్తి నమస్కరింప విని బ్రహ్మానందుఁడై రాజు "నన్
దనియింపం జనుదెంచె దైవ" మనుచున్ దాన్నై సమీపించి యా
తని "వేయేల? త్వదీప్సితం బడుగు మద్గాత్రంబు తొట్టెల్లయున్
అనుమానింపక యిత్తు నా బ్రదుకు ధన్యంబయ్యె" నం చాడినన్.

క. కౌతుకుచు నుండఁగఁ దెలుపక
బతిమాలం దొడఁగె నృపతి వార కతఁడు "నీ
ప్రతినం జెల్లింతే"యనఁ
బతి పిఱుదివియకయుఁ బెక్కుబాసలు వలికెన్. ౩౬

క. "నయనిధి! సర్వేంద్రియముల
నయనంబు ప్రధాన మండ్రు నా కది శూన్యం
బయినది ప్రాగ్జని పాప
క్రియాఫలము దాఁటఁ గలఁడె క్షితి నింద్రుండేన్. ౩౭

క. ఒకతల లాఁతిబెడందలు
ఒకతల యీగ్రుడ్డితన మయో! దేవర! మా
మకజీవితంబు పెనునా
రకమై నన్నలఁచు మేలు ప్రాణము వోవన్. ౩౮

క. పాతాళంబును జొచ్చిన
భాతిని గిరిగహ్వరమున వసియించు క్రియన్
బ్రాతిగ లోకాలోకము
నాతలఁ దిరుగాడు చున్న యట్లుంటిఁ బ్రభూ! ౩౯

ఉ. కావున నేల నాకుఁ గనకప్రముఖం బగు వస్తుజాత మో
ధీవర! నీ ప్రతిజ్ఞ వెనుదీయక చెల్లఁగఁ జేయఁ బూనియు
న్నావని నిశ్చయించి నయన మ్మొక టిమ్మని కోరుచుంటి వా
పోవుచు నేక నేత్రుఁ డయి పోవుదువే యనియుం గడుంగడున్. ౪౦

మ. అని యయ్యంధుఁడు పల్క జేఁడు గొని రోమాంచంబు నంగంబు లె
ల్లను నర్పింపఁ దలంచు నాకు నిది స్వల్పంబైన దానంబ యై
నను నే యాచకుకోర్కి కిబ్బడిగ దానం బిచ్చు మర్యాద నుం
టిని; గానం గొనుమయ్య! యిచ్చెదను మన్నేత్రద్వయం బాఁదటన్.

గీ. నేఁడు సుప్రాత మీ నాఁడు నిక్కమైన
పర్వ మీ ప్రొద్దు నాకు దివ్య మగు పుణ్య
దివసము, భవాదృశునకు నాతిథ్య మొసఁగు
భాగ్య మొదవుట నింకేమి వలయు నాకు ? ౪౨

చ. అని తన కన్నులం బెఱికి యంధుని బొత్తల నుంచు మంచు వై
ద్యుని నొడువంగఁ జెంత సచివోత్తము లా ప్రభు సాహసోక్తులన్
విని యిది యేటిదానము? వివేకివి! కన్నులు లేనివారిటుల్
కనులకు నేడ్వ నీవు వెఱుకం దలపెట్టితె యున్న కన్నులన్. ౪౩

క. తమ కేడుగడయు సఖుఁడును
దమ ముప్పున కాఁడుకొనెడు ధర్మప్రభువున్
దమ పెన్నిధానమును స
త్యముగా నని నిన్నుఁ దలఁచు ప్రజ యెట్లు మనున్ ? ౪౪

క. మడులో ? మాన్యములో ? కడు
విడిముడియో? చెల్లు దానవిధి; కదియైనం
గడిఁది సుతి మీఱరా దె
ప్పుడునుం దనుమాలు ధర్మమునఁ గీడొదవున్. ౪౫

ఉ. ఈతఁడు బిచ్చగాఁ డగునయేని ధనంబులుఁ దొట్టి వస్తుసం
ఘాతముఁ గోర కిప్పగిదిఁ గంటినిఁ గోరునొకో ? విచారముల్
లోఁతుగఁ జేయవైతివి; ఖలుల్ ప్రొనరించిన వంచనంబొ ? యు
ర్వీతలనాథ ! దైవమె పరీక్ష యొనర్పఁగ వేస మూనెనో ? ౪౬

గీ. కాఁటికెనిఁ జాఁచుకొని కాళ్లు కాలమునకు
నెదురు సూచుచు నున్న యీ ముదుకవాని
కెట్టి లాభంబు సిద్ధించు నిట్టి కోర్కెఁ
గాన మా మాట నిది మాను కనికరించి. ౪౭

క. అని మందలింప మెల్లన
విని మేలిక లేఁతనవ్వు విరియఁగ మొగమం
దున ననుఁ "బ్రతిశ్రుతార్థము
జనుఁ డొసఁగమి నరకమునకుఁ జను నండ్రు బుధుల్. ౪౮

క. పరు లర్థించిన దీయక
కొఱగాని దొసంగు దాతకు ఫలం బున్నే?
ధరణిం బ్రతిగ్రహీతయుఁ
బరలాభము దాన దాత వలెఁ బొంద నగున్. ౪౯

మ. అదియుం గా కిల నెండుటాకు వలె దేహం బెన్నఁడో రాలు; సం
పదలుం గ్రొమ్మెఱుఁగుల్ వలెం జపలముల్ భార్యాసుతాదుల్ తనుం
గదియం జాలరు ధర్మ మొక్కఁడె సుఁడీ! కల్యాణసంధాయకం
బదె సంసారమహాబ్ధిమగ్నులకు సాయం బిచ్చుఁబో! నావనాన్. ౫౦

క. స్వయముగ నరపతి ధర్మ
క్రియాకలాపంబు లాచరింపని యెడ నె
మ్మెయిఁ జేయు లాఁతిజన మో
జ "యథా రాజా తథా ప్రజా" యన వినరే? ౫౧

క. శ్రుతులును స్మృతులును ధర్మము
స్తుతి సేయును బహువిధములఁ; దొల్లిట శిబిభూ
పతిముఖ్యులు 'ధర్మో ర
క్షతి' 'ధర్మం చర' యటన్న చదువుఁ జదువరే? ౫౨

ఉ. దైవమె యీతఁ డైనఁ గడు ధన్యతముండను జీవకోటిలో;
క్ష్మావలయంబు నం దొకఁడు శాత్రవు పేరిటి వాఁడు నాకు ను
న్నే? వెనుదీయ నీయ నొడలేనియు మా శిబివంశకీర్తి ను
ర్వీవలయంబునన్ నిలువఁ బెట్టని నన్ను సురల్ శపింపరే? ౫౩

క. వెన్నెముక నిచ్చె నొకముని
మన్నీఁ డొకఁ డిచ్చె నొడలి మాంసంబెల్లన్
గన్నిచ్చుట ఘనకార్యమె?
యెన్నఁగ; నేకాంశమైన నేఁ జాలుదునే? ౫౪

ఉ. కాన ననుగ్రహించి ననుఁ గాదని యడ్డక నా యొనర్చు నీ
దానము సేయ నిచ్చి సుకృతంబును గట్టుకొనుం; డితండు జా
గ్గైన గ్రహింప కేగెడినో? యాత్మఁగలంగుచు; నేఁడు నిన్నచం
దాస సపుణ్యవర్తన మనన్ వలెనో గద ! డెప్పరంబుగన్. ౫౫

క. అని పలికి వెజ్జుచేఁ దన
కనుఁగవఁ దీయించి బిచ్చగాఁ డొక్కటి చా
లున యన్నను నదికించెను
దన కేల్గవ పులకరింపఁ దద్వదనమునన్. ౫౬

క. పెఱుకుచు నుండఁ గనుల్ చూ
పఱు సైఁపక కడిఁది బాధపడ నా లోకో
త్తరచారిత్రుఁడు సమ్మద
భరితాంతఃకరణుఁ డగుచు స్వస్థత నిలిచెఁ. ౫౭

ఆ. వె. పుడికి పుచ్చుకొన్న వడువున స్వర్గంబుఁ
బిడికిలించి నట్లు విశ్వసుఖముఁ
బురులు గట్టినట్లు పుణ్యసర్వస్వంబు
క్షితివరుండు సంతసిల్లు చుండె. ౫౮

చ. ముదుకఁడు మెచ్చుచుండె మదిని భూవరచంద్రు నఖండదానసం
పదఁ గురియించుచుండె జలముఁ బ్రావృషికాంబుద మట్లు దీవనల్,
పదఁపడి మ్రొక్కి యాజ్ఞఁగొని వచ్చినదారినిఁ బట్టి పోయె బె
ట్టిద మగు కింకతో మొరకటించి మొగంబులు సూడఁ జూపఱుల్.

క. అలవోక వచ్చె నల మా
తలిచోదిత మగు మహారథంబున వేగ
న్నలదార వేలుపుఁ బూమా
లల వలపు గుబుల్కొనం గెలంకుల నటకున్. ౬౦

ఆ. వె. వారిదంబు లేని వర్షంబు వడువునఁ
బూవులేని కమ్మతావిపోలెఁ
జూలు లేక కలుగు సుతునిచందంబున
వేల్పుతేని రాక వింతగొలిపె. ౬౧

చ. ముకుళితహస్తులై సచివముఖ్యజనుల్ నిలుచుండ భూమిపా
లకమణి యా హళాహళికలన్ విని తత్ప్రతిబోధనంబులన్
మొక మటు త్రిప్పి బత్తిమెయి మ్రొగ్గతిలం బడి తత్పదాబ్జయు
గ్మకమును సమ్మదాశ్రువులఁ గడ్గి పొనర్చె నెడందఁ బూజయున్.

చ. సురపతి లేవనెత్తి శిరసున్ స్పృశియించుచు రాజ! నీమహా
త్తర మగు త్యాగబుద్ధికి ముదంబు వహించితి సర్వథా శిబీ
శ్వరకులధర్మమున్ నిలిపి శాశ్వతకీర్తి వహించినా విదో
వరమును గోరు మిత్తు నన వాంచి తలన్ నతులన్ నృపుం డనున్.

చ. కృతయుగమందుఁ బోలె సుసమృద్ధిగ దున్నక పండుచుండె సా
రతఁ గొని రత్నగర్భ; యమృతంబు లొసంగుచు నుండె నంబుద
ప్రతతి; నిరీతులై ప్రజలు బాసలు సేతురు నాకుఁ బుణ్యస
మ్మతపథగాములై కొరఁతమాలి సుఖించెడుఁ దిర్యగాదులున్. ౬౪

ఆ. వె. ఆగజాంతమైన యైశ్వర్య మున్నది;
కలను నేని నాకు వెలితి లేదు
భవదనుగ్రహమున; వర మేమి వాంఛింతు?
నయినఁ జేతు నొక్క ప్రార్థనంబు. ౬౫

ఆ. వె. ముదితయాచకాళి ముఖవికాసపుఁ గాన్పు
లోఁచనములు లేమి లుప్తమయ్యె
బ్రిదుకఁజాల నయ్య! యది వెలిగా దేవ!
కాన మరణ మిమ్ము! కనికరించి. ౬౬

చ. అని వచియింప సవ్వి యమరాధిపుఁ డిట్లను "నిట్లు వెట్టిదం
బున నినుఁ బ్రాణముల్ కోఁటుకు ముక్కడు లర్థులు కారె? వారిపై
గనికర మేల యిప్పటికి? క్ష్మావర! నావుడు ఱేఁడు వల్కె నో
యనఘ! మదీయజీవితము కన్నఁ బ్రియుం డగు నర్థి యెట్టిఁడుర్.

ఉ. యాచకుఁ జూడరామి హృదయంబునఁ బొక్కుచు రేబవల్ మహా
నీచపు జీవయాత్రఁ బయనించుచుఁ బెక్ యమబాధఁ బొందుచుర్
గాచిన మజ్డనర్ మునుఁగు నాయమునర్ మనుకన్న స్వర్పతీ!
తోఁచు మృతించు టర్హ్మమని; దుఃఖహరౌషధ మన్య మున్న దే! ౬౮

క. ఆ మాటకు వాసవుఁ డ
త్యామోదాయత్తచిత్తుఁడై యిట్లను నో
భూమిప! యాచించియు ని
న్నామెయిఁ బీడించి నట్టి యంధుఁడ నేనే. ౬౯

మ. నను మన్నింపుము! తావకం బగు వదాన్యత్వంబు దర్శింప వ
చ్చినవాఁడం గొనుమా! త్వదీయ మగు నక్షిద్వంద్వ మంచుర్ స్పృశిం
చెను భూకాంతుముఖారవిందమును; విచ్చెర్ రేకులో నాఁగ నా
తని కన్నుల్; పడెఁ బూలవాన; కొనె నంతర్ధాన మింద్రుం డాగెర్. ౭౦

# విశ్వంతరజాతకము

గీ. మున్నొకప్పుడు విశ్వ విద్వన్నుతుండు
విక్రమకళాపరిపూర్ణుండు వీర్యఘనుఁడు
క్షాత్త్రవరోత్తంసుఁడై తగు సంజయునకుఁ
బుత్త్రకుం డయి బోధిసత్త్వుండు పుట్టె. ౧

క. పుత్త్రోత్సవంబుఁ బంచెను
ధాత్రీనాథుండు; సమ్మదంబునఁ బ్రకృతుల్
నేత్రోత్సవం బొనర్చుచుఁ
జిత్రముగ వసంత మందుఁ జెరలాడిరున్నన్. ౨

క. పలువురు పోవుటఁ గొమరుఁడు
గలిగినఁ జేయఁగయు నామకరణం బెకిమీఁ
డిల బ్రదుకె భాగ్య మనుచుం
దలఁచుచు విశ్వంతరాభిధం బిల్చెఁమదిన్. ౩

క. ధరఁ బూజ్యుఁ డనంగ నిర
తురకుక్షి యటన్న కరణి జనములు విశ్వం
తరుఁ డన నవివేకి యటం
చరుదారఁగ వ్యవహరింతు రక్కాలమునన్. ౪

గీ. ఇల హరిశ్చంద్రుఁ డను పేరఁ బొలుచు జనుఁడు
పెద్ద కల్లరి గావచ్చుఁ; బిచ్చి పేరి
నరుఁడు గావచ్చు విద్వాంసుఁ; డరయఁ గలవె
సార్థతానర్థతలు పూరుషాళి పేళ్ళ. ౫

క. పంచప్రాణంబులఁ జేరి
మించుచుఁ దలి దండ్రు లతని మేకొని నేలన్
డించక పువ్వుం బోలె స
మంచిత గతిఁ దాల్త్రు శిరసునందె సతంబున్. ౬

సీ. భావించు వరవడి వ్రాయంగఁ దాత తం
డ్రులయు నవ్వారి పూర్వులయుఁ గీర్తిఁ
బఠియించును వదాన్యవరులైన శిబి దధీ
చ్యాది పూజ్యుల దివ్యమైన కథలు
స్థాపింపఁ దలపెట్టు దానంపు లక్ష్మి ప్రా
సాద నిర్మితికిఁ బునాదిరాయి
అనుకరింపంగఁ బ్రియత్నించు చుండు స్వా
ర్థత్యాగు లగు ధరారమణమణుల
గీ. వామి వేయంగ సద్గుణవర్గ మెంచు
గాదెలం బోయఁ బుణ్యంబుఁ గడఁగుచుండుఁ
బాఁతటికిఁ గొల్వ యశము భావమునఁ బూను
బాల్యమున రాసుతుండు విశ్వాంతరుండు. ౭

ఆ. వె. మొలకలైన లోని తలఁపులు మెలమెల్ల
నవలు గొనలు వేసికొనుచుఁ బెరిగి
మ్రానుగట్టఁ దొడఁగె మహికాంతుసూనుండు
దినదినాభివృద్ధిఁ గనుచు నుండ. ౮

ఉ. చందురమామలోని రుచిజాలమునందలి తీఁపి, మల్లికా
బృందములోని స్వచ్ఛత, శిరీషములోని మృదుత్వ సంపదల్,
చందనచర్చనస్థమగు శైత్యముఁ జేరిచి రాకుమారు నా
డెందము సేఁతలున్ నుడులు డెప్పర మొప్పఁగ నల్వ చేసెఁబో ! ౯

సీ. కట్టియున్నాఁ డాత్మకరపంకజంబునఁ
గానంబడని దానకంకణంబు
నిర్మించి యున్నాఁడు నేల నల్చెఱఁగులఁ
బాత్రుల కయి ధర్మసత్రములను
వహియించి యున్నాఁడు ప్రత్యహం బాసక్తి
నఖిల దీనోద్ధారయజ్ఞదీక్ష
గ్రహియించి యున్నాఁడు కమనీయ రమణీయ
మగు కీర్తికన్యాకరాంబుజంబు

గీ. ప్రజలు మే లన బంధుగుల్ వహ్వా యనఁగ
బళిబళీ యని మెచ్చంగఁ జెలిమికాండ్రు
చిన్నయయ్యును సద్గుణశ్రీకుఁ డగుటఁ
బెద్దయై జవ్వనంబున వెలిఁగె నతఁడు. ౧౦

క. తలఁచుచుఁ జుట్టంబులుగాఁ
జెలికాండ్రుగ దైవములుగ క్షితిపతితనయుం
డల మందిరాగతాభ్య
ర్థుల సంతసపఱచు నీవిఁ బ్రొద్దులు మూఁటన్. ౧౧

మ. వలువల్ దాల్చుచు దక్షిణల్ వడయుచున్ భక్ష్య ప్రపూర్ణాన్న మా
గళ మాప్యాయిత నారగించి వికలాంగశ్రేణి నిత్యంబుఁ దేఁ
పులనుం దేన్చుచు నాశిషంబుల నిడుం బుంఖానుపుంఖంబుగాఁ
గలుగన్ శ్రీయుఁ జిరాయురున్నతియు సత్కల్యాణసంపత్తియున్.

గీ. తనయుఁడై రామచంద్రుండు దశరథునకుఁ
గొమరుఁడై ధర్మజుఁడు పాండుకులపతికి
సంజయమహీశ్వరునకు విశ్వంతరుండు
పుత్రుఁడై పేరు నిలిపె నీ భూతలమున. ౧౩

క. తన జన్మదినోత్సవమున
మనుజేశ్వరసుతుఁడు దివ్యమంగళభూషా
తనుఁడై పట్టపుఁ టేనుం
గును నెక్కి పురంబు వెడలెఁ గొలువ మెఱవడుల్. ౧౪

క. కొనుచుం గానుకలు నీరా
జనములు మ్రొక్కులును వందిజనముల స్తోత్రం
బును సాహోనాదంబులు
జనసంకులమైన నగర సరణిం జనియెన్. ౧౫

క. చని దానపుఁ జావడికడఁ
దన పట్టపుటేన్గు డిగ్గి తనకై యమరిం
చిన రత్నకంబళంబున
జనపతిసూనుం డొగిన్ నిషణ్ణుం డయ్యెన్. ౧౬

సీ. అందదుకులపాఁత నలికించి మేన న
గ్నపాత్రియమై బిచ్చకత్తె యొకతె
యెడనెడఁ దూలుచుఁ బుడమి మెల్లఁగ నీఁచ
కా ళీడ్చు చొక మూఁడుకాళ్లముసలి
దినదిన మేకాదశినిఁ జేసి శోషిల్లి
నడపీనుఁగైన మానవుఁ డొకండు
కాలుసేతులులేమిఁ గావడిమూటమై
మోయంగఁ బడుచున్న పురుషుఁ డొకఁడు

గీ. మూఁకుటిం గొని యొకరుండు, ముంతఁబట్టి
యొకఁడు, చిల్లిచిప్పను బూని యొండుఁ జనిరి
క్ష్మావరేంద్రుని సుతు దానమంటపమున
కెలమిఁ బూఁదోఁట కేగు తేఁటులను బోలి. ౧౭

చ. వలసిన యెల్లవస్తువుల వారల కిచ్చి ముదంబుఁ గూర్చి శా
ట్రిలకుఁడు పంప, నొక్క క్షితిదేవకుమారుఁడు వచ్చి యక్షతల్
ఫలము లొసంగి దీవనములం బొనరింపఁగ వేదమంత్రవా
క్కులఁ బరితుష్టుఁడై ప్రభువు గొబ్బున వానికి మోఁకఱిల్లుచున్.

గీ. "మూర్తిఁ గైకొన్న విజ్ఞాన భూతి యనఁగ
నాకృతి వహించియున్న బ్రాహ్మణుం బనంగఁ
దనరు నీరాక నాయిల్లు ధన్యమయ్యె
భవదభీష్టంబుఁ దెలుపుము తవిలి తీర్తు." ౧౯

క. అని విన్నవింప బ్రాహ్మణుఁ
డను "నెఱదాతవు నృపాల! యడిగిన దెల్లన్
వెనుదీయ కిత్తు వను చెద
జనియింపఁ గుతూహలంబు సనుదెంచితిఁ జూ!" ౨౦

ఉ. నావుడు నిన్ను బోటి సుమనస్కుని కిచ్చుటఁ జేసి కాదె నా
జీవిత మర్థవంతమగు; జెప్పఁగఁ దొట్రుపా టదేల? నా
భూవరచంద్రుఁ; డి ట్లడిగె భూసురపుత్రుఁడు సందు సూచి యో
"క్ష్మావర! నీదు పట్టపుగజంబు నొసంగి యనుగ్రహింపవే!" ౨౧

క. అనుటయె తడవుగ నరవర
తనయుఁడు దన పట్టపేన్గు దానం బీయం
గను బూన మంత్రిముఖ్యులు
"జనపతి! యీ దాన సాహస మనుచితమగున్. ౨౨

సీ. మాళవనాథుండు మటుమాయమై పోయెఁ
బికపికలైన సైనికులతోడ
నంగాధిపతి పలాయనమంత్రము పఠించె
సకుటుంబముగ వింధ్యశైలమునకు

నుత్కలపతి ప్రడీనోడ్డీనసండీన
గతులభేదంబులఁ గఱవఁ దొడఁగెఁ
గేరళాధీశుండు కేల జారఁగఁ గత్తి
ముచ్చెమ్మటలు వోసి మూర్ఛవోయె
గీ. పరఁగ నీ పట్టపేనుంగుపైని నెక్కి
సమరయాత్రకు నడవ మీ జనకుఁడైన
సంజయుం డిది జయరమాశ్రయము ధరణి
నాథ ! విడవకు తాతలనాఁటి దీని. ౨౩

చ. ఇది శుభలక్షణాఢ్య మగు నేన్గు సుమీ! తెకతెంపులేని సం
పద లిది వేలుపుందొడుకుభాతి నొసంగును; దీన నెట్టి బె
ట్టిదములు రాజ్యలక్ష్మికి ఘటిల్లవు; ధర్మపథావలంబముల్
వదలక యుంద్రు పండుగులపైఁ దగఁ బండుగు లెల్లరుం బ్రజల్.

క. రతనంబు రాతివలె, దే
వతాప్రతిమ మట్టిబొమ్మవలెఁ ద్రోయకుమీ
మతిఁ దలఁచి; కలిమిచెలువను
బ్రతిరోధింపకుము మూసి ద్వారం బధిపా! ౨౪

క. విజితారిబృంద మీ య
క్కజమగు గజ మపహరింపఁగాఁ దలఁచి మొదన్
నిజ మీ కుట్రను బన్నిరి
గజ మేటికి బ్రాహ్మణునకుఁ గాకున్నఁ బ్రభూ! ౨౫

క. పిచ్చెత్తింపఁగఁ బూనిరి;
చచ్చుటకై యిడిరి మందు శాత్రవతతి; మే
మెచ్చరికపడి ప్రతిక్రియఁ
జెచ్చెరఁ గావింపకున్నఁ జెడియుందుము మున్. ౨౬

గీ. మహిని నీ దానలక్ష్మికి మాన్యమైన
వారణమె విశ్వసింపుము కారణ మని
యమరవృక్షంబు నణఁకకు మయ్య! తలఁపు
మానికంబును జిదికింపఁ బూనకయ్య. ౨౮

క. ఒక్కనికి దీని నిచ్చినఁ
దక్కినవారల గతేమి? తలఁపవు రాజా!
పెక్కండ్రు కడుపుఁ గాలుచుఁ
బొక్కఁగ నుచితంబె? యొకనిఁ బోషింపంగన్." ౨౯

క. అని యూఁది దంతిదానం
బు నిషేధింపఁగ నమాత్యముఖ్యులు జనరా
ట్తనయుండు నవ్వుకొని తన
మనమునఁ బ్రత్యుత్తరించె మాహాత్మ్యమునన్. 30

శా. ఈ దంతావళ ముత్తమోత్తమముగా నీరల్ ప్రశంసించిన
న్నీ దానంబును మానుమం చనెద రానే యిద్ది? సర్వోత్తమం
బై దీపించెడు వస్తుదానమునఁ గాదా? పుణ్యమా నంచు శా
స్త్రాదుల్ ఘోషిలుచుండఁ గక్కుఱితి సేయం జెల్లునే యిమ్మెయిన్?

క. అని పలికి సచివులను వా
రణ దాన మొనర్చెఁ బ్రభువు బ్రాహ్మణునకు వ
ద్దని చేయి పట్టుకొన్నను;
నని రత్తఱి "హా హతాః స్మ" యని కలఁగి ప్రజల్. 3౨

మ. ప్రకృతుల్ క్షోభము వొంది సంజయ మహీపాలాగ్రణిన్ డాసి "పు
త్త్రకు దానవ్యసనంబు మాన్పుమని నిన్ బ్రార్థించినన్ మాదు మా
టకు రవ్వంతయు లక్ష్యపెట్టమి నిరాటంకంబుగా నేఁ డన
ర్ఘకముల్ పై పడుచుండె ద్వారము సముద్ఘాటించిన ట్లుగ్రతన్. 33

సీ. ఇగిరిపోయెను నీళ్ళు లెండలు మెండయి
కాసారములను జుక్కయును లేక
అప్రతీకారంబులైన తెగుళ్లచేఁ
బంటలు మొదలంట మంటఁ గలిసె
మారి మసంగిన మాద్రిఁ గార్మికములు
వెలవృట్ట నూళ్లపై కుటుకు చుండె
నేల యీనినరీతి నెగడి తెక్కలికాండ్రు
ప్రజలఁ బీడింతురు బాహిరముగ
గీ. ధైర్యకవచంబుఁ దొడిగి శాత్రవనృపాళి
బద్ధ పరికరబంధులై యుద్ధములకుఁ
గత్తి నూఱుచు నున్నారు క్ష్మావరేంద్ర!
శాంత మగు వారినిధిఁ బ్రభంజనము రేఁగె. ౩౪

క. మన పట్టపుటేనుఁగు నీ
తనయుఁడు దానం బొనర్చె దానఫలము మి
మ్మును మమ్ముఁ గుడుపఁ దొడఁగెను
జనవర! మే మెచటి కేనిఁ జనియెద మింకన్. ౩౫

క. త్యజియింపుము నీపుత్రుని
గజమును రప్పింపఁ జూడు క్రమ్మఱ నీ యా
త్మజు వెడలింపనియెడలను
నిజమిదె! వందనము నీకు నీ కొల్వునకున్." ౩౬

గీ. అని యేకగ్రీవంబుగ
జనములు శతియించి నడవ జతన మొనర్పన్
జనపాలాగ్రిణి చింతిలి
యనువయు వాక్యముల నిట్టు లనె వారలకున్. ౩౭

చ. తనయులఁ గన్న వారలు గదా! తమ రందఱు తప్పొనర్చినన్
జనకుఁడు పుత్రు వెల్వఱచు చందముఁ గంటిరె? సైఁచుగాని నా
తనయుఁడు పుణ్యుఁ; డెల్ల బెడఁదల్ తొలఁగింతును నేన వచ్చి యీ
క్షణమున; నేకపుత్రికుఁడఁ గావున నన్ను ననుగ్రహింపుఁడీ! ౩౮

క. అనినను మూర్ఛించిన యా
జనములు దయమాలి యాత్మజాతుని విడు మం
చును గడు బలాత్కరించిరి
జనపతిఁ; బామరులు వట్టి చలమరులు గదా! ౩౯

క. ప్రకృతిక్షోభ మొకటఁ బు
త్త్రక మోహం బొకట మనసుఁ ద్రిచ్చఁగ క్షితిపా
లకుఁడు వచింపఁడు మూఢా
త్మకుఁడై 'యిదమిత్థ' మని సమాధానంబున్. ౪౦

క. విని కర్ణాకర్ణిగ న
జ్జనపతిసూనుండు ప్రకృతిజన శాసనముం
దన తండ్రికార్యమూఢత
మనమునఁ దలఁకకయ లేశమాత్రముఁ దలఁచెన్. ౪౧

శా. పుత్రస్నేహము వీడి కానలకు "నన్ బొ"మ్మంచు భాషించునే?
గోత్రానాథుఁడు; కాక యెవ్విధని మూర్ఖుల్ లోకు లాపోదు? రీ
గాత్రం బాదిగ నెల్ల దానమిడ సంకల్పించు నాకేల యీ
ధాత్రీరాజ్యము? నీ తురంగభటమాత్రంగాదు లీ తేరులున్? ౪౨

ఉ. కోరిన మేర కీవి యిడఁ గూడును గాని స్వలాభ సంపదం
గూరిచి చింతసేసి కొని కోవిదు డిచ్చునె? ధర్మవౌనె? యీ
తీరున నున్న మూఢవితతిం బరిపాలనముం బొనర్పఁగా
నోరువ; రద్దొనర్చిన నిజోక్తిని, గ్రమ్మఱ వచ్చివేఁడినన్. ౪౩

క. కుడి యెడమ భేద మెఱుఁగని
జడమతు లయిరేల నా ప్రజాసంతతి యి
వ్విడువున ? వీరలు ప్రాజ్ఞత
వడయఁగ నేనయి చరింతు వనమునఁ దపముఁ. ౪౪

క. క్షితి నేకక్రియ కార్య
ద్వితయమును ఫలించు నట్లు తిరముగ నీ నా
దు తపంబు ప్రకృతి శాంతికిఁ
దత ప్రజామూర్ఖతావదానమున కగుఁ. ౪౫

చ. అని యెద నిశ్చయించుకొని యాదర మొప్పఁగ ధర్మపత్నినిం
గనుఁగొన రాణివాసమునకై చని దానముఁ దొట్టి లోక శా
సన పితృసంకట స్థితులు శాంతముగా వినిపించి యెల్లి ప్రొ
ద్దునఁ బయనింతుఁ గానలకుఁ దోయరుహానన! తెల్ప వచ్చితిఁ.౪౬

చ. అడిగిన లేదు నాక యధికాధికదానములం బొనర్చు నీ
కడఁ గల పట్టుఁబుట్టములుఁ గాంచనభూషణ సంచయంబు; నో
పడఁతుక! యుత్తమామల సపర్య మెలంగుము జాగరూకవై
బుడుతల సేమ మారయుచుఁ బుణ్యపథంబునఁ బొమ్ము! నిచ్చలున్

సీ. అన్వర్థనాముల నాచరింపఁగఁ జూడు
శిబి దధీ చ్యాహ్వాయ శిశు యుగంబు
మన కన్నబిడ్డల మాదిరిఁ బ్రేమింపుము
సకల దాసీ దాస సంచయంబు
ఆనంద పడుచు సమర్పింపు కోదుకక
యన్యోపకారార్థ మంగకంబు
ఆగ్రహింపకయు మర్యాద నీక్షింపుము
నను రాష్ట్రము వెలార్చు జనచయంబు

గీ. వ్రతము లొనరింపుమీ! యీతిబాధ లడఁగి
సర్వ జనములు సుఖియింప సంతతంబు
పుట్టి మెట్టిన యిండ్ల కపూర్వశోభఁ
దెమ్మ! యిదె పోయివత్తు సాధ్వీలలామ! ౪౮

క. అని పాపల చెక్కిళ్లను
దనియఁగ ముద్దాడి వెడలఁ దలఁచెడు భర్తం
గనుఁగొని నయ భయ భక్తులు
మనమున ముప్పిరి గొనంగ మానిని వలికెన్. ౪౯

ఆ. వె. వెంబడించుఁగాదె! వెన్నెల జాబిల్లిఁ;
బరగు మెఱుఁగుదీఁగ వారిధరముః;
బువ్వుఁ దొడిమె; గంధము సరోరుహంబును
నిన్ను విడువ నాకుఁ జన్నె నాథ! ౫౦

చ. నిలువను జీడపుర్వ నయి నీ వ్రతప ప్తివినాశకంబుగన్;
మెలఁగఁ బ్రకంపనం బగుచు నీదు ప్రశాంత మనోవనంబునన్;
గలఁపను మంథశైల మనఁగా భవదీయ తపస్సముద్రమున్;
గొలుతును నీదుపాదము లకుంఠిత భక్తిని శిష్యురాలనై. ౫౧

సీ. అలికి ముగ్గులు దీర్చి యద్దంబువలెఁ జేతుఁ
బ్రాఙ్ణంబు నందు నాశ్రమతలంబుఁ
గొనివత్తు వనమందుఁ గ్రుమ్మరి జల ఫల
పుష్పంబులను గందమూలములను
బదిలపర్చుచు నుందు నుదికి నిర్మలముగా
బొంత గంతలఁ గావిపుట్టములను
వర్తింతు నౌషధప్రాయనై వహియింప
నొడలు తపంబున బడలికలను

గీ. నీడనై యెల్ల వెంటల నిలుతు నీకుఁ
గనుచు నీ దివ్యమంగళాననశశాంకు
హృదయ శోకాంధకారంబు చెదరి పోవ
వత్తుఁ బ్రాణేశ! నే నిన్నుఁ బాయఁ జాల. ౫౨

క. నీ చరణసేవ యెడపడ
దోఁచును సురలోక మేని దుర్నరకముగా;
శోచిష్కేశుఁడు చల్లఁగఁ
దోఁచును నీకడ వసింపఁ దొలఁగక నాథా! ౫౩

చ. అని పరవుళ్ళఁ బిల్చి కనకాభరణాదులఁ దీసి పంచి యె
ల్లను ధరియించి వల్కలములన్, మొగ మందలి బొట్టు వేయిభూ
షణముల పెట్టుగాఁ, జరణసారస భాస్వదలక్తకం బొగిం
దన యసమానపుణ్యవనితాత్వము చాటఁగ, నిల్చె ముంగటన్. ౫౪

చ. వల దనఁ జాలకా నృపుఁడు దైన్యసపన్నహాసంబుతోఁ బుర
స్థలమున నిల్చియున్న తన సాధ్విని మేకొని యెట్టకేని, "వ్యా
కులపడు బొట్టు నాదు జనకుండు సమగ్రము నా యుదంతముం
దెలుపఁగఁ జేయు విఘ్నముఁ దుదిం బ్రకృతిష్ఠుఁడు గామిఁ గీడగున్.

క. కావున నా పితృపాదుల
శ్రీనర పాదముల కెరఁగి దృఢమగు భక్తిన్
భావమున, సెలవుఁ గొందును
దైవము గాకతఁడు వట్టి తండ్రియె నాకున్?" ౫౬

గీ. తలఁచి యీగతి నగ్ధరాశ్రమునఁ దమ్ముఁ
బ్రకృతిస్థైనను గనక నిద్రాసమాధి
మగ్న మయియుండ, విపిన సీమమున కరిగె
నతఁడు సకుటుంబముగ నెక్కి యరదమందు. ౫౭

మ. మఱునాఁ డెప్పటియట్ల పొ్రద్దుటఁ బ్రణామం బాచరింపంగ ద
గ్గఱకుం బుత్రుని రాని కారణ మెఱుంగం గోరి పంపంగఁ గిం
కరు లెచ్చో యువరాజు, రాణి, శిశువుల్ కాన్పింపమిం జూచి తె
ల్పిరి; తత్సేవకు వల్ల విన్న కథయున్ విన్పించి రా పిమ్మటన్. ౫౮

క. పిడుగడచిన వడువున న
య్యొడయఁడు మూర్ఛిల్లి పెద్దయుం గాలం బా
కొడుకున కేడ్చుచు మంచపుఁ
దొడుగఱమై కడిఁదిఁ గ్రుస్సి దుస్సియు నుండెన్. ౫౯

క. "తరిఁ దొ్రక్కి యున్న నన్నుం
బరికింపక యొక్కపలుకుఁ బలుకక చనితే?
గురుభక్తి వదలి" యనుచుం
బరిపరివిధముల రుదించు స్వప్నములందున్. ౬౦

క. "బ్రతుకక బ్రతుకక యొక్కఁడు
బ్రతుక సుతుం డతఁడె నాకు రక్షకుఁ డనుచున్
మతి నమ్మినాఁడ నేత
ద్గతి దేశత్యాగి యయ్యెఁగా!" యని పొగులున్. ౬౧

క. "క్షితి 'ధర్మో రక్షతి ర
క్షిత' యను సభియుక్తి విశ్వసింపుమి! యా దే
వత లె త్వదీయుల మం" త్రని
హితపండితు లూఱడించి రి త్తఱిఁ జేసిన్. ౬౨

మ. సకుటుంబంబుగఁ దద్వనిన్ నవ నవ క్ష్మాజాతముల్ నూత్న వ
ల్లికలున్ నవ్యమనోజ్ఞపుష్పవితతుల్ వీక్షించుచున్ నిర్ఝరో
దకముల్ పక్వఫలంబులుం దమకు క్షుద్బాధ న్నివారింప భూ
పకుమారుండు రథాధిరూఢుఁ డయి పోవం బోవఁగా నచ్చటన్ ౬౩

క. ఒక్కఁడఁ బాఱుఁడు పురపురఁ
బొక్కుచు వెంటాడు దార పుత్రుల తోడన్
ఒక్కం డెదురై రాసుతు
చక్కటి కేతెంచి పలికె 'శరణం' బనుచున్. ౬౪

క. "శరణార్థి కభయ మిచ్చితి
శరీరముం దొట్టి నాదు సర్వం బిదిగో!
వెఱవకు మర్పింతున" యన
ధరావరుఁడు, జన్నిగట్టు తగ నిట్లనియెన్. ౬౫

క. మా పాలి భాగ్యదేవత
నీపేరిట వచ్చెఁగాక నిర్జనమయి యీ
శ్వాపద బహుళం బగు వని
కే పురుషుం డేని వచ్చునే తలపోయన్! ౬౬

ఉ. "దేవర! యాత్రకై బయలు దేఱితిఁ దోడ్కొని యాలు బిడ్డలన్
బోవుచు నుండ నీ విపిన భూమినిఁ గేసర గర్జనంబు భీ
త్యావహమై వినం బడఁగఁ ద్రాళ్ళను ద్రెంచుక మా రథాశ్వముల్
చేవఁ దొలంగి పర్వెడె; వచించెడి దేమిఁక మాదు దుర్గతిన్. ౬౭

చ. వెదకితిఁ గాన నెల్లఁ గనిపింపవ యెయ్యెడఁ దేరి వార్వముల్
గొదగొని మూఁడు నాళ్ళ గొలెఁ గూటికి నీటికి వాచి యుందు నం
గదఁ బడుచున్న వారలము గావున నిమ్మ! భవత్తురంగముల్
పదిలముగాఁ దరింపఁగల వారల మివ్వని నీకుఁ బుణ్యమౌ." ౬౮

క. అనుచుం బ్రార్థింపఁగ నా
జనవరసుతుఁ డాడి తప్ప జాల్మఁడు గామిఁ
దన గతినిఁ జూచుకొనకయుఁ
బలిచెం బాపని కొసంగి వారువము లొగిన్. ౬౯

గీ. ఆలు బిడ్డలు గలరు; కారడవి వలదె;
తనకు వలె జేని? కనుకోక కొనియె వారల
పరసుఖవిచార మొందునే స్వార్థపరుఁడు?
కత్తిఁ దాల్పని సూనరి కాఁడె యతఁడు? ౨౦

క. తన బ్రదిమి కొఱకు నన్యుల
తనుమాంసం బొలువఁ దలఁచుఁ; దనమాంసం బీ
యను దలఁచు బరుల బ్రదిమికి
ననయము భువిఁ బుణ్యజనుల స్వార్థపరార్థుల్. ౨౧

క. తురగములఁ బన్ని బ్రాహ్మణుఁ
డరదమునకుఁ బిల్ల జెల్ల లందఱు నెక్కన్
అరనిముసంబున దాఁటెను
మరలింపక దృష్టి నేని మహినాథు దెసన్. ౨౨

ఉ. అంతటఁ దేరు డిగ్గి హృదయంబునఁ గొందల మొందఁ బోక వి
శ్వంతరుఁడుం గళత్రమును స్యందన మీడ్చుచు మెల్లఁగా నర
ణ్యాంతర సీమఁ గంటకమయంబు శిలామయమైన బాట న
త్యంతముఁ బాదముల్ రుధిర ధారలఁ గ్రక్కఁగ నేఁగుచుండఁగన్.

క. అరుదెంచి బాడబులు నలు
వురు తేరిని లాగువారిఁ బొడఁగని మోదాం
కుర మెడఁద సంకురింపఁగ
నరణ్య రోదనము సఫలమయ్యె నటంచున్ ౨౪

చ. వెడలుచు నున్న వారలము బిడ్డల పెండ్లికి; నేఁడు మూర్త; మి
క్కడ నడు రేయి గర్తమున గాఢతమంబునఁ దల్ల క్రిందుగాఁ
బడె నరదంబు; చక్రములు భగ్నము లయ్యె; నొడళ్లు నుగ్గుగాఁ
బడితిమి. చావు దప్పి యిటు బైటను బ్రోక్తన పుణ్య సంయుతన్. ౨౫

గీ. ఓ మహాభాగ! కడచిన నీ ముహూర్త
మింక నేఁడాది దనుక లే దీదృశంబు
అక్కటికఁ బూని మాకు నీ యరదమిమ్ము
నెగడుఁ బెండ్లొనరించు పున్నెంబు నీకు. ౨౬

క. ఈ గతి నభ్యర్థింపఁగ
నా గోత్రవరకుమారుఁ డవ్వారి యవ
స్థాగతిఁ గని జాలిం బడి
వీఁగఁగఁ దన డెంద మిచ్చి వేసె రథంబున్. ౨౭

క. నడువఁగఁ జాలని యా పసి
బుడుతల నిరువురను జంక బుచ్చుకొనియు నె
క్కిడుకొనియు వీఁపు బుజములఁ
గడుఁగడుఁ దొడిఁబడుచుఁ జనిరి కారడవిఁబడిన్. ౨౮

మ. తరువుల్ రాజకుటుంబకంబునకు ఛత్రవ్రాతముం బట్టెఁ; జా
మరముల్ తీవలు వైచె; హెచ్చరికలం బల్కెం బికశ్రేణి; య
క్కఱమై మంగళ వాద్యముల్ పతగ సంఘాతంబు మ్రోగించె భూ
వరు మాహాత్మ్య మెఱింగి నట్టు; లవి సేవల్ సేయునే కానిచోన్.

చ. మొకములు ద్రిప్పి చూడకయుఁ బోవుచు నుండెను బజ్జనుండి కా
ర్మొకములు, ద్రోవకుం దొలఁగి క్రేవకు గండశిలాతతుల్ చనెన్;
నకు లన ముండ్ల మొత్తములు శాతతఁ బాసి మృదుత్వ మొందెఁ; దీ
వ్రికరుఁడు సూపె మిత్త్రతను రాజకుటుంబము పోవునత్తఱిన్. ౩౦

చ. చనిచని వారు కన్గొనిరి శైలము నొక్కఁడు, దాని నంటి ప్ర
క్కనె ప్రవహించు నిర్ఝరనికాయముఁ, దన్నికటంబునందుఁ జ
క్కని పొదరిండ్లు, స్నిగ్ధ తరుకాండము, నచ్చటఁ గ్రొళ్లువాఱుచుం
గనులకు విందు సేయు హరిణమ్ముల, గొండ్లి నొనర్చు నెమ్మిలన్.

సీ. భక్తియుక్తంబుగాఁ బాద్యంబు నర్పించు
నెల్లప్పుడా సెలయేళ్లజాళ్లు
హృదయపూర్వకముగా నిచ్చు నర్ఘ్యంబును
దినదినంబా పూవుఁదీవగములు
ఆప్యాయనమ్ముగా నాహార మర్పించుఁ
జేతికి నా పండ్లచెట్లపిండు
ఆర్ద్రచిత్తంబుతో నడుగు సేమంబును
గలకల కూయు నా పులుఁగుతండ
గీ. మన్నిటికి మిన్న యేమన నచట వెలసి
యున్న శ్రీశాంతిదేవి మహోత్సవమున
నమృతవాక్కుల దీవించు నరుగుదెంచు
నతిథిబృందంబునకు మహోన్నతి ఘటింప. ౮౨

సీ. తాపసేంద్రులకు నిత్యమును శుశ్రూషింపఁ
గ వసంతలక్ష్మి మేల్కాంచి యుండు
మునిపుత్త్రికలు గాత్రముల నెత్తి పాడఁ బో
గండుఁగోయిల శ్రుతిఁ గలుపు చుండు
బ్రహ్మచారుల వేదపాఠంబులోఁ గీర
వరశారికాళి కవల్లు దిద్దు
సామగానమునకు శైలంబు హృదయంబు
కరఁగి నిర్ఝరములై పఱచుచుండు
గీ. నకృతక మనోహరములైన యచటి యుటజ
కంబు లానందరాజ్య శృంగాటకములు
ఋషిజనైక తపోధన క్షేత్రమైన
యా వనాంతరంబు స్వర్గతుల్యములనంత. ౮౩

క. కనులకు వీనుల కొడలికి
మనంబునకు ఘ్రాణమునకు మరి జిహ్వకు విం
దొనరించెడు నా కోనను
జనవరుఁడు వసింపఁ దలఁచె సకుటుంబముగన్. ౮౪

క. తమకై వనదేవత సి
ద్ధము సేసిన కరణి రమ్యతరమైన కుటీ
రమునందు విడిసి యటఁ గం
దమూలఫలభోక్త యగుచుఁ దప మొనరించెన్. ౮౫

క. అలరుంగొమ్మలఁ గొమ్మలు
నలహరిణార్భకములందు హరిణార్భకముల్
చిలుకలలోపలఁ జిలుకల
వలెనై విహరింతు రచట బాలు రిరువురున్. ౮౬

క. రాజుల రాజత్తతి ముని
రాజై తృష్ణాక్షయంబుఁ గ్రమమునఁ గొని నీ
రేజదళవారిబిందువు
నోజను సంసృతినిఁ దాఁకియుం దాఁకఁ డొగిన్. ౮౭

సీ. మీమాంసకమతంబు మేకొని వాదించు
నొకకర్మఠుండు మహోన్నతముగఁ
గాణాదమతము వక్కాణించు లెస్సగా
నొక సంయమీశ్వరుం డుజ్జ్వలముగ
సాంఖ్యాగమమతంబుఁ జర్చించు వీఁకమై
యొక్క తత్త్వజ్ఞాని మిక్కుటముగ
అద్వైతమతము సిద్ధాంతించి భాషించు
నొక పారకాంక్షి సయుక్తికముగ

గీ. న్యాయ యోగమతంబుల నాశ్రయించి
వాద మొనరింత్రు కొంద ఱా సాదుతోడఁ
దనదు మతధర్మము లతండు తఱచి తెలుప
స్వమతమును వీడి వారు తచ్ఛాత్రు లయిరి. ౮౮

క. మొదలం బ్రకృతుల మూర్ఖత
వదలింపం దలఁచి యా తపశ్చర్యఁ గొనెన్
తుది నది యతనికి నిర్వా
ణదమై యిటు ద్వ్యర్థసాధనంబుగ నయ్యెన్. ౮౯

క. వ్యసనంబుల నన్నింటిని
గసిమసఁగెను మూలముట్టు కానీ దాన
వ్యసనము విడదయ్యెను మా
నస మింగువకట్టుగుడ్డ నాఁగ నతనికిన్. ౯౦

చ. అతఁడు తపఃక్రియా వ్యవసితాత్మకుఁడై పరమార్థచింతనా
యుతుఁడయి ప్రొద్దులం గడుపుచుండఁగ నీక్రియ నొక్క బ్రాహ్మణుం
డతిగమన ప్రయాస శిథిలాంగుఁడు స్విన్నకృశాననుండునై
అతిథిగ వచ్చె నొక్క దినమందున బ్రాహ్మణి వెంట నంటఁగన్. ౯౧

గీ. వచ్చుచుండిన విప్రదంపతులఁ గాంచి
భక్తి నెదురేఁగి రాజర్షి వారిఁ దెచ్చి
యర్ఘ్య పాద్యంబుల నొసంగి స్వాగతంబు
నర్పణము సేసెఁ దనడెంద మలర నెలమి. ౯౨

క. మరియుం బల్కెను గౌరీ
పరమేశ్వరు లట్లు మీరు వచ్చుట మే మె
ల్లరముఁ గృతార్థుల మైతిమి
పరఁగెన్ మా యాశ్రమంబు పావన మయ్యెన్. ౯౩

క. భవదీప్సిత మెయ్యదియో?
వివరింపుఁడు కొడుకు వదలి పిఱువీఁకను నా
సవిధమున నున్న సర్వం
బవుఁ గాదన కిచ్చువాఁడ నభ్యర్థులకున్. ౯౪

మ. బహుకాలంబుననుండి యాచకులు మా ప్రాంతంబు రాకుంట దు
స్సహ సంతాపమునందు మ్రగ్గెడిని మత్స్వాంతంబు కట్టా! సుదు
స్సహపాపంబు శిరంబునం బడిన రోజుల్ బట్టు చింతింతు సం
స్పృహణీయం బగు పర్వవాసరముగా నీ నాఁడు నే నెంచెదన్. ౯౫

క. అని వినయవిధేయతలను
గనఁబఱచెడి జేనిఁ గాంచి బ్రహ్మాసురుఁడు మదిన్
వెనుకాడుఁ గొడుకుఁ జూచును
దన బ్రాహ్మణి మొగము గద్గదత్వము నొందున్. ౯౬

క. సవరించుకొనుచు గొంతుక
నవనీపతితోడఁ బలుకు "నార్యా! నేత్రో
త్సవముగ నీ క్రీడించెడు
భవత్సుతుల" ననియుఁ బలుకఁ బైపలు కోడెన్. ౯౭

గీ. మరలఁ గొంచె మాఁగి మజ్జిగకై వచ్చి
ముంత దాఁచు కొన్న పోల్కి గాదె!
హృదయ వాంఛితంబు నెఱిఁగింప కుండుట
యనుచుఁ దెలుపఁ దొడఁగె మనసు మాట. ౯౮

చ. పలువుర బిడ్డలం గనెను బ్రాహ్మణి మాదృశ మందభాగ్యు లి
క్కలియుగమందుఁ బుట్టరను గాంచగ నోచము వారి ముద్దుమో
ములుఁ గడుఁ దియ్యఁబల్కులును ముచ్చటలచ్చట లాటపాట లా
ఖలుఁడు యముండు మా కనులుగప్పి హరించెను వారి నందఱన్.

సీ. చిన్నారిపొన్నారి చిగురుచేతుల మూసి
ముద్దులమొగము దోబూచులాడ
ముత్యాల విరఁజిమ్ము పోల్కిఁ జక్కిలిగింతఁ
గిలకిల నవ్వుచుఁ గెరలియాడఁ
బిలువంగ డాయక వెంటాడ నందక
బుడిబుడి పారాడి పోవుచుండ
వచ్చియు రానట్టి పలుకులఁ జూపుచుఁ
బరులపై నేరముల్ పలుకుచుండ
గీ. హర్ష సాగరమున నోలలాడుచున్న
తల్లిదండ్రులె నిజముగా ధన్యతములు
వారె పుణ్యాత్ము లవ్వారె భాగ్యపరులు
ఎల్ల పెఱవా రిసీ! దురదృష్టపరులు. ౧౦౦

క. మొదలం బుత్రులు లేమినిఁ
బొద లెడు నెదమంటకన్నఁ బుట్టి కెడయ బె
ట్టిదమగుఁ; బగతురకును వల
వద యీదృశమైన పీడ బహుజన్మలకున్. ౧౦౧

చ. కడుఁగడు బాష్పముల్ తొరుగఁ గంటికి మంటికి నేకధారగా
విడుమరలేని చిత్తమున బిడ్డలకోసము వాచివాచి యి
ప్పుడమిని వారి వీరిఁ దమపుత్రుల నిమ్మని కోరికోరి వ్య
ర్థుఁడనయి వచ్చినాఁడ విధిఁ దూఱుచు నా దురదృష్టరేఖకై. ౧౦౨

క. నీ పుత్రులఁ జూడంగనె
మా ప్రాణము లేచివచ్చె మారాడక మా
కీ పుత్రుల దయసేయుము
ప్రాపింతువు దేవయానపథ మక్షయమున్. ౧౦౩

ఉ. ఇవ్విధిఁ గోర విప్రుఁడు మహీపతియుం దురటికాల మాత్రలో
నెవ్వగఁబొంది వాసనలు నిర్విషయం బయి డిందియున్న నా
మవ్వపు ముద్దుమూర్తులను మానికముల్ వలె వెల్గు బాలురన్
దువ్వుచు మూరుకొంచుఁ దలఁదోఁచగ నిల్చెను గాంచు చాసలన్.

క. అటులున్న జేనిఁ గని యి
చ్చట నస్మద్వాంఛితంబు సఫలంబగు ము
చ్చట కన్పడ దని పాఱుఁడు
కటకటపడు; నీరుఁ గ్రుక్కుఁ గన్నులఁ; బొగులున్. ౧౦౫

క. పరికించి విప్రుదైన్యము
ధరావరుఁడు "త్వాదృశులకు దానపు సేఁతన్
దరియింతును ముమ్మాటికి
ధరామరా! సంశయింతుఁ దగ నొక్కటికిన్. ౧౦౬

చ. చనియెను గందమూలఫలజాలము దేరఁగ వీరితల్లి కా
ననమున; కింతవచ్చును; క్షణంబు సహింపుఁడు విశ్రమింపుఁ డ
జ్జననియుఁ గూర్మిఁగాంచి కడసారిగ మూర్కొని మోముదమ్ము ల
ప్పన మొనరించు నర్థమగు స్వాత్వము తల్లిదిగాదె? బిడ్డలన్. ౧౦౭

క. నవమాసంబులు మోచియుఁ
గవుఁగిట నల్లారుముద్దుగాఁ బెంచిన త
ల్లి విలాపింపదె? చూపమి
నవనీసుర! నేఁ గృతఘ్నుఁ డగుదు నిజముగన్." ౧౦౮

గీ. అనుడుఁ బెదవిని విఱిచి బ్రాహ్మణుఁడు వలుకు
"మొలకనవ్వులఁ గాయు మోముల వెలుంగు
మోహనాకారులైన యీ బుడుతవాండ్రఁ
జేతులారంగఁ దల్లి మా చేతి కిడునె? ౧౦౯

క. ఈ నెపమునఁ దప్పింపఁగఁ
బూనితె? నీ మాట నోట బొంకక" యన్నన్
వీనులను మూసి సిగ్గున
నాననమును వాంచి భూవరాగ్రణి వలికెన్. ౧౧౦

క. ధరణీ సురేంద్ర! విశ్వం
తరుని కళత్రంబు భిన్నతన్ నొడువు నెడన్
బరమార్థం బిది శశిభా
స్కరులగతుల్ తప్పు; మద్రసన యూడిపడున్. ౧౧౧

క. తలఁపుం బలుకుం జేఁతలుఁ
బలు తెఱఁగులఁ గానఁబఱచు పలువను గా నో
జలజాసనగర్భాన్వయ !
పలుకులు వేయేల? యిత్తు బాలుర నిదిగో! ౧౧౨

క. కొనుమని తనప్రాంతంబున
వినోదముగ నాడుచున్న బిడ్డ లిరువురన్
మనమునఁ ద్యజించి తగులముఁ
దనివొందఁగ బ్రాహ్మణుండు దాన మొనర్చెన్. ౧౧౩

మ. తన గాత్రంబును దొట్టి యెల్ల యదియున్ దానంబుఁ గావింపఁ బూ
నిన పుణ్యాత్ముఁడు పుత్రదానమునకున్ వెన్కాడునే? స్వార్థసా
ధనమాత్రైకమతిం బరస్పరము సందర్శించుకోనీక బ్రా
హ్మణుఁ డా తల్లిని బిడ్డల న్నెడపి పాపాచారుఁ డయ్యెం దుదిన్.

క. పెన్నిధులఁ గన్న పేదల
తెన్నున నా యాల్మగల్ మది మహాముద్వా
రాన్నిధి మునుంగఁ గొని యా
పిన్నలఁ జని రేడ్వ వారు బిక్కమొగములన్. ౧౧౪

చ. కళకళలాడు ముద్దులమొగంబుల విన్నదనంబు దోఁప న
స్రుల జడిఁ జేసి యెఱ్ఱవడఁ జూపులు వాచి రుదింత్రు; తండ్రి వై
పుల కల కేలు సాఁచుదురు పొక్కుచుఁ; జంకలనుండి జాఱుచుం
బలుమఱు గింజుకొందురు పసిపాపలు; పిల్తు రెలుంగు రాల్పడన్.

క. ధనమపహరించి చరచర
గనఁబడకయ పాఱు చోరుకరణిని వారల్
తనయులఁగొని త్వరితగతిన్
వనతరుషండాంతరమునఁ బడి చని రెటకో! ౧౧౭

క. చెలియలనఁగ వనలక్ష్మికి
వెలందుకలమానికంబు విశ్వాంతరరా
ట్తిలకుని కళత్రము కుసుమ
ఫలపత్త్రాదుల గ్రహించి వచ్చుచు నుండన్ ౧౧౮

ఆ. వె. తోట్రుపాటు గదిరి దోసిటి పూదొప్ప
నేలజాఱె రాలెఁ బూలు క్రిందఁ
గంటకంబు గాఁడెఁ గాలెను బాషాణ
హతుల జేసి నెత్తు రంఘ్రులందు! ౧౧౯

చ. చెలువముగ్రుమ్మరింపఁ బెడచిందులు ద్రొక్కుచు మోహనాస్యమం
డలములఁ గుంతలంబు లెలనవ్వు నటింపగ మోవిమూలలం,
బిలుచుచు 'నమ్మ! అమ్మ'యని మీఁదికి సాఁచుచుఁ జిన్ని చేతులన్
లలితవిలాసయానముల నా పసిపాపలు రా రదేలొకో! ౧౨౦

ఆ. వె. చిన్నఁబుచ్చుకొన్న తెన్నునఁ దమ చెన్ను
చెదరఁ దోఁచుఁ బూవుఁబొదరుటిండ్లు
ఆశ్రమాంగణంబు నందు బాలకురంగి
కనుల కొమ్మపములను గార్చుచుండె ౧౨౧

క. చిలుకలు కూయవు; కోకిల
ములు పాడవుఁ; దేంట్లు పుష్పముల వ్రాలవు ము
ద్దుల నాదు చక్కనయ్యల
పలుకులు వినఁబడ విదేమి పాపమొ! యనుచున్. ౧౨౨

ఆ. వె. డెందమందు బెగ్గడిల్లుచు నయ్యింతి
యాశ్రమంబుఁ జొచ్చి యాత్మజులను
గాంతు చెంత నైనఁ గనక యమంగళ
శ్రవణభీతి నడుగ రాక నిలిచె. ౧౨౩

క. పగలిటి జాబిలి కరణిని
మొగంబు నిష్కళముగాఁగ ముంగటఁగల య
మ్మగువను గని లజ్జించుచు
వగపున క్షణ మూఱకుండెఁ బలుకక పతియున్. ౧౨౪

ఆ. వె. అడుగఁజాల కాపె నుడువఁజాల కతండు
నొకరు సూచుకొనుచు నొకరిమొగము
గ్రుడ్లనీరు గ్రుక్కుకొనుచు బింబప్రతి
బింబనముల యవ్విధంబుఁ గొనిరి. ౧౨౫

క. కొలఁదితడ విట్లు వారలు
నిలువంబడ మెల్ల మెల్ల నెలఁతకుఁ బతి పి
ల్లలకథ నామూలాగ్రము
తెలిపి క్షమింపుమనె నానతింగొని యీమిన్. ౧౨౬

క. తన పుత్రదానమును విన
వనితామణి మేన గగురుపా టడరెఁ దదా
ననమునఁ గ్రమక్రమంబునఁ
దనరె సముజ్జ్వలత; సమ్మదంపడెఁ బతియున్. ౧౨౭

క. "మన భాగ్యం బేమందును!
గనితిమి యాచకుని( బెద్దకాలంబున క
య్యానఘుండు తనివి( బొందెను
మనమున( జింతింపనేల మన" కని సతియున్. ౧౨౮

ఆ. వె. సాధువాదములును సంతోషనాదముల్
జయజయారవములు చదలనిండె(;
బూలవాన గురిసె( బుణ్యదంపతులపై;
ముందు నిలిచి దివ్యమూర్తి యొకఁడు. ౧౨౯

క. "మాతలిని నింద్రసారథి(
బ్రీతుండై మీదు నీవి( ద్రిదివంబునకుం
దోతె మ్మనె నీ యర్థి
వ్రాతము నీ కడ కతండె పంపెను జుమ్మా! ౧౩౦

క. వడ(బోసిన పీయూషము
పదువున సంతప్తమైన స్వర్ణంబువలెన్
గడు(గడు వెలుంగు చుంటివి
పడి ముక్కా(కలను రాజ! వాసవుకతనన్." ౧౩౧

చ. అనుడు నృపాత్మజుం డను "మహామతి! ఇంద్రున కాచరించి వం
దనమును నాకు మాఱట( గృతజ్ఞత( దెల్పుము; నాకు మేలుగా(
గన(బడు స్వర్గలోకమున కన్నను మానవలోక మిందు యా
చనకులు వత్తు రి కోర్కె మెయి; స్వర్గనివాసులు పూర్ణకాములల్.

గీ. అమరలోకంబు నందు సౌఖ్యములు పెక్కు
లనుభవించుట కన్న నయ్యావసరముల
నోడలు గోసియు నొస(గుట యుచితతరమ
విబుధనాథున కివ్వార్త విన్నవింపు." ౧౩౩

చ. పలుకఁగ నీగతిన్ దిరిగిపల్కక వీడ్కొని రాజపుత్రి మా
తలి చనె; నంత స్వపత్రిజలు తండములై యరుదెంచి దేవరా!
తెలియక నీకు నీ యపకృతిం బొనరించిన యట్టి పెద్దద్రో
హులము మముత్ క్షమింపుముమహోన్నతిఁగై కొని యేలు మిద్ధరన్.

క. కొనితెచ్చి యిచ్చి రొక బ్రా
హ్మణదంపతు లెట్లొ నీ కుమారులను భవ
జ్జనకునకు; వార లచ్చటఁ
దనియించుచు నున్నవారు దాతను నవ్వన్. ౧౩౫

క. అని విన్నవింప నాతఁడు
తన తపమున జనుల మూర్ఖత నశించెఁగదా!
యనియును బుత్రిలు సేమం
బున నున్నారనియుఁ బొంది మోదముఁ బలికెన్. ౧౩౬

ఆ. వె. "చింకిపాఁత నట్లు చిలువ సీద్రము నట్లు
పెద్దకాల మయ్యె విడిచి రాజ్య
మతుకుకొనఁగఁ జాల నరుగుఁడీ! మీ"రని
హితము కఱపి యనిపె నిరవులకును. ౧౩౭

క. అమృతం బామ్లం బగు; ర
త్నము మసిబొగ్గౌను; నందనము జీర్ణార
ణ్యమగును; రాజ్యము మలకూ
పమ; తృష్ణాక్షయసుఖంబు వడసిన మదికిన్. ౧౩౮

# శు ద్ధ బో ధి జా త క ము

క. తరతరముల నుండి మహా
త్తరమై వహ్నివలెఁ బూతతరమై ధర్మో
త్తరమై పుణ్యక్షేత్రము
కరణిని నొక విప్రకులము గలదు ధరిత్రిన్. ౧

ఆ. వె. పాలసంద్ర మందుఁ బ్రభవించి యున్నఁ జం
ద్రుం డిసీ! కళంకదూష్యుఁ డయ్యె;
బ్రాహ్మణాన్వయమునఁ బ్రభవించి మన బోధి
సత్త్వుఁ డత్యుదారచరితుఁ డయ్యె. ౨

క. చదువుల సరస్వతియుఁ, బ
ల్లిద మగు గొనములకుఁ గూడలి, యశోలతకుం
గుదు, రక్రోధనుఁ, డట్టిం
డుదయింపఁడు ప్రాయికముగ నుర్విని నెప్పుడున్. ౩

క. ప్రేయస్త్వము, సత్పురుష
జ్యాయస్త్వము, శేముషీమహత్త్వముఁ, గరుణా
భూయస్త్వము; విద్వజ్జన
గేయత్వము వడసి యతఁడు క్షితిఁ బెంపుగొనెన్. ౪

గీ. ధర్మదేవత మంత్రిపదంబు నొందెఁ
దత్త్వబోధంబు తగు కార్యదర్శి యయ్యె
సత్త్వసామగ్రి మిత్రరాజముగ నయ్యెఁ
బ్రాయమును బొందియున్న యా బ్రాహ్మణునకు. ౫

క. తన తాతలు ముత్తాతలు
జనకుండును దన కొసంగు జ్ఞానక్షేత్రం
బును సేద్యం బొనరిచి వి
న్ననువుగఁ దా శుద్ధబోధినామము వడసెన్. ౬

గీ. సాభిలాషంబు చారుదృశ్యమును గనఁడు;
ఆలకింపండు శ్రావ్యపికారవంబు;
మూర్కొనంబోఁడు సురభిళపుష్ప మేని
నిండు జవ్వన మందుఁ గన్పించు నతఁడు. ౭

గీ. కొలిచి కూఁకట్లు పెండిలి సలిపియున్న
కొమ్మ బంగారుబొమ్మయై చిమ్మ మరులు
ప్రళయ పవనాక్షుభితవార్ధి పగిది నతఁడు
కదలఁబాఱని యంతరంగమునఁ గ్రాలె ౮

*

ఆ. వె. కత్తిపైని సాముఁ గావించు వడువున
బావియొడ్డునందుఁ బండినట్లు
చిచ్చు నొద్దఁ జిన్నచితు కున్నగతి వాని
యువతి తోడి మనికి యొప్పుచుండె. ౯

క. ఘనతర నితంబసింహా
సనమున స్మిత మనెడి ఛత్రచామరములతో
స్తనకనక కలశములతో
మనోజు రాజ్యరమ నాఁగ మగువ వెలింగెన్. ౧౦

గీ. ఆ తరుణి నూఁదుకొని మీనకేతనుండు
నిలిచి ముక్కంటిగాఁ బతిం దలఁచి యెడఁద
నిట్టనిలువున నీఱయి నేలఁబాఱి,
వాఁడి చేముల్కి యూఁడనిబాడఁ దవ్వు ౧౧

సీ. తన మనోహరుని సుందర వక్త్రబింబంబు
నాదర్శఫలకంబుగాఁ దలంచుఁ
తన కాంతు లలితముగ్ధకటాక్షవితతిని
సర్వాంగములకు భూషలుగఁ దాల్చుఁ
దన నాథు సద్గుణతండంబు సామ్రాజ్య
విభవలాభముగ భావించుకొనును
దన ప్రాణపతి యశస్తరుణీలలామంబుఁ
జెలిమికత్తియనుగా సలుపుకొనును
గీ. పతిహితాచారముం బూని భవ్యమైన
భర్తృవాల్లభ్య మార్జింపఁ బ్రియతపడును
అల శశాంకుని రోహిణి వలెను గొలుచు
నలఁతి దవ్వుల వసియించు చతని వెలఁది. ౧౨

సీ. సతి శిష్యురాలయి సవరింప శుశ్రూషఁ
బతి దేశికుఁడయి తత్త్వంబుఁగఱపు
సతి పెద్దవరవుడై సలుప నూడిగములఁ
బతి స్వామియై ప్రసన్నత వహించు
నెచ్చెలియై సతి నెనరుఁ జూపఁ గడింది
పతి చెలికాఁడయి పఱపు నెనరు
గృహలక్ష్మియై సతి యెలయింప సతతంబు
గృహవిష్ణువై పతి యెలయఁ జేయు
ఆ. వె. నిండుజవ్వనమున నుండియు వృద్ధుల
యవ్విధమున వదలి మోహికేచ్ఛ
బ్రహ్మచర్యదీక్షఁ బాటింతు్రి దంపతుల్
వింతవడుచుఁ గాంచ విబుధవరులు. ౧౩

సీ. పతి వల్కలముఁ దాల్ప సతి వల్కలముఁ దాల్చుఁ
                బతి భస్మ మలఁదిన సతియు నలఁదుఁ
    బతి జడల్ దాల్చిన సతి జడల్ తాల్చును
                బతి స్నానమాడిన సతియు నాడు
    పతి యుపాసం బున్న సతి యుపాసం బుండుఁ
                బతి పూజసేసిన సతియుఁ జేయు
    పతి వల్కకుండిన సతి వల్కకుండును
                పతి వల్కరించిన సతియుఁ బల్కు
    ఆ. వె. పతి కనంగఁ దన్ను సతి కాంచుఁ బతివంకఁ
        బతి తపం బొనర్ప సతి యొనర్చు
        నీడ వోలెఁ బతికి నెలఁతలమానికం
        బెల్ల వెంట లందు నెలయఁజేసె. ౧౪

        క. శ్రుతి గలిసిన పాటవలెన్
        రతనంబును గూడుకొన్న రతనంబు వలెన్
        క్షితి విధియుత యగు శ్రద్ధయు
        గతినిఁ దదర్ధాంగి యుచితగతిఁ దనరారెన్. ౧౫

చ. తరుణి తపోంతరాయ మని తత్సహవాసము రోసి కాననాం
    తరమున నాడుపుర్వయినఁ దారని తావునఁ గాపురింతు రొం
    దఱు మును; లిమ్మహాత్మునకుఁ దత్సహవాసమె దోహదంబుగా
    బరఁగ నిరంతరాయ మయి వర్తిలుచుండెఁ దపఃక్రియల్ తగన్.

        క. అనురూప మనుప్రాయం
        బనుగుణ మనువర్తనంబు ననుభావంబై
        తనరుచు నా దాంపత్యము
        కనువిందును జెవులవిందుఁ గావించె భువిన్. ౧౬

క. రతిమన్మథుల ట్లా దం
పతు లాకర్షక సురూపవైభవు లయ్యున్
వితత ప్రణయులు నయ్యున్
జితేంద్రియత నొంది వారు సెలఁగుదు రెపుడున్. ౧౮

ఆ. వె. సతియె మేలుబంతి పతి కందు రా జంటఁ
బతియె మేలుబంతి సతి కటండ్రు
సత్యదాన శౌచశమదమాదుల స్పర్థ
గొనినరీతిఁ గూర్చికొనిరి వారు. ౧౯

క. ఆతఁడు వసిష్ఠుఁ డని సా
ధ్వీతిలకము దా నరుంధతీ దేవియుఁగా
బ్రీతినిఁ దత్కాలజన
వ్రాతము గొల్వం దొడంగె వారి నిరువురన్. ౨౦

గీ. అలరుచున్నను వారు గృహస్థవృత్తి
వెలయుచుండ్రు వానప్రస్థవృత్తి యంచె
వనమునందున్న గృహమున వాసమున్న
నిర్విశేషంబ యీదృఙ్మనీషులకును. ౨౧

క. ప్రతిబంధ శూన్యమగు జీ
విత మింటను గడపుచున్న వృత్తికి సంపూ
ర్ణత రాదని కాఁబోలును
సతితో నతఁ డాశ్రయించెఁ జని యొక్కడవిన్. ౨౨

సీ. ఉన్నతికిం బోవు చున్న గొబ్బండుల
చెట్లమొత్తంబు నీక్షించుచున్నఁ
బండుల బరువుచే నిండి నేలకు వంగు
కొమ్మలుగల వృక్షకోటిఁ గన్నఁ

బరులకోసంబె జీవనములఁ దాల్చుచు
ననయంబు పాటు వాహినులఁ గన్నఁ
గంటకాదులు దమ్ముఁ గాడిన నిశ్చల
త్వమును మానని శిలాతతులఁ గన్న
గీ. మానవుని చిత్తమందు నే మాత్రమైన
జ్ఞానముండిన యెడల నశంకితముగ
సడలిపోదె? తనంత దోష ప్రవృత్తి!
పరులు బోధింప నక్కఱపట్ట కచట. ౧౩

చ. వలదనుమాట లే దెవరు వచ్చిన; నెన్ని దినంబు లున్న నోఁ
బలికెడువారు లే; గొకరివస్తువు లివ్వను మాట లేద; య
న్నలుఁ జెలియండ్రుఁ దండ్రులు జనంబు లటన్ వసియించువార లు
జ్జ్వలముగ నందు దైవియగు సంపద తాండవమాడు నిచ్చలున్.

ఉ. కాయలఁ,గందమూల ఫలకాండములన్ భుజియించుచుం దరు
చ్ఛాయలయందుఁ గాపురము సల్పుచుఁ దాల్చియు జీర్ణమైన కా
షాయపటంబు, ద్వంద్వముల సైఁచియు నీ యువమాని దంపతుల్
సేయఁ దొడంగి రయ్యెడఁ బ్రసీస్థితులై తపముం ద్రిసంధ్యలన్.

ఆ. వె. చక్రవాకయుగము సరణి నన్యోన్యంబుఁ
బాసిపోక రేయుఁ బవలు వారు
యోగసాధనాను యోగతపఃక్రియా
చరణములను బ్రొద్దు జరుపుచుండ్రి. ౧౬

క. పసుపాడి యొక్కనాఁడిం
పెసఁగంగా మడుఁగుఁ దాల్చి యెప్పటివలె నా
త్మ సమీపారణ్యమునకుఁ
గుసుమాపచయార్థ మరిగెఁ గోమలియుఁ దగన్. ౧౭

క. ధన బల సురూప నవయౌ
వనమదముల మూసపోసి బ్రహ్మయనంగాఁ
జనుదెంచెను దగి యొక్కఁడు
జననాథసుతుండు యువతిసహితుం డటకున్. ౨౮

గీ. అతఁడు దశవత్సరప్రాయ మందె మరగెఁ
జుంబనాలింగనక్రియాసుఖ మొసంగు
బాలికలఁ; గన్నుగీటెను బానిసలను;
దరుణుఁడగు వాని సంగతిఁ దడవనేల? ౨౯

క. సందుల, గొందులఁ, జల్లని
పందిళ్లను, బూవుఁబొదల, వాపీవితతిన్
సుందరులఁగూడి యాతఁడు
కందర్పారాధనంబుఁ గావించెఁ గడున్. ౩౦

క. సుదతి యొకతె వాయింపఁగ
మృదంగ, మొక్కరితె వీణ మీటఁగ, లయయున్
మదిరాక్షి యొకతె వేయఁగ
ముదిత యొకతె సేయ లాస్యము నతం డలరున్. ౩౧

సీ. పురుషవేషముఁ దాల్చి పొలఁతి యొక్కతె కూడు
యువతివేషముఁ దాల్చి యున్న పతిని
సవతివేసం బూని పువుఁబోఁడి యొకరిత
చెలువునిఁ గవయు మచ్చిక లొనర్చి
పందెంబు గెలిచి సపత్నులు తెల్లబోఁ
గొని చనుఁ బతి నొక్క కోమలాంగి
ఆర్తిని నటియించి యనుసరింపఁగ భర్త
యేకాంతమున కేగు నింతి యొకతె

ఆ. వె. ఒకరి మొఱఁగి యొక్క రొకరినిఁ గికురించి
యొకరు మోసపుచ్చి యొకరి నొకరు
అలరుఁబోండ్ల మొత్త మహామహామికఁ గూడి
తనిసి రతుల నతనిఁ దనుపుచుండ్రు. 3౨

ఆ. వె. మదిరఁ బుక్కిలించు మదిరాక్షి యొకతె; భూ
విభుఁడు దేవురించు; వెలఁది యొసఁగ;
దడిగినట్టి నిముసమందె యొసంగిన
వస్తువునకు గౌరవంబు గలదె? 33

సీ. నిన్నుఁ బ్రతీక్షించుచున్నది సూ! ఋతు
స్నాతయై కుంతలనాథుకన్య
కాంచుచున్నది గవాక్షమునుండి మార్గంబు
వార మాట నవంతిపతి తనూజ
నిర్బంధపఱచుఁ బన్నిదము గెల్చుటఁజేసి
యంగదేశాధీశు ననుఁగుబిడ్డ
విడియంబుఁ బంపించి వేచియున్నది నీదు
రాకకై యుత్కలరాజకన్య

ఆ. వె. అనుచు దాసి సేయు మనవుల నాలించి
ధూర్తుఁడయి యొకొక్క తోయజాక్షిఁ
గవసి సాఁకుఁ బన్ని కంఠగ్రహ మొడల్చి
దుస్సిపోవు నతఁడు దూరమునకు. 3౪

క. తెగఁద్రావును ద్రాగించును
మగువలఁ దేలించు రతుల మరిఁ దాఁ దేలున్
బగ లనక సంజ యనకయు
వెగటుగొనక యతఁడు మరుల వెఱ్ఱెత్తంగన్. 3౫

క. కనకనలాడుచు మోహం
బనలం బనఁ గ్రొత్తక్రొత్తయంగన లను నిం
ధనముల వెదకుచునుండును
దనివింగొని చల్లఁబడద తగ నాతనికిన్. ౩౬

ఆ. వె. మచ్చుమందు సల్లి యిచ్చకంబులఁ బల్కి
కాంచనాంబరాశఁ గలుగఁజేసి
యభినవాంగనాళి నర్పింతురు తారుపు
క్షత్రియులు తదంతికమున సతము. ౩౭

క. లలనాసముదాయమునకుఁ
దలదువ్వును బూలుముడుచుఁ దమిమెయి దిద్దుం
దిలక మలందును గందము
బులియు నతఁడు సందుసూచి ముద్దులుగొనుచున్. ౩౮

గీ. అట్టిశృంగారి వసుధాధిపాత్మజుండు
వచ్చి పరివారనిర్మితపటకుటీర
కముల విడియించి రాణివాసమును, వెడలెఁ
దద్వనంబున విహరింపఁ దలఁపుపుట్టి. ౩౯

గీ. పువ్వులం గోయుచున్న యా పుణ్యయువతి
కపుడు దక్షిణలోచనం బదరఁదొడఁగెఁ
బెల్లిదంబుగఁ జిత్త ముద్విగ్నమయ్యె
జారెఁ బువ్వులపుటిక హస్తమున నుండి. ౪౦

క. పయనపుబడలిక లడఁగఁగ
దయితామణులెల్ల గాఢతను నిద్రింపం
బ్రియుల దిగనాడి యాతఁడు
బయలువెడలె వనము శోభఁ బరికింపంగన్. ౪౧

సీ. ఆపాదమస్తకం బల్లి పాదపముల
రమణీయముగఁ దోఁచు వ్రతతివితతిఁ
గొమ్మలం గూర్చుండి కొఱుకుచుఁ దత్ఫల
రసములఁ గ్రోలు కీరవ్రజంబు
నెయ్యంపుటలుకఁ బూనిన పెంటిపావురం
బును వెంటనంటు కపోతకంబు
సరసను ముద్దుముచ్చట లాడుకొనుచు మ
రంద మాస్వాదించు భ్రమరయుగము
గీ. ఆత్మవృత్తంబు నటియించినట్లు దోఁచి
కనులపండువుఁ గావింపఁ గాంచి యతఁడు
కొలఁదిసేపటి కుత్కంఠగొని కడింది
వచ్చుచుండెను దనరాణివాసమునకు. ౪౨

ఉ. అత్తఱిఁ దార్పుకత్తె తగ నాతని డగ్గఱి కాలు మ్రొక్కి భూ
భృత్తనయా! త్వదర్థముగ నివ్వనమెల్లను రోసి తెచ్చితిన్
బుత్తడిబొమ్మఁ గాంతలకు మోహము రేఁగును దానిఁ గాంచ; నే
కోత్తరవృద్ధిగా సిరుల నొందరె? త్వాదృశపుణ్యు లియ్యెలన్ ౪౩

క. చెంపకుఁ జేరెఁడు కన్నులుఁ
గెంపుల వెదఁజల్లుమోవి, గిరిక్రేపు లనన్
సొంపారు పయోధరములు
శంపాలతఁబోని మే నెసంగును సతికిన్. ౪౪

క. ప్రాంచద్రుచి శశిని సురా
ళించందగు దాని వదనలీలకు; నిరు లా
మించుంబోఁడి కురుల్ నే
త్రాంచలములు శఫరములకు నన్నాదమ్ముల్. ౪౫

క. చిదిపియు దీపము వెట్టం
గఁ దగ్గ పెనుసాగను వయసు గలిగిన యా చి
న్నది పరిథవిల్లుచున్నది
మదనుండు సవారిగొను హాయమాయి యనంగన్. ౪౬

క. తనయతిథి వగుట నీ కీ
వనదేవత యొసఁగఁగా నుపాయనమును ని
వ్వనితామణి సృజియించెనో?
యని తలఁతునుగాక కాన నతివ కలుగునే? ౪౭

క. త్రైలోక్య మెన్నితడవలు
గాలించిన దానిఁ బోని కామిని గనరా
దేలా? తినఁబోవుచు భూ
పాలక! రుచి యడుగవలయుఁ బద! చూపింతున్. ౪౮

క. అని విన్నవింప నతని వ
దనంబు చేటంతగాఁగఁ దన కరవలయం
బును బారితోషికం బిడి
చనియెను వెన్నంటి యువతి సందర్శింపన్.  ౪౯

శా. వ్యాకీర్ణంబగు కేశపాశము నితంబాభోగముం గప్ప, న
స్తోకశ్రీ వెదఁజల్లఁగా వదనచంద్రుం, డంగలావణ్య మా
హా కల్గింపఁగ దాగురింతలకు లోనై కావిపుట్టంబునం,
దా కాంతామణి కోయుచుండె నటఁ బూజార్థంబు పుష్పంబులన్.

క. ఆ నెలఁత విని పదధ్వని
స్థానపరిత్యాయముఁజేసి తలఁగక నిలువన్
భూనాథుఁడు దగ్గఱి తన
చే నవలాచిగురుఁ గేలు సేకొనఁబోయెన్. ౫౧

గీ. వాని ఘనసారవీటికా పరిమళంబు
వాని గళపుష్పమాలల వాసనలును
వాని మైపూఁతగంధంపు వలపుపిండుఁ
గ్రిమ్మ వెఱఁగంది మొగమెత్తి కొమ్మ గాంచె. ౫౨

క. కని యులికి స్వచిత్తాంధో
ళనమున కీ బెడఁదయే ఫలంబో? యనుచుం
జనియెఁ బరాఙ్ముఖి యయి పోద
వెనుకకుఁ బులిఁ గన్న లేడిపిల్లవలె వెసన్. ౫౩

ఆ. వె. తారసించి యంతఁ దారుఫుఁగత్తెయు
నాపె యడుగుదమ్ములందు వ్రాలి
పడఁతి! వీని చెట్టవట్టుము రాణివై
నేల నాల్గుచెఱఁగు లేలఁగలవు. ౫౪

క. అడవిం గాచిన వెన్నెల
వడువున నీ చక్కఁదనము వమ్ముపఱుప కీ
యొడయుని నగ రలరింపుము!
చెడిపోవక సార్థకంబు సేయుము బ్రదుకున్. ౫౫

క. గనిలోఁ బుట్టిన రత్నము
జననాథునిశిరసు నెక్కు సరణినిఁ దరుణీ!
వనచరివి నీవు మా రా
ట్తనయుని శిర సెక్కి వాని దాస్యముఁ గొనుమీ! ౫౬

గీ. చిటికవేసినమాత్ర నీ చెలువుకడకు
వేల్పుజవరాండ్ర హంపూర్వవృత్తి వత్తుర
వీథిఁ జనువేళఁ గిటికీల వీనిఁ గాంచు
యువతులకుఁ బోఁకము ఘ్వాదుచుండుసుమ్ము. ౫౭

క. నావుడు "ఛీ ఛీ పోపో
నీవెవతెవు? వీఁ డెవండు? నిప్పులతోడం
గావింపక చర్లాటముఁ
బోవుఁ" డని విదిల్చి త్రిప్పి మొగ మావలకున్. ౫౮

క. "బ్రతుకాస యున్న నీ పో
మతివేగము విడిచి దాల కరుగుఁడు; కడు ని
ద్రిత భుజగము మేల్కొలుపక
వ్యతిక్రమముచేత శాస్తి యగు నిక్కముగన్. ౫౯

క. అని కన్ను లెఱ్ఱవడ మన
మునఁ దనదగు నందచందములపై నేవం
గొని ధాతఁ బ్రివ్వఁదిట్టుచు
వనితామణి యుటజమునకుఁ బయనింపంగన్. ౬౦

ఆ. వె. ఒడుపుదప్పి వెడఁదపడగ త్తి బుసకొట్టి
పఱచు నురగి వెంటఁబడిన పగిది
మానభంగపడియు మానవేంద్ర సుతుండు
వెలఁదిమానికంబు వెంటఁ దగిలె. ౬౧

క. శాపోపహతుని సలుపక
యా పావని దయ దలంప నాయమఁ దగిలెన్
బాపాచారుఁడు, మోహా
త్తాపావిష్టుఁడు కృతజ్ఞతాబద్ధులో కో! ౬౨

గీ. తనదుమంత్రింబు పాఱమిఁ దార్పకత్తె
యెఱిఁగి యే పుట్టి మునుఁగునో? యిచటనున్న
ననుచుఁ బాఱుత కంటికెంపునకు నళికి
యింద్రజాలాంగనయ నా నదృశ్యయయ్యె. ౬౩

క. శ్యేనంబు కపోతినివలె,
శ్వానంబు కురంగిఁబోలె, సర్పిని శిఖిచం
దానను, దద్యువతీమణిఁ
బూనిక వెంటాడె నా ప్రభుబ్రువుఁ డచటన్. ౬౪

క. పులి నోరికండ వడువున
వెలఁదుక యా బారినుండి విడివడి తమ యా
కులగుడిసె దూఱి పతికడ
నిలిచెను దలఁ దడుముకొనుచు నిట్టూర్పగయన్. ౬౫

ఆ. వె. అడుగులోన వచ్చి యొడయుండు రోఁజుచుఁ
దడక విఱుఁగఁదన్ని గుడిసెఁ జొఱఁగ
నట సమాధి వదలి యార్చుచుఁ గనుఱెప్ప
లాసనము సడల్చి నతఁడు దోఁచె. ౬౬

చ. తనకడ కేఁగుదెంచు జనతాహృదయస్థతమం బడంపఁగాఁ
గనుఁగవనుండి వెల్వడెడు కాంతులమొత్తము, బ్రహ్మతేజ మా
ననమునఁ దాండవింపఁగ వినమ్రిలఁ జేయుచు నుద్ధతాళి, నా
జనవరు ముంగలం బరమశాంతుఁడు బ్రహ్మవరుండు గన్పడెన్. ౬౭

క. నరపతి రభసాగమనముఁ
దరుణీతనూకంప ముఖవిధంబులఁ గని భూ
సురవరుఁడు తద్రిహాస్యము
స్ఫురింపఁ గినియకయు సౌమ్యముగ జేనిఁ గనెన్. ౬౮

క. పరిమాఱిచి యా విప్రినిఁ
దరుణీరత్నము హరింపఁదలఁచి ధరిత్రీ
శ్వరసుతుఁడు లాగి యెత్తియుఁ
గరాచురిని దుముకఁబోయెఁ గరిపై హరినాన్. ౬౯

క. అడుగు రవంతయుఁ గదలద;
కడింది మిఱుమిట్లు గొనెను గనుదోయియుఁ; దుం
దుడుకొందఁగ డెందం బాడ
యఁడు చిత్తరుబొమ్మవోలె నచటనె నిలిచెన్. ౨౦

క. కళ దప్పుచుండె మొగమునఁ;
గళవళ మొడ నతిశయించెఁ; గంపమొదవెఁ గా
త్రుల; వాగ్బంధన మయ్యెను;
బులినిం గనుగొన్న మేఁకపోతునకు వలెన్. ౨౧

క. అలుగఁడు, కలఁగఁడు, పలుకం,
డల పాఱుఁడు; రాకుమారుఁ డనలంబు కడన్
గల తృణకణంబుగతి మదిఁ
దలడిల్లను మృత్యుముఖము దరిసితి ననుచున్. ౨౨

క. పులుఁగులరాయనిఁ గాంచిన
చిలువకువలె వ్రాలె నృపతి శీర్షము నేలన్
మెలమెల్ల; శ్లథాంగుండయి
తెలియక యసి జాఱ మొగ్గతిల్లె నతసికిన్. 23

గీ. పదియునాలుఁగు లోకముల్ భస్మరాశి
సలుపు కౌశికు దివ్యాస్త్రసంచయంబు
పెంపడఁగి మోకతిల్లె నిర్వీర్యమగుచు
బ్రహ్మతేజంబు నెవ్వాఁడు ప్రతిఘటించు. ౨౪

క. మృదువు సుతీక్ష్ణం బనుటకు
నుదాహరణ మిదియె; వాని యురుశీతలదృ
ష్టి దహింపఁజేయఁ దొడఁగెను
గదా! పరితాపతపనుఁ డగు క్షాత్రవరతనయున్. ౨౫

క. మరలను మొగమెత్తంగనె
తరుణీమణి గోచరించెఁ దల్లివిధముగన్
నరపతిసూనుని డెందము
పరివర్తన మొందె భక్తిపరిపూర్ణంబై. ౨౬

క. స్వాహావైశ్వానరులా!
ఆహైమవతీమహేశులా? గీర్విధులా?
శ్రీహరిరమలా? యని సం
దేహించెను విప్రదంపతిని భూపుఁడోగిన్. ౨౭

గీ. కాదు మంత్రంబు; మాయయుఁగాదు, మందు
మ్రాఁకులుంగావు; హేతు వీ మార్పుదలకు
ముగురుమూర్తులు నెఱుఁగరు ముని నిగూఢ
మగు మహాతేజపుబలంబు నన్యు లెంత? ౨౮

క. భోగిని దిద్దంజాలును
యోగిగఁ; దామసుని సాత్త్వికోత్తమునిఁగా
రాగిని విరాగిగా నిల
నోగును బాగుగఁ దపస్వి యుత్తమదృష్టుల్ ౨౯

క. మౌనమునఁ గఱపుఁ దత్త్వ
జ్ఞానముఁ; బ్రేమమున గెలుచు శాత్రవతతిఁ; గ
ల్యాణ మొనర్చును భువి దుః
ఖానుభవంబున; మహాత్ముఁ డతిలోకుఁడకా! ౩౦

క. "అపచార మొనర్చిన నను
శపింప కలుగకయు దృక్ప్రసారముకతనన్
ఉపదేశించెను జ్ఞానముఁ
గృప" నని కడు లజ్జనొందె నృపవరుఁ డెడఁదన్. ౩౧

క. ఆతనికథ యిట్లుండఁగ
నా తారుపుకత్తెవల్ల నలరుంబోండ్లు
ర్వీతలపతివృత్తము విని
భీతమతిన్ వచ్చిరటకె వెదకుచుఁ ద్రోవల్. ౧౨

క. సురతటినీతీరము లనఁ
బరమపవిత్రులయి పుణ్యావంతులయిన భూ
సురదంపతులను, బజ్జను
బరికించిరి ప్రీతిశయానుఁ బతిని వెలందుల్. ౧౩

క. అతికాముకు నత్యుద్ధతు
నతియౌవనరూపబలమదాయత్తుని నీ
గతి నిస్తేజు నొనర్చిన
క్షితిసురు మహిమకు వణంకి చేసిరి వినతుల్. ౧౪

క. మరియును విపదాశంకను
గరంబులను మొగిచి "తప్పుఁగాఁచి యొసఁగుఁడీ
కరుణఁ బతిభిక్ష మా" కని
చెఱఁగులు సాఁచిరి మొగంబు జిగి మాయంగన్. ౧౫

క. చల్లనిచూపుల వారల
యుల్లంబులు పల్లవింప నొగి నమృతంబుం
జల్లుచు, మాటలఁ దేనెల
జల్లులఁ గురియించు చిట్లు సల్లాపించెన్. ౧౬

క. పురుషార్థంబుల మోక్షము
చరమము; ధర్మార్థకామ సామంజస్యా
చరణంబునఁలభ్యంబగుఁ
బరమం బగు లక్ష్య మదియె ప్రాణులకెల్లన్. ౧౭

గీ. బహుముఖంబుల ధర్మంబు పరిఢవిల్లు
సత్యదాన తపశ్శౌచశాంతిదాంతి
ముఖగుణంబుల యార్జవంబును వదలమి
భవ్యమోక్షంపుఁ బ్రథమసోపానమండ్రు. ౮౮

క. తను ధ్వంసము సేసినవా
నిని ధ్వంసము సేయుఁ; దను మనిచినయతని మ
న్చు నటంచు శ్రుతిస్మృతు లె
ల్లను ఘోషిలు వేయినోళులన్ ధర్మంబున్. ౮౯

క. సతతంబు జనుఁడు ధర్మ్యపుఁ
గృతిచే ద్రవ్యము గడించి క్షితి నది ధర్మో
న్నతికయి వినియోగించుట
ద్వితీయసోపానమండ్రు దీనినిఁ బెద్దల్. ౯౦

క. ధనదాసుండయి పురుషుఁడు
పొనరించును ధర్మదూరముగఁ జేఁతలు; దా
నను లక్ష్యమైన మోక్షము
గనిపింపద చాయయేనిఁ గనుచూపులకున్. ౯౧

క. ప్రతిరుద్ధేంద్రియవేగత
సతిసిన్ ధర్మార్జనంపుసాధనమును గా
మతిఁ దలఁచి కాఁపురించుట
తృతీయసోపానమండ్రు దీనిని విబుధుల్. ౯౨

క. తటియం జాలఁడు మోక్షముఁ
దరుణీదాసుఁడగు నరుఁడు ధర్మార్థంబుల్
నిరసించి ప్రవర్తించుట
దురితావహకార్య మందుఁ దూర్చి మనంబున్. ౯౩

మ. మలభాండంబగు నీ శరీరమును సమ్మానించి శృంగారించి సేసి భూ
షలఁ జీనాంబరరాశి రేబవ లిదే స్వర్గం బిదే మోక్ష మం
చలరుంబోఁడులఁ గూడి మానవుఁడు లాస్యంబాడుచుం బాడుచుం
గులుకుం బంగరుతూఁగుటుయ్యెలల దూఁగుం దత్త్వసమ్మూఢుఁడై.

మ. నరజన్మంబు వహించినాఁడ నని యానందంబునన్ వీఁగుచుం
బురుషుం డక్కట! ఉత్తరోత్తరశుభంబుల్ పొందు నాలోచనం
బు రహింజేయక యౌవనంబుఁ జరితంబున్ వ్రేల్చి కామాగ్నిలో
ధరణిం బొందు నధోగతిం; దుదికి నుత్తాముయ్యన్మనస్కుండగున్. ౯౫

క. కడవంతకాయయును లోఁ
బడుఁ గత్తికి; శౌర్యధైర్యబలసాహసవం
తుఁడు తాఁ డెంత? త్రిమూర్తులు
పడిపోవఁగలారు కాలు వదనము నందున్. ౯౬

క. అని యుపదేశింపఁగ నా
మునీశ్వరుఁ, డపాస్తచిత్తమోహులయి వధూ
జనములు రాకొమరుండును
మనుష్యతను గొంటి మనుచు మతి నలరి రొగిన్. ౯౭

గీ. అమరగంగాంబువుల స్నానమాడినట్లు
కడిఁది శాపావసానంబు వడసినట్లు
మించు సిద్ధాంజనంబు లభించినట్లు
పొలఁతులును తాఁడుఁ దలఁచిరి మోహ మెడల. ౯౮

క. జనపతి పునఃపునర్వం
దనముల నొనరించి కుమారార్పణముఁ గోరియుఁ దాఁ
గనుఁగొన్న దృశ్యము సతీ
జనమునకు వచించుకొనుచుఁ జనె నెలవునకున్. ౯౯

క. ఆదర్శప్రాయంబుగ
భూదారసుతుండు రాజ్యమున ధర్మము న
ల్పాదంబుల విహరింపఁగ
జేఁదుగ విషయముల రోసి క్షితిఁ బాలించెన్. ౧౦౦

# సాధుపత్త్రము

| పుట | పంక్తి | అసాధువు | సాధువు |
|---|---|---|---|
| 2 | 18 | దలపించెదు | వలపించెదు |
| 4 | 23 | గీలు | గాలు |
| 18 | 23 | కట్ట! శ్వాపుచ్ఛము | కటకట! శ్వపుచ్ఛము |
| 29 | 12 | పిత్త్రాతిశయుని | పిత్త్రాశయుని |
| 32 | 3 | దొలంచు | దొలంచు న |
| ,, | 5 | . . డు వనిం | . . డవనిం |
| 38 | 14 | దేనై | దాలకై |
| 39 | 7 | బాటు | బాట్లు |
| 40 | 4 | . . .మునతండు నభిలషించె | . . .మున నతం డభి లషించె |
| 48 | 6 | సాదలను | సాదులను |
| 69 | 6 | బాహ్యి | బాహ్యియ |